సాక్షి 24|7

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం 31-8-2017



కొట్టు ఖాళీ

జిల్లాలో రేషన్ షాపులు	1,896
డీలర్లు లేనివి	121
మొత్తం కార్డుదారులు	8,07,274

- పంచదార దూరం
- కిరోసిన్ భారం
- బియ్యం సరఫరాకే పరిమితమైన రేషన్ డిపోలు

నెల్లూరు (అర్బన్) :

నిన్నమొన్నటి వరకు చిల్లర కొట్టు తరువాత రేషన్ డిపోల్లోని గల్లా పెట్టెల్లోనే కాసులు గలగలలాడేవి. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. పేదలకు సరఫరా చేసే కోటా సరుకుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా కోత విధించడంతో రేషన్ షాపులు ఖాళీ అయ్యాయి. మూడేళ్ల క్రితం వరకు 9 రకాల నిత్యావసర సరుకులు కార్డుదారులకు పంపిణీ అయ్యేవి. నాలుగు నెలల క్రితం వరకు బియ్యం, కిరోసిన్, పంచదార మాత్రమే ఇచ్చారు. అనంతరం వాటి పంపిణీకి ఎగనామం పెట్టారు. ఇప్పుడు రేషన్ డీలర్లు కేవలం బియ్యం పంపిణీకి మాత్రమే పరిమితం అయ్యారు. రానున్న రోజుల్లో కార్డుదారులకు బియ్యానికి బదులుగా వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుండటంతో రానున్న రోజుల్లో రేషన్ షాపులన్నీ మూతపడే పరిస్థితి దాపురించబోతోంది.

ఆహార భద్రతా చట్టానికి తూట్లు

ప్రజాపంపిణీ అనేది ఇప్పటి - మిగతా 2లో..



2 లో

ఇటీవల స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలను పరిశీలిస్తున్న ఎస్పీ రామకృష్ణ (ఫైల్)

రెడ్ లిస్ట్ రెడీ

- ఎర్ర చందనం స్మగ్లింగ్‌లో 50 మంది కీలక వ్యక్తుల గుర్తింపు
- నిందితుల కోసం కొనసాగుతున్న వేట
- రెండు కీలక కేసుల్లో 30 మంది అరెస్ట్
- నిందితుల్లో విదేశీయులు, ఇతర రాష్ట్రాలకు చెందిన స్మగ్లర్లు
- సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక నిఘా

చంద్రబాబుకు విశ్వసనీయత లేదు

- నవరత్నాలను ప్రతి ఇంటికీ తీసుకెళదాం
- నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

7 లో



నవరత్నాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ మేకపాటి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్, నాయకులు

నీటి పరీక్షలు గాలికి..


ఆర్‌డబ్ల్యూఎస్ గోదాములో నిరుపయోగంగా నీటి పరీక్ష కిట్లు

కోవూరు: ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసే ప్రక్రియ ఆగిపోయింది. గ్రామీణ ప్రజలకు శుద్ధి చేసిన నీటిని అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నీటిని పరీక్షించే కిట్లను సరఫరా చేసింది. కానీ.. అవన్నీ అటకెక్కాయి. గ్రామాల్లో ప్రజలకు సరఫరా చేస్తున్న నీటిని పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు పరీక్షించాల్సి ఉండగా.. ఆ ప్రక్రియ ఏ గ్రామంలోనూ కొనసాగడం లేదు. ఫలితంగా శుద్ధి చేయని నీటినే ప్రజలు తాగాల్సి వస్తోంది.

శిక్షణ ఇచ్చినా..

గతంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లకు నీటి పరీక్ష విధానంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన ఆయా శాఖల సిబ్బంది, ఏఎన్‌ఎంలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సహాయంతో స్థానికంగా ఉన్న చేతి పంపులు, బావుల్లో నీటిని పరీక్షించాల్సి ఉంటుంది. వాటి ఫలితాన్ని బట్టి ఆ నీటిని తాగవచ్చా లేదా అని నిర్ధారించాలి. నీటి పరీక్షల్లో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉంటే ప్రభుత్వానికి నివేదించాలి.

కానరాని కిట్లు

మంచినీటి ట్యాంకుల నుంచి ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని సేకరించి ఫీల్డ్ టెస్ట్ (ఎఫ్‌టీకే) ద్వారా పరీక్షించాల్సి ఉంటుంది. ఈ కిట్ల ద్వారా 9 రకాలుగా నీటిని పరీక్షించవచ్చు. నీటిలో ఫ్లోరైడ్, ఐరన్, క్లోరిన్, బ్యాక్టీరియా వంటివి ఉంటే గుర్తించే వీలుంటుంది. గ్రామానికి ఒక్కో ఎఫ్‌టీకే కిట్‌ను అందజేశారు. వాటిని ఎక్కడా వినియోగించడం లేదు. అక్కడక్కడా ఈ కిట్లు ఉన్నా ఎవరూ శాస్త్రీయ పద్ధతిలో పరీక్షచేయడం లేదు.

నలుగురు తహసీల్దార్లకు పదోన్నతి

నెల్లూరు (పొగతోట): జిల్లాలో నలుగురు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆత్మకూరు తహసీల్దార్ కె.వెంకటేశులు, ఇందుకూరుపేట తహసీల్దార్ నారాయణమ్మ, సంగం తహసీల్దార్ ఉమాదేవి, కోట తహసీల్దార్ రోజ్‌మండ్‌కు పదోన్నతి లభించింది.

రెడ్ లిస్ట్ రెడీ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు : ఎర్రచందనం స్మగ్లర్ల హిట్ లిస్ట్ సిద్ధమైంది. ఇప్పటివరకు వరుస దాడులు నిర్వహిస్తూ.. కేసులు నమోదు చేస్తున్న పోలీసులు ఎర్ర చందనం అక్రమ రవాణా మూలాలపై దృష్టి సారించారు. కూలీలు, పైలెట్‌గా వ్యవహరించే వారు కాకుండా కీలక స్మగ్లర్లుగా ఎదిగి కోట్లాది రూపాయలు సంపాదించిన బడా స్మగ్లర్లపైనా దృష్టి సారించి హిట్ లిస్ట్ సిద్ధం చేశారు. నెల రోజుల వ్యవధిలో వీరిని కోర్టు మెట్లెక్కించే దిశగా స్పెషల్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. జిల్లాలో కీలకంగా 40 మంది బడా స్మగ్లర్లను అరెస్ట్ చేయాల్సి ఉంది. ఇప్పటికే సుమారు 85 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో ఇతర రాష్ట్రాలతోపాటు విదేశాలకు చెందిన వారూ ఉండడం గమనార్హం.

40 మందిపై నిఘా

జిల్లాలో మొత్తం 125 మంది ప్రధాన స్మగ్లర్లు ఉన్నట్టు అధికారులు నిర్ధారణకు వచ్చారు. 2014లో అప్పటి ఎస్పీ సెంథిల్‌కుమార్ 90 మంది స్మగ్లర్ల జాబితాను పూర్తిస్థాయిలో సిద్ధం చేశారు. ఆయన బదిలీతో అప్పట్లో వారిపై చర్యలు తీసుకునే కార్యక్రమం నిలిచిపోయింది. ప్రస్తుత ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేయడంతో ఎర్రచందనం అక్రమ రవాణాపై మళ్లీ పోలీసులు కీలకంగా దృష్టి సారించారు. జిల్లాలో ఇంకా 40 మంది కీలక స్మగ్లర్లు ఉన్నట్టు నిర్ధారించారు. వారి కోసం రాపూరు, కలువాయి, అనంతసాగరం, ఉదయగిరి, సీతారామపురం, చెన్నై, నెల్లూరు నగరాల్లో అన్వేషణ సాగుతోంది. వారందరినీ గుర్తించి అరెస్ట్ చేసిన తర్వాత వారి రికార్డులను పరిశీలించి పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసే దిశగా పోలీసులు కసరత్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న వేట

జిల్లా ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ ఓఎస్డీ టీపీ విఠలేశ్వరరావు నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసి ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించారు. గత నెల మొదటి వారం నుంచి ఇప్పటివరకు వారానికి సగటున 3 కేసులు నమోదు చేయడంతోపాటు అటవీ ప్రాంతంలో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. అటవీ ప్రాంతానికి సమీప మండలాల్లో కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. నెలన్నర వ్యవధిలో మొత్తం 17 కేసులు నమోదు చేసి రూ.20 కోట్ల విలువైన ఎర్రచందనాన్ని సీజ్ చేసి 84 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో చైనా, నేపాల్, టిబెట్‌కు చెందిన ఐదుగురు.. తమిళనాడుకు చెందిన నలుగురు కీలక స్మగ్లర్లు ఉన్నారు. ఈ బ్యాచ్‌లో ఇద్దరు చైనా మహిళలు కూడా ఉండటం గమనార్హం. ఇప్పటివరకు అరెస్ట్ అయిన వారిలో 80 శాతం మంది స్మగ్లర్లే ఉన్నారు. మిగిలిన 20 శాతం మందిలో అక్రమంగా నిల్వ చేసిన వారు, స్మగ్లింగ్ కార్యకలాపాల్లో పైలెట్‌గా వ్యవహరించిన వాళ్లు మరికొందరు ఉన్నారు.

ఆగని అక్రమ రవాణా

జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ప్రధానంగా జిల్లాలోని ఉదయగిరి, ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల సమీపంలోని అటవీ ప్రాంతంలో ఎర్రచందనం చెట్లు అధికంగా ఉన్నాయి. పూర్తిగా అటవీ శాఖ ఆధీనంలో ఉండే ప్రాంతంలో ఎర్రచందనాన్ని పోలీసులు, అటవీ శాఖ అధికారుల కళ్లు కప్పి అక్రమంగా రవాణా చేస్తుండగా.. కొన్నిచోట్ల పోలీసులు, అటవీ శాఖ అధికారులతో కుమ్మక్కై చెట్ల నరికివేతకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా వెంకటగిరి, డక్కిలి, రాపూరు, సీతారామపురం, ఉదయగిరి, వెలుగొండ మండలాల్లో ఎర్రచందనం నిల్వలు ఉన్నట్టు గుర్తించారు. ఆ ప్రాంతాలకు చెందిన కొందరు ఏళ్ల తరబడి ఎర్రచందనం అక్రమ రవాణాను వ్యాపారంగా మలుచుకున్నారు. తమిళనాడు, మహారాష్ట్రతోపాటు చైనాకు చెందిన స్మగ్లర్లతో లింకులు ఏర్పరచుకుని అక్రమ రవాణా సాగిస్తున్నారు.

కొట్టు ఖాళీ

▶మొదటి పేజీ తరువాయి

మాట కాదు. 1956లోనే ప్రజలకు చౌక ధరలకు నిత్యావసర సరుకులు అందించేందుకు అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆ తరువాత మార్కెట్‌లో ధరలను అదుపులో ఉంచడంతోపాటు నిరుపేదలకు ఆహార భద్రతా చట్టం అమల్లోకి వచ్చింది. సబ్సిడీపై నిత్యావసర సరుకులను అందించేందుకు ప్రజా పంపిణీ వ్యవస్థను వేదిక చేసుకుంది. ఒకానొక దశలో దుస్తులను సైతం రేషన్ డిపోల ద్వారా పేదలకు అందించిన ఘనత ప్రజా పంపిణీ వ్యవస్థకు ఉంది. మూడేళ్ల క్రితం వరకు ఉప్పు, పసుపు, కారం, చింతపండు లాంటి 9 రకాల సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇవ్వగా.. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వీటికి చరమగీతం పాడింది. కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తోంది.

బియ్యాన్ని సైతం మిగుల్చుకుంటున్న సర్కారు

జిల్లాలో 8,07,274 తెల్ల కార్డులు, 58,776 ఏఏవై, 772 అన్నపూర్ణ కార్డులు కలిపి మొత్తం 8,66,772 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిపై ప్రతినెలా 11,299 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. ప్రతినెలా కొందరికి జంపింగ్ పేరిట కార్డు ఆన్‌లైన్‌లో లేదని చెబుతూ రెండో నెలలో పునరుద్ధరిస్తూ బియ్యాన్ని మిగుల్చుకుంటున్నారు. ఇలా పేదల కడుపు కొట్టి 2015 మార్చి నెల నుంచి 2017 జూన్ వరకు రూ.98.61 కోట్ల విలువైన బియ్యాన్ని ప్రభుత్వం మిగుల్చుకుంది.

1,896 రేషన్ దుకాణాలు.. 121 ఖాళీ

జిల్లాలో 1,896 రేషన్ దుకాణాలున్నాయి. ఇందులో 121 డిపోలు ఖాళీ అయ్యాయి. డీలర్లు రాజీనామా చేయడం, అక్కడక్కడా కొందరు మరణించడం వల్ల ఖాళీలేర్పడ్డాయి. డీలర్ షాపు నడపాలంటే దుకాణం అద్దెకు తీసుకోవాలి. ఒక మనిషి పని చేయాలి. నాలుగు రకాల వస్తువులను సరఫరా చేస్తే కమీషన్‌తో కొంతవరకైనా డీలర్‌కు గిట్టుబాటయ్యేది. ఇప్పుడు బియ్యం మాత్రమే ఇస్తూ మిగతా వస్తువులన్నింటిని ఆపేయడంతో అసలు గిట్టుబాటు లేక దుకాణాలు నడిపేందుకు డీలర్లు ముందుకు రావడం లేదు.

లీటర్ రూ.90కి కొంటున్నా



గతంలో రేషన్ షాపు ద్వారా లీటరు కిరోసిన్ ఇచ్చేవారు. బయట రూ.30కి మరో లీటరు కొనుగోలు చేసేవాడిని. ఇప్పుడు కిరోసిన్ అవసరమై ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతానికి వెళ్తే లీటర్ ధర రూ.90 చెప్పారు. బతిమాలినా తగ్గించలేదు. చేసేదేమీ లేక కొనుగోలు చేశా.

– ఖలీమ్, వీధి వ్యాపారి

ఇలాగైతే పేదలు బతకలేరు



గ్రామాలతోపాటు పట్టణాల్లోనూ పూట గడవని నిరుపేదలెందరో ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది దళితులే. నేటికీ ఇళ్లకు విద్యుత్ లేని గిరిజన కుటుంబాలున్నాయి. ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా పామాయిల్, కందిపప్పు, కిరోసిన్, చక్కెర లాంటి నిత్యావసర వస్తువులు ఆపేయడం దుర్మార్గం. ఇందువల్ల బహిరంగ మార్కెట్లో రేట్లు పెరుగుతున్నాయి. పేదలు కొనుగోలు చేయలేక అల్లాడిపోతున్నారు. ఇకనైనా చౌక దుకాణాల్లో నిత్యావసర వస్తువులు అందించాలి.

– చేమూరు రవి, అధ్యక్షుడు, అంబేడ్కర్ యువజన సంఘం

డీలర్లు అప్పుల పాలవుతున్నారు

చౌక దుకాణం నడపాలంటే రూ.4వేల నుంచి రూ.5 వేల వరకు అద్దె కట్టాలి. ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి బస్తాకు నాలుగు కిలోల బియ్యం తరుగు వస్తున్నాయి. ప్రభుత్వం తమకు అతి తక్కువ కమీషన్ ఇస్తోంది. రేషన్ దుకాణాల్లో బియ్యం మాత్రమే పంపిణీ చేస్తుండటంతో కమీషన్ చాలక కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోంది. కమీషన్ పెంచాలి లేదా తమిళనాడు తరహాలో జీతం ఇవ్వాలి.

– మునగా గిరిజారావు, డీలర్

వైట్ కిరోసిన్ ధరకు రెక్కలు

రెండు నెలల క్రితం వరకు నీలి కిరోసిన్‌ను చౌక దుకాణాల ద్వారా తక్కువ ధరకు అందించే వారు. అప్పట్లో వైట్ కిరోసిన్ ధర లీటర్ రూ.50కే అందుబాటులో ఉండేది. నీలి కిరోసిన్ నిలిపివేతతో వైట్ కిరోసిన్ ధరకు రెక్కలొచ్చాయి. చిరు వ్యాపారులు, చిన్నపాటి మెకానిక్‌లు కిరోసిన్‌ను లీటర్ రూ.90కి కొనుగోలు చేస్తున్నారు. వీటి ధరలను నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవడం మానేశారు. ఇకనైనా ఆహార భద్రతా చట్టం కింద అయినా రేషన్ దుకాణాల ద్వారా కిరోసిన్, చక్కెర, గోధుమలు, బియ్యం, కందిపప్పు, పామాయిల్ లాంటి నిత్యావసర వస్తువులను అందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కిరోసిన్ అందక ఇక్కట్లు

జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం గ్యాస్ కనెక్షన్ తీసుకునేందుకు నిరాకరించిన వారు, పూళ్లలో నివసిస్తున్న కుటుంబాల సంఖ్య 1,14,190. అందరికీ గ్యాస్ కనెక్షన్ ఇస్తామని చెబుతూ కిరోసిన్ ఆపేయడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికీ అటవీ ప్రాంతాలు, పొలాల మధ్య నివసించే ఎన్నో కుటుంబాలు కిరోసిన్ ఉపయోగించి వంట చేసుకుంటున్నాయి. అందరికీ కిరోసిన్ నిలిపివేయడంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉంగరాల కోసమే ఊపిరి తీశాడు

- వీఆర్వో వద్ద లొంగిపోయిన నిందితుడు
- వివరాలు వెల్లడించిన గూడూరు సీఐ



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుబ్బారావు, ఎస్సై, వెనుక నిందితుడు

గూడూరు : స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని గాయత్రి లైనింగ్‌వర్క్స్ షాపు యజమాని నారాయణను హత్య చేసింది అక్కడ పనిచేసే నాగరాజేనని పట్టణ సీఐ సుబ్బారావు తెలిపారు. నిందితుడు నాగరాజు బుధవారం పట్టణ వీఆర్వో చిట్టేటి అఖిల్ వద్దకు వచ్చి లొంగిపోయాడని ఆయన తెలిపారు. ఈ మేరకు స్థానిక సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. పట్టణంలోని జనార్దన్‌రెడ్డి కాలనీకి చెందిన నారాయణ అంబేడ్కర్‌నగర్‌లో ఆటో వర్క్స్ షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అతని వద్ద వెంకటగిరి మండలం మొక్కలపాడు గ్రామానికి చెందిన తాటిబోయిన పెంచలయ్య కుమారుడు నాగరాజు పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో నారాయణ చేతికి ఉన్న బంగారు ఉంగరాలను దొంగిలించాలని నాగరాజు పథకం పన్నినట్లు తెలిపారు. ఈ నెల 22న రాత్రి నాగరాజుతో కలసి నారాయణ మద్యం తాగేందుకు సిద్ధమయ్యాడు. కానీ నాగరాజు మాత్రం మద్యం తాగుతున్నట్లు నటిస్తూ, నారాయణ మద్యం మత్తులో నిద్రపోయేంత వరకూ ఎదురు చూశాడు. అనంతరం అక్కడ ఉన్న కత్తెర తీసుకుని నిద్రపోతున్న నారాయణ కుడి కన్నులో, గొంతు, ఛాతిమీద విచక్షణా రహితంగా పొడిచి, గొంతుకోసి చంపాడు. అనంతరం అతని చేతికున్న రెండు బంగారు ఉంగరాలను, జేబులోని రూ.2 వేల నగదును తీసుకుని అక్కడి నుంచి పరారైనట్లు సీఐ తెలిపారు. ఈ క్రమంలో నిందితుడు నాగరాజు పట్టణ వీఆర్వో అఖిల్ వద్ద లొంగిపోయాడని, వీఆర్వో అతనిని తీసుకొచ్చి తమకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట రెండవ పట్టణ ఎస్సై నరేష్, కానిస్టేబుళ్లు ప్రసాద్, నాగరాజు ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న కత్తెర, ఉంగరాలు

జెన్‌కో ఎదుట శవపేటికతో ధర్నా



జెన్‌కో గేటు వద్ద శవపేటిక ఉంచిన దృశ్యం

ముత్తుకూరు : నేలటూరులోని ఏపీ జెన్‌కో ప్రాజెక్టులో తోటపని చేస్తూ ఓ కార్మికుడు బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి పరిహారం ఇవ్వాలంటూ శవపేటికతో స్థానికులు గేటు వద్ద ధర్నాకు ఉపక్రమించారు. స్థానికుల కథనం మేరకు.. నేలటూరు దళితవాడకు చెందిన పెడకాల రమణయ్య(46) తోటపని చేస్తూ హటాత్తుగా గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద దిక్కు కోల్పోయిన మృతుడి కుటుంబానికి పరిహారం ఇవ్వాలంటూ స్థానికులు జెన్‌కో గేటు వద్ద రమణయ్య మృతదేహం ఉంచిన శవపేటికతో ఆందోళనకు దిగారు. సాయంత్రం 6 గంటల వరకు ఎటువంటి స్పందన రాలేదు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం

నెల్లూరు(వేదాయపాళెం) : కారు ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. నెల్లూరు రూరల్ పోలీసుల కథనం మేరకు.. అనంతసాగరం మండలం శంకర్‌నగర్ గ్రామానికి చెందిన మహేష్(25) ఓ ప్రైవేట్ కంపెనీలో టెక్నీషియన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో నెల్లూరుకు పని మీద బైక్‌పై వస్తున్నాడు. ఆమంచర్ల పంచాయతీ పరిధిలోని మట్టెంపాడు గ్రామం బస్‌షెల్టర్ వద్దకు వచ్చేసరికి నెల్లూరు నుంచి వేగంగా వస్తున్న కారు అతని బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారకులైన వారు కారును ఘటనా స్థలంలో వదిలి వెళ్లిపోయారు. రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుధవారం పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లుగా రూరల్ పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

- ఒకరికి తీవ్రగాయాలు



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

చేనిగుంట(తడ): జాతీయ రహదారిపై ప్రయాణికుల కోసం ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి లారీ వేగంగా ఢీకొనడంతో ఓ ప్రయాణికుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు.. బుధవారం ఉదయం 5 గంటల సమయంలో సూళ్లూరుపేట నుంచి తిరుపతి వెళ్లే ఆర్టీసీ బస్సు చేనిగుంటకు చేరుకుంది. నిప్పో పరిశ్రమలో పని చేసే బి.అల్లిముత్తు అనే స్థానికుడు విధులకు హాజరయ్యేందుకు బస్సును ఆపి ఎక్కుతున్నాడు. ఇంతలో చెన్నై వెళుతున్న ఓ లారీ వేగంగా బస్సు వెనుక భాగాన ఢీకొంది. దీంతో పట్టుకోల్పోయిన అల్లిముత్తు లోపలి ఇనుప స్థంభాలపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని బంధువులు నెల్లూరులోని ఓ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఆర్టీసి సిబ్బంది తడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రేమ పేరుతో మోసం..

- గర్భిణిని చేసి పెళ్లివద్దంటున్నాడు
- డక్కిలి పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

డక్కిలి: ప్రేమ పేరుతో గర్భిణిని చేసి, పెళ్లి చేసుకోమనేసరికి నీకు నాకు ఎలాంటి సంబంధం లేదంటూ ప్రియుడు మోసం చేశాడని ఓ బాలిక బుధవారం డక్కిలి పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి కథనం మేరకు.. మండలంలోని దేవులపల్లి ఎస్సీ కాలనీకి చెందిన పావని(17) వెంకటగిరిలోని ఓ ప్రవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదట సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో పావనికి బంధువైన రాపూరు మండలం జోరేపల్లి చెందిన బత్తల వెంకటయ్య అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. వెంకటయ్య బంధువు కావడంతో పావని ఇంటికోస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో తనంటే ఇష్టమని, ప్రేమిస్తున్నట్లు వెంకటయ్య నమ్మబలికి మోసం చేశాడని బాధితురాలు తెలిపింది.

తాను ఇప్పుడు 7 నెలల గర్భవతిని అని, పెళ్లి చేసుకోవాలని వెంకటయ్యను గట్టిగా నిలదీయడంతో నీతో నాకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నాడని వాపోయింది. దీంతో పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపింది. ఇరువర్గాలను పోలీసులు విచారించారు. పావనితో తనకు ఎలాంటి సబంధం లేదని వెంకటయ్య చెప్పినట్లు పోలీసులు తెలిపారు. విచారించి బాధితురాలకు న్యాయం చేస్తామని ఎస్సై నాయుడు తెలిపారు.

పడవ బోల్తా - మత్స్యకారుడి మృతి



పోలయ్య మృతదేహం

చిల్లకూరు: సముద్రంలో వేటకు వెళ్లిన మత్సకారుల పడవ అలల ఉధృతికి ఒక్క సారిగా బోల్తా పడటంతో ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. తీర ప్రాంతం తమ్మినపట్నం గ్రామానికి చెందిన పాముల పోలయ్య (48), నెల్లిపూడి కొండయ్య, ఇంగిలాల మోహన్‌లతో పాటు గుమ్మళ్లదిబ్బకు చెందిన శ్రీనివాసులు అనే నలుగురు మంగళవారం రాత్రి సముద్రంలో చేపల వేటకు వెళ్లి వల వేసి వచ్చారు. బుధవారం వేకువ జామున వల తీసుకుని తిరిగి వస్తుండగా సముద్రంలో అలల ఉధృతికి వారి పడవ బోల్తా పడింది. దీంతో ఆ నలుగురు నీళ్లలో పడిపోయారు. చీకట్లో అందులోని ముగ్గురు ఈత కొట్టుకుంటూ పడవను ఒడ్డుకు తీసుకురాగా ఉదయం వరకు పోలయ్య కనిపించలేదు. దీంతో మరో బోటులో కొంతమంది వెళ్లి గాలించగా పోలయ్య మృతదేహం లభ్యమైంది. పోలీసులకు సమాచారం అందడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య

చిల్లకూరు : కడుపు నొప్పి తాళలేక ఓ గిరిజన మహిళ విషపు గుళికలు తిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తిమ్మనగారిపాళెం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలోని గిరిజన కాలనికి చెందిన తుపాకుల కోటయ్య భార్య చెంచెమ్మ (35) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. మంగళవారం రాత్రి వినాయ చవితి ఉత్సవాల్లో అందరూ నిమగ్నమయ్యారు. ఈ సమయంలో ఇంట్లో ఉన్న చెంచెమ్మకు కడుపు నొప్పి రావడంతో తాళలేక గుళికలు తినింది. ఉత్సవాల నుంచి ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో పడి ఉన్న చెంచెమ్మను 108 వాహనంలో గూడూరు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు కుటుంబ సభ్యులను విచారించి, మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి వారికి అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలికల కోసం సుకన్య సమృద్ధి యోజన



10 ఏళ్లలోపు బాలికలు అర్హులు

అల్లూరు: ఆడ బిడ్డ పుట్టిందని తల్లిదండ్రులు దిగాలు పడాల్సిన అవసరం లేదు. బాలికల కోసం సుకన్య సమృద్ధి యోజన అనే పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2014 డిసెంబరు 2న అమల్లోకి తెచ్చింది. ఈ పథకానికి అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి పదేళ్ల లోపు బాలికలు అర్హులు. మండలంలో సుమారు 2,500 మంది ఆడ పిల్లలు ఉండగా, ఇప్పటి వరకు సుమారు 470 మంది పిల్లలకు మాత్రమే ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు. గ్రామాల్లో చాలా మందికి ఈ పథకం ఉపయోగాలు పూర్తిగా తెలియకపోవడంతో ప్రయోజనాలు పొందలేకున్నారు. ఒకే ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలు ఉన్నా.. లేదా ఒకే కాన్పులో ఇద్దరు, ముగ్గురు ఆడ పిల్లలు జన్మించినా ఈ పథకం వర్తిస్తుంది. 10 ఏళ్ల వయస్సు ఉన్న ఆడ పిల్లల తల్లిదండ్రులు తమకు అందుబాటులో ఉన్న పోస్టాఫీసులో సుకన్య సమృద్ధి యోజన పథకం కింద ఖాతా ప్రారంభించుకోవాలి. ఈ ఖాతాను ప్రారంభించడానికి పాప బర్త్ సర్టిఫికెట్, తల్లిదండ్రుల అధార్‌కార్డులు, గార్డియన్ సంతకం ఉంటేచాలు.

ప్రయోజనాలు ఇవే

భవిష్యత్‌లో ఆడ పిల్లల చదువులకు, వారి వివాహాలకు అవసరమైన నగదు వారి చేతులో ఉంటుంది. పోస్టాఫీసులో ఈ పథకం ద్వారా నెలకు 1000 నుంచి 1,50,000 వరకు కట్టుకోవచ్చు. మనం పొదుపు చేసిన నగదుకు సుమారు 9 శాతం వరకు వడ్డీ వస్తుంది. ఒక పాప మీద నెలకు 1000 చొప్పున సంవత్సరానికి 12,000 వంతున 14 ఏళ్లు కట్టిన తర్వాత 7 సంవత్సరాలు కట్టనవసరం లేదు. ఆ పాపకు 21 ఏళ్లు వచ్చాక సుమారుగా రూ.7 లక్షల నుంచి రూ.7.5 లక్షల వరకు వస్తుంది. లేదా ఆ పాప చదువుకు, వివాహానికి మధ్యలో నగదు అవసరం అయితే అందులో కొంత నగదు లేదా అప్పటి వరకు కట్టిన నగదు దానికి వడ్డీ కలిపి మొత్తం ఇస్తారు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు టోల్‌ఫ్రీ నంబర్

నెల్లూరు (వీఆర్సీసెంటర్) : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా, మరమ్మతులకు గురైన వెంటనే టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే చర్యలు తీసుకుంటామని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ కె.విజయకుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు నిర్వహించేందుకు, దానిని పర్యవేక్షించేందుకు 1800 425 15 5333/1912 టోల్‌ఫ్రీ నంబరును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలు, పేలుళ్లు, కాలిపోయిన సందర్భాల్లో టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం అందిస్తే త్వరితగతిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తారని వివరించారు.

9న ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ సమావేశం

నెల్లూరు (క్రైమ్) : ఏపీఎస్‌ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కౌన్సిల్ సమావేశం సెప్టెంబర్ 9న నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ వ్యవస్థాపకులు ఎం థామస్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఎజ్రాశాస్త్రి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, నరసింహరావులు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ప్రాంగణంలోని తమ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం జరుగుతుందని కార్మికుల సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. అసోసియేషన్ నాయకులు, కార్యకర్తలతో పాటు కార్మికులందరూ పాల్గొనాలని కోరారు.

భవిష్యం

మేషం: పనుల్లో జాప్యం. ఆర్థిక ఇబ్బందులు తప్పకపోవచ్చు. ఆకస్మిక ప్రయాణాలు. ఆలయ దర్శనాలు. అనారోగ్యం. వృత్తి, వ్యాపారాలలో చికాకులు.

వృషభం: శ్రమాధిక్యం. పనుల్లో తొందరపాటు. ప్రయాణాలలో అవాంతరాలు. వ్యయప్రయాసలు. బంధువులతో తగాదాలు. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి.



మిథునం: చిరకాల స్వప్నం నెరవేరుతుంది. విద్యావకాశాలు. ప్రముఖులతో పరిచయాలు. పలుకుబడి పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో నూతనోత్సాహం.

కర్కాటకం: కొత్త విషయాలు తెలుసుకుంటారు. ఆర్థిక ప్రగతి. పరిచయాలు పెరుగుతాయి. శుభవార్తలు. వాహనయోగం. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు కొత్త హోదాలు.

సింహం: పనుల్లో అవాంతరాలు. వృథా ఖర్చులు. బంధువులతో మాటపట్టింపులు. అనారోగ్యం. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలలో గందరగోళ పరిస్థితి.

కన్య: కొన్ని సమస్యలు వేధిస్తాయి. ఆరోగ్యభంగం. ముఖ్యమైన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. దూరప్రయాణాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి.

తుల: పరిచయాలు పెరుగుతాయి. ఆసక్తికర సమాచారం. విందువినోదాలు. యత్నకార్యసిద్ధి. ఉద్యోగావకాశాలు. వృత్తి, వ్యాపారాలలో ఉత్సాహవంతంగా ఉంటుంది.

వృశ్చికం: కుటుంబ, ఆరోగ్యసమస్యలు. వ్యయప్రయాసలు. ఆదాయానికి మించిన ఖర్చులు. ప్రయాణాలు వాయిదా. వృత్తి, వ్యాపారాలలో నిరుత్సాహం.

ధనుస్సు: చిన్ననాటి మిత్రుల కలయిక. విందువినోదాలు. కార్యజయం. భూములు, వాహనాలు కొంటారు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగులకు పదోన్నతులు.

మకరం: శ్రమ పెరుగుతుంది. ఆకస్మిక ప్రయాణాలు. ఇంటాబయటా ఒత్తిడులు. దైవ దర్శనాలు. అనారోగ్యం. వృత్తి, వ్యాపారాలలో నిరాశ.

కుంభం: పలుకుబడి పెరుగుతుంది. శుభవార్తలు. వాహనయోగం. చర్చలు ఫలిస్తాయి. వస్తులాభాలు. వ్యాపారాలలో పురోగతి. ఉద్యోగులకు విధుల్లో చికాకులు తొలగుతాయి.

మీనం: పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితుల సాయం అందుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో అనుకూలత.

– సింహంభట్ల సుబ్బారావు

నెల్లూరు వాతావరణం

గరిష్టం: 36.8°/ కనిష్టం: 27.0°

నేడు
వర్షం కురిసే అవకాశం.
గాలులు వీచే అవకాశం.
ఆకాశం మేఘావృతమై ఉంటుంది.
గరిష్టం: 35 సీ, కనిష్టం: 25 సీ.

శుక్రవారం
గాలులు వీచే అవకాశం.
ఉదయంగా ఆహ్లాదకరంగా ఉంటుంది.
ఆకాశం మేఘావృతమై ఉంటుంది.
గరిష్టం: 35 సీ, కనిష్టం: 28 సీ.

శనివారం
గాలులు వీచే అవకాశం.
ఆకాశం మేఘావృతమై ఉంటుంది.
ఉదయం ఆహ్లాదంగా ఉంటుంది
గరిష్టం: 32 సీ, కనిష్టం: 25 సీ

సోమశిలలో 11.282 టీఎంసీల నీరు నిల్వ

సోమశిల : సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 11.282 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 6,357 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. జలశయం నుంచి నెల్లూరుకు తాగునీటి అవసరాలకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయం లో 84.430 మీటర్ల మట్టం నమోదైంది. సగటున 57 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

కండలేరులో 3.555 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 3.555 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు కండలేరు జలాశయం ఈఈ సురేష్ తెలిపారు. వరద కాలువ ద్వారా 150 క్యూసెక్కుల నీరు కండలేరుకు చేరుతుందని చెప్పారు. సత్యసాయిగంగ కాలువకు 260 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

1న మెహందీ పోటీలు

నెల్లూరు (టౌన్) : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని వచ్చే నెల 1న ఎంజీబీ మాల్‌లో మెహందీ పోటీలు నిర్వహించనున్నట్లు ఎయిమ్ ఫౌండేషన్ నిర్వాహకులు ముజీర్‌రోజ్దార్ తెలిపారు. పోటీల్లో పాల్గొన్న వారికి మొదటి మూడు బహుమతులతో పాటు ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్లు కోసం 91606 06040, 93955 55088 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తిరుమల సమాచారం

తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ తక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 12 కంపార్టుమెంట్లు నిండాయి.

సాయింత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు	– ఖాళీ లేవు
రూ.50 గదులు	– ఖాళీ లేవు
రూ.100 గదులు	– ఖాళీ లేవు
రూ.500 గదులు	– ఖాళీ లేవు

సేవలు

సహస్రదీపాలంకరణ సేవ – 250 ఖాళీ ఉన్నాం
వసంతోత్సవం – 150 ఖాళీ ఉన్నాం
ఆర్జిత బ్రహ్మోత్సవం – 200 ఖాళీ ఉన్నాం

గురువారం ప్రత్యేక సేవ : తిరుప్పావడ

నెల్లూరు బులియన్

24 క్యారెట్ల బంగారం
ఒక గ్రామ్ రూ.3,082
22 క్యారెట్ల బంగారం
ఒక గ్రామ్ రూ.2,854
వెండి కిలో రూ.41,200
వెండి గ్రాము రిటైల్ ధర రూ.43.10

(బులియన్ మార్కెట్ సమాచారం మేరకు)

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ చికెన్ ధరలు

బ్రాయిలర్	* 105
లేయర్	* 82
బ్రాయిలర్ చికెన్	*172
స్కిన్‌లెస్ చికెన్	* 202
లేయర్ చికెన్	* 140

నిమ్మ ధరలు(బస్తా)

	సన్నవి	పెద్దవి	పండ్లు
వెంకటగిరి	500	1200	600
పొదలకూరు	2000	3500	1000
గూడూరు	600–800	900–1400	300–600

వాతావరణం

రానున్న 24 గంటల్లో సౌరాష్ట్ర, కచ్, ఉత్తరాఖండ్, ఈశాన్య రాష్ట్రాలు, ఉత్తర పశ్చిమ బెంగాల్, పశ్చిమ తీర ప్రాంతాల్లో మధ్యస్థం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో మిగిలిన ప్రాంతాల్లో, జార్ఖండ్, బీహార్, ఉత్తర ప్రదేశ్ పర్వతాలకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో, ఉత్తర ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, హరియాణా, పంజాబ్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడతాయి.

గుంటూరు వాతావరణం

గరిష్టం కనిష్టం
34.8°/24.0°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	35.5	27.6
కోల్‌కతా	35.2	26.0
బెంగళూరు	28.5	31.1
ముంబై	30.5	23.1
చెన్నై	36.1	25.5

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
నెల్లూరు	36.8/27.0	కాకినాడ	33.8/24.0
ఒంగోలు	36.6/26.0	ఖమ్మం	33.0/20.0
చిత్తూరు	36.5/26.0	విశాఖపట్నం	32.7/24.6
తిరుపతి	36.5/26.0	శ్రీకాకుళం	32.6/26.5
అనంతపురం	35.0/25.0	విజయనగరం	32.6/26.5
విజయవాడ	35.0/24.6	నల్లగొండ	32.6/24.0
కడప	34.8/26.0	ఆదిలాబాద్	32.6/21.0
గుంటూరు	34.8/24.0	హైదరాబాద్	32.0/22.3
కర్నూలు	34.6/25.0	రంగారెడ్డి	32.0/22.3
కరీంనగర్	34.2/25.2	నిజామాబాద్	31.9/24.0
ఏలూరు	34.0/25.6	మెదక్	31.7/21.6
రాజమండ్రి	34.0/25.6	వరంగల్	31.6/24.5
తాడేపల్లిగూడెం	34.0/25.6	మహబూబ్‌నగర్	31.4/23.0

బుల్లితెర


www.sakshi.com

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 నిరీక్షణ
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్‌ఆర్ లైవ్ షో
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.30 స్క్రీన్‌ప్లే
ఉ.11.30 పొలిటికల్ కారిడార్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
రా.10.30 స్క్రీన్‌ప్లే
రా.11.30 న్యూస్ ఫీచర్

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 గూఢచారి 117
ఉ.09.30 శేషాద్రి నాయుడు
మ.12.00 పోస్ట్‌మ్యాన్
మ.03.00 శ్రీమతీ వెళ్లొస్తా
సా.06.00 అంధ్రుడు



మూవీస్ నౌ
ఉ.08.20 స్పిసిస్
ఉ.10.20 క్లిఫ్ హ్యాంగర్
మ.02.45 రష్ అవర్ 3
సా.05.55 సూపర్‌మాన్ రిటర్న్స్
రా.09.00 టాయ్ స్టోరీ



హెచ్‌బీవో
ఉ.08.09 ఘోస్ట్ షిప్
ఉ.09.42 ఫూల్స్ గుడ్
ఉ.11.38 కుంగ్‌ఫు పాండా 2
సా.05.10 ఐపీ మ్యాన్ 3
రా.07.00 ద అకౌంటెంట్



సోనీ పిక్స్
ఉ.0626 సెంటర్ స్టేజ్
ఉ.11.26 బ్యాటిల్‌షిప్
మ.01.47 ద ఇంక్రెడిబుల్ హల్క్
సా.06.13 వాటర్‌వరల్డ్
రా.09.00 జురాసిక్ పార్క్



మా మూవీస్
ఉ.07.00 పెద్దోడు చిన్నోడు
ఉ.09.00 ఆనంద్
మ.12.00 షాక్
మ.03.00 ఎందుకంటే ప్రేమంట
సా.05.00 సింగం



జీ సినిమా
ఉ.07.50 ఆవారా పాగల్ దీవానా
ఉ.10.54 ఐ
మ.02.42 సిర్ఫ్ తుమ్
సా.05.41 హసీనా మాన్ జాయేగీ
రా.09.00 నామ్ షబానా



అర్జునరెడ్డి సినిమా పోస్టర్ల దహనం



పోస్టర్లను దహనం చేస్తున్న దృశ్యం

నెల్లూరు (టౌన్) : విద్యార్థి, యువతను తప్పు దోవ పట్టిస్తున్న అర్జునరెడ్డి సినిమాను వెంటనే నిలిపివేయాలని కోరుతూ ఏపీ ప్రత్యేక హోదా జేఏసీ ఆధ్వర్యంలో ఆ సినిమా పోస్టర్లను దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు అంజయ్య వీఆర్సీ సెంటర్‌లో బుధవారం నిరసన తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ సినిమా యువత, విద్యార్థులను చైతన్య పరిచే విధంగా ఉండాలని, కానీ ఈ సినిమాలో అసభ్యకర పద జాలంతో ప్రేక్షకులను ఇబ్బంది పెట్టే తీరుగా ఉందని ఆరోపించారు. ఇలాంటి సినిమా వల్ల మహిళలు, విద్యార్థుల్లో భద్రత కొరవడుతుందని చెప్పారు. ఈ సినిమా ప్రదర్శనను అధికారులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

గణేష్ నిమజ్జనం

నెల్లూరు (బృందావనం) : నగరంలోని ఆచారివీధిలో మంగళవారం రాత్రి వినాయక విగ్రహ నిమజ్జనోత్సవాన్ని నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ ప్రారంభించారు. ఆచారివీధి మిత్రమండలి ఆధ్వర్యంలో తాత్కాలికంగా ప్రతిష్ఠించిన గణనాథుడి విగ్రహానికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి లడ్డూను వేలం వేశారు. వేలంలో సాయిబాబా కట్‌పీసెస్ అధినేత రవి రూ.లక్ష దక్కించుకున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతి ఇవ్వకపోవడం బాధాకరం

సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ నగరంలో జరిగే నిమజ్జనోత్సవం కార్యక్రమానికి సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతి ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలపై ఆధారపడి ఎన్నో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. పోలీసుల వైఖరి వల్ల ఆ కుటుంబాల పరిస్థితి ఎలా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేలూరు సుధారాణి, నాయకులు వేలూరు మహేష్, వేలూరు రఘు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

వ్యక్తిపై ముగ్గురు దాడి

నెల్లూరు సిటీ : రోడ్డుపై నడిచి వెళుతున్న వ్యక్తిని ముగ్గురు వ్యక్తులు కలిసి దాడి చేసి గాయపరిచినట్లు బాధితుడు బాలాజీనగర్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన చల్లా సురేంద్ర ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 25న సురేంద్ర తన ఇంటి నుంచి సమీపంలోని సోదరి ఇంటికి వెళుతుండగా అదే ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తుల్లో వాసు అనే వ్యక్తి సురేంద్రను ఒరేయ్ పిలిచాడు. దీంతో సురేంద్ర ఒరేయ్ అని పిలుస్తావా? అని ఎదురు మాట్లాడినందుకు వాసుతో పాటు అతని తన స్నేహితులు గంగాధర్, రాంబాబు సురేంద్రపై దాడి చేశారు. కేకలు విన్న కుటుంబ సభ్యులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారిపై కూడా దాడి చేశారు. దీంతో బాధితుడు బుధవారం ఫిర్యాదు చేశారు.

నేడు నెల్లూరు రూరల్ నవరత్నాల సభ

నెల్లూరు (సెంట్రల్) : నెల్లూరు రూరల్ నియోజక వర్గానికి సంబంధించిన వైఎస్సార్ సీపీ నవరత్నాల సభను నేడు గురువారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని మినీబైపాస్‌రోడ్డులో ఉన్న జీపీఆర్ కల్యాణమండపంలో ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఈ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్‌కమిటీలు తరలిరావాలని కోరారు.

ఆధ్యాత్మిక సత్సంగం ప్రారంభం



సత్సంగాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న ఆల్తూరు దంపతులు

నెల్లూరు (బృందావనం) : దర్గామిట్టలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం రాత్రి వేద పండితులు మండే లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సత్సంగం ప్రారంభమైంది. రామాయణం, మహాభారతం, భాగవతం, భగవద్గీత పవిత్ర గ్రంథాల్లోని వివిధ వృత్తాంతాలను వివరిస్తూ సత్సంగం జరుగుతోందని లక్ష్మీనరసింహారావు వివరించారు. సత్సంగాన్ని శ్రీశైలం దేవస్థానం పాలకమండలి మాజీ చైర్మన్ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి, సులోచనమ్మ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పులికోదండరామిరెడ్డి, వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్, ఆలయ ప్రధాన అర్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ పాల్గొన్నారు.

మరికొన్ని జోన్ వార్తలు 12లో

స్థలాలు చూపని తహసీల్దార్‌పై చర్యలకు డిమాండ్



మాట్లాడుతున్న చోడవరం గ్రామ లబ్ధిదారులు

నెల్లూరు (అర్బన్) : ఎన్నిసార్లు తిరిగినప్పటికీ తమకు ప్రభుత్వం ఇచ్చిన నివేశన స్థలాలు చూపని తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలని జలదంకి మండలం చోడవరం గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం పలువురు లబ్ధిదారులు కలెక్టరేట్‌లో డీఆర్వోకి వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితమే ఏడున్నర ఎకరాల్లో 153 మందికి నివేశన స్థలాలు ఇస్తున్నట్టు అధికారులు పట్టాలిచ్చారన్నారు. అయితే ఆ స్థలంలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి, రోడ్లకు స్థలాలు చూపి పట్టాదారులకు ప్లాట్లు కేటాయించాలని తాము దశాబ్దాల తరబడి తిరుగుతున్నా తహసీల్దారు పట్టించుకోవడం లేదన్నారు. ఈ స్థలాన్ని కొంతమంది అధికార పార్టీ నాయకులు చేజిక్కించుకోవాలనే ప్రయత్నం చేస్తున్నట్టు అనుమానంగా ఉందన్నారు. దీనిపై లోకాయుక్తలో కేసు వేశామని, లోకాయుక్త కూడా జూన్‌లో లబ్ధిదారులకు రెండు నెలల్లో స్థలాలు చూపాలని ఆదేశించినా తహసీల్దార్ పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో తిక్కా వెంకయ్య, నేరెళ్ల నరసింహం, తిక్క వెంకయ్య, నేరెళ్ల వెంకయ్య, ఆవుల సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్ల పాపకు అరుదైన శస్త్రచికిత్స

తలలో కణితిని తొలగించిన సింహపురి వైద్యులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వరప్రసన్న

నెల్లూరు (బారకాసు) : ఆరేళ్ల పాపకు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించి తలలోని చిన్నమెదడులో ఉన్న కణితిని సింహపురి ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా తొలగించారు. బుధవారం నగరంలోని చింతారెడ్డిపాళెంలో ఆ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరాల శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ వెంకటేశ్వరప్రసన్న వెల్లడించారు. వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లకు చెందిన కె.వెంకటసుబ్బయ్య–సుజాత దంపతుల కుమార్తె దీప్తి గత వారం రోజులుగా విపరీతమైన తలనొప్పితో బాధపడుతూ మెడ పక్కకు వాల్చేస్తుంది. దీంతో తల్లిదండ్రులు దీప్తిని సింహపురి ఆస్పత్రికి తీసుకు వచ్చి ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ దీక్షాంతినారాయణ్‌కు చూపించారు. వైద్య పరీక్షలు నిర్వహించగా తలలోని చిన్న మెదడులో నిమ్మకాయ కంటే ఇంకొంచెం పెద్ద సైజులో కణితి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఆపరేషన్ చేయాలని లేకుంటే ప్రమాదమని పాప తల్లిదండ్రులకు చెప్పి అత్యాధునిక వైద్య పరికరాలతో శస్త్రచికిత్స చేసి కణితిని తొలగించారు. ప్రస్తుతం పాప కోలుకుని ఆరోగ్యకరంగా ఉండటంతో బుధవారం డిశ్చార్జ్ చేశారు. ఈ ఆపరేషన్‌ను ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ దీక్షాంతినారాయణ్, దీప్తి, తల్లిదండ్రులు సుజాత, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు



మౌనిక ఫైల్

నెల్లూరు సిటీ : ఈ నెల 11వ తేదీ నుంచి తన కుమార్తె కనిపించడం లేదని తల్లి వెంకటసుబ్బమ్మ బాలాజీనగర్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు..నగరంలోని సరస్వతీనగర్‌కు చెందిన నరసింహారావు, వెంకటసుబ్బమ్మ దంపతుల కుమార్తె మోనిక (22)కు అనంతసాగరం మండలం గుడిగుంటకు చెందిన శీనయ్యతో ఏడాదిన్నర క్రితం వివాహం అయింది. ఈ క్రమంలో వారికి కుమార్తె నిశిత జన్మించింది. శీనయ్య చెన్నైలో కూలి పనులు నిమిత్తం వెళ్లాడు. అప్పటి నుంచి మౌనిక, ఆమె కుమార్తె నిశిత తల్లి వెంకటసుబ్బమ్మ వద్ద ఉంటున్నారు. ఈ నెల 11న మౌనిక కుమార్తెను తీసుకుని ఇంట్లో చెప్పకుండా ఆటోలో ఆత్మకూరు బస్టాండ్ వైపు వెళ్లింది. దీంతో మౌనిక ఇంటికి రాకపోవడంతో వెంకటసుబ్బమ్మ బంధువులు, స్నేహితులను అడిగినా ఫలితం లేకుండా పోయింది. దీంతో వెంకటసుబ్బమ్మ బుధవారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

డీఆర్వో వెంకట సుబ్బయ్య


డీటీలతో సమీక్షిస్తున్న డీఆర్వో వెంకటసుబ్బయ్య

నెల్లూరు (అర్బన్): మండలాల్లోని పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డీఆర్వో వెంకటసుబ్బయ్య డిప్యూటీ తహసీల్దార్లకు సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో బుధవారం ఆయన జిల్లాలోని డిప్యూటీ తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం ఆరు వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సమస్యలను సకాలంలో ఎందుకు పరిష్కరించడం లేదని రాష్ట్ర స్థాయి అధికారులు ఆన్‌లైన్‌లో చూసి ప్రశ్నిస్తున్నారన్నారు. ఇకనైనా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో పారదర్శకత లోపం

దక్కిలి : ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో పారదర్శకత లోపించిందని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి తాళ్లూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. దక్కిలి విద్యా వనరుల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయాలని జిల్లా విద్యాశాఖ ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. అయితే దక్కిలి ఎంఈఓ గతంలో అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడినే ఈ ఏడాది ఎంపిక చేయడాన్ని ఎస్టీయూ, పీఆర్టీయూ, బీటీఏ 1, బీటీఏ 2 ప్రతినిధులు తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. ఈ విషయంపై డీఈఓకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎంఈఓ మొండి వైఖరిని విడనాడకపోతే ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆవుల రామారావు, బీ కోటేశ్వరరావు, టీ మోహన్‌రామ్, ఎస్‌కే అబ్దుల్ గఫూర్, డీ సిద్దయ్య, సరళకుమారి పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి చిన్నారి మృతి


మృతి చెందిన చిన్నారి ప్రవంతి

పెళ్లకూరు : దొడ్లవారిమిట్టకు చెందిన మేకల ప్రవంతి (8) బుధవారం సాయంత్రం నీటి గుంతలో పడి మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు.. గిరిజన కాలనీకి చెందిన మేకల సుబ్రహ్మణ్యం, సుధారాణి దంపతుల కుమార్తె ప్రవంతి స్థానిక పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. పాఠశాల ముగిసిన తర్వాత తోటి స్నేహితులతో కలిసి బహిర్భూమికి వెళ్లింది. అక్కడ నీటి గుంతలో ప్రమాదవశాత్తు పడిపోయింది. స్నేహితులు కేకలు వేస్తూ కాలనీ వైపు పరుగులు తీశారు. స్థానికులు వెళ్లి తీసేలోగానే ప్రవంతి నీటి గుంటలో ఊపిరాడక మృతి చెందింది. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రవంతి తండ్రి సుబ్రమణ్యం మృతి చెందాడు. చిన్నారిని నీటి గుంత బలి తీసుకోవడంతో తల్లి సుధారాణి కన్నీరు మున్నీరుగా విలపించింది.

కట్టి వదిలేశారు

- సైన్స్ మ్యూజియం నిర్వహణను పట్టించుకోని ప్రభుత్వం
- కొత్త ప్రదర్శనల ఏర్పాటులో చొరవ చూపని వైనం
- నీరుగారుతున్న మ్యూజియం లక్ష్యం




జిల్లా సైన్స్ మ్యూజియం (ఇన్‌సెట్‌లో) ప్రదర్శనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

వెంకటాచలం : శాస్త్ర సాంకేతిక విద్యను అందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా క్షేత్రస్థాయిలో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు నిర్మించిన సైన్స్ మ్యూజియాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయకపోవడం, నిర్వహణను పట్టించుకోకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు.

జిల్లాలోని విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు, సైన్స్ పరిజ్ఞానంపై ఆసక్తి కల్పించాలనే లక్ష్యంతో వెంకటాచలం మండలం చెముడుగుంట లో సైన్స్ మ్యూజియాన్ని రూ.1. 22కోట్లతో నిర్మించారు. 12 ఏళ్ల క్రితమే నిర్మాణానికి స్థలం కేటాయించినా నిధుల సమస్యతో 2016లో మ్యూజియం భవనాన్ని పూర్తి చేశారు. 2016 మే 11న రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ మ్యూజియాన్ని ప్రారంభించారు. ఈ మ్యూజియంలో రూ.30 లక్షల వ్యయంతో బీఎం బిర్లా సెంటర్ (హైదరాబాద్), అన్‌కెడైన్ (చెన్నై) సంస్థల సహకారంతో 56 ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. అలాగే శ్రీహరికోట షార్ సహకారంతో రాకెట్ మోడల్స్ ఉంచారు. 2016 డిసెంబరు 5 నుంచి మ్యూజియం సందర్శనను అనుమతిస్తున్నారు. సైన్స్‌మ్యూజియాన్ని ఇప్పటి వరకు 18వేల మందికిపైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సందర్శించారు.

నిర్వహణ గాలికి

జిల్లా సైన్స్ మ్యూజియాన్ని ప్రారంభించి ఏడాది గడిచినా ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్వహణను పట్టించుకోలేదు. ప్రారంభ సమయంలో మంత్రులు, అధికారులు ఇచ్చిన హామీలు ఒక్కటి అమలు కాలేదు. జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి సైన్స్ మ్యూజియం సందర్శించే విద్యార్థులకు మినరల్ వాటర్ ప్లాంటు నిర్మిస్తామని చెప్పి ఏర్పాటు చేయించారు. మంత్రి నారాయణ మ్యూజియం అభివృద్ధికి కృషి చేస్తామని, నిర్వహణను ప్రభుత్వమే చేపట్టేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. 15 నెలలు గడిచినా ప్రభుత్వం సైన్స్ మ్యూజియం నిర్వహణను పట్టించుకోకుండా గాలికి వదిలేసింది. దీంతో సైన్స్ మ్యూజియాన్ని సందర్శించే విద్యార్థుల నుంచి నగదు వసూలు చేస్తూ నిర్వహణ చేపడుతున్నారు. మ్యూజియాన్ని సందర్శించేందుకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అనుమతి ఇస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల నుంచి రూ.10, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల నుంచి రూ.5, సాధారణ ప్రజల నుంచి రూ.20 లెక్కన మ్యూజియం నిర్వహణకు నగదు వసూలు చేస్తున్నారు.

కానరాని అభివృద్ధి

జిల్లా సైన్స్ మ్యూజియంలో అభివృద్ధి పనులు కానరావడంలేదు. ప్రారంభ సమయంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు తప్ప ప్రభుత్వం కొత్తవి ఏర్పాటుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మ్యూజియంలో కుర్చీలను సైతం అక్కడ పనిచేసే ఉపాధ్యాయులే సొంత నిధులతో సమకూర్చుకున్నారు. విద్యార్థుల నుంచి వసూలు చేసే నగదుతో మ్యూజియం నిర్వహణ, స్వీపర్, వాచ్‌మెన్‌కు జీతాలు ఇస్తున్నారు. మ్యూజియంలో ప్రస్తుతం భౌతిక శాస్త్రానికి సంబంధించిన ప్రదర్శనలు మాత్రమే ఉన్నాయి. జీవశాస్త్రం, రసాయన శాస్త్రానికి సంబంధించిన ప్రదర్శనలు లేవు. దీంతో జీవశాస్త్రం, రసాయన శాస్త్రాలకు సంబంధించిన ఉపాధ్యాయులు విద్యార్థులతో మ్యూజియానికి రావడంలేదు. సైన్స్ మ్యూజియానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రావడంలేదు. మ్యూజియానికి రెండు బస్సులు ఏర్పాటు చేస్తామని ప్రారంభం రోజున ఇచ్చిన హామీలు అమలుకాలేదు. అలాగే భౌతిక, రసాయన, జీవ శాస్త్రాలకు సంబంధించిన లేబొరేటరీ లేకపోవడంతో వచ్చిన విద్యార్థులు రెండు గంటలకే తిరిగి వెళ్లిపోతున్నారు. లేబొరేటరీతో పాటు జీవ, రసాయన శాస్త్రాలకు సంబంధించిన ప్రదర్శనల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారిస్తే విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంపొందించేందుకు వీలుంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు చొరవతీసుకుని సైన్స్ మ్యూజియం అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

దృష్టి సారిస్తున్నాం



సైన్స్ మ్యూజియం అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నాం. అభివృద్ధికి దాతల సహాయాన్ని కోరుతున్నాం. రవాణా ఇబ్బందులతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు రావడంలేదు. బస్సులు కేటాయిస్తే విద్యార్థుల రాక పెరుగుతుంది. మ్యూజియాన్ని అభివృద్ధి చేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నాం.

– వీ రాధారాణి, జిల్లా సైన్స్ అధికారిణి

పనితీరు మెరుగుపరుచుకోకపోతే చర్యలు

ఆర్డీ షాలినీదేవి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీ డాక్టర్ షాలినీదేవి

నెల్లూరు (బారకాసు): జిల్లాలోని పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యాధికారుల పనితీరు సరిగాలేదని, పనితీరు మెరుగుపరుచుకోకపోతే చర్యలు తప్పవని వైద్యారోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకులు(గుంటూరు) షాలినీదేవి హెచ్చరించారు. నగరంలోని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆమె వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీ మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలందించి తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరుగుతున్న కాన్పులు, గర్భిణుల వివరాల తెలియకుండా ఎలా పనిచేస్తున్నారని ప్రశ్నించారు. క్షేత్ర స్థాయిలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఏ విధంగా పనిచేస్తున్నారో, సబ్ సెంటర్‌లో రోగులకు ఏ విధంగా వైద్య సేవలు అందుతున్నాయన్న విషయాలను తెలుసుకోకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మార్ వ్యాక్సిన్‌ను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్య పరీక్షలు, చంద్రన్న సంచార చికిత్సలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా చూడడంతో పాటు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రతి వైద్యాధికారి తమ పరిధిలోని సబ్ సెంటర్లను విజిట్ చేసి అక్కడి పరిస్థితులను పరిశీలించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ వరసుందరం, ఏడీ ఎంహెచ్‌ఓ రమాదేవి, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, డీటీసీఓ జీవీ ప్రసాద్, ఇన్‌చార్జి డీఐఓ ఉమామహేశ్వరి,పాల్గొన్నారు.

మిలియన్ మార్చ్‌ను జయప్రదం చేయాలి

నెల్లూరు (దర్గామిట్ట) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ సెప్టెంబర్ 1న విజయవాడలో మిలియన్ మార్చ్ చేపట్టనున్నట్లు ఏపీ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగుల జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ ధనరాజ్, ఆర్ రామకిషోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి బిషప్ అజరయ్య బాలికోన్నత పాఠశాల మైదానం వరకు మిలియన్ మార్చ్ చేపట్టనున్నట్లు వివరించారు. అనంతరం బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒకటే సర్వీస్–ఒకటే పెన్షన్ కోరుకునే జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగులు మిలియన్ మార్చ్‌లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబుకు విశ్వసనీయత లేదు

- నవరత్నాలను ప్రతి ఇంటికి తీసుకెళుదాం
- నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ మేకపాటి, పక్కన ఎమ్మెల్యే అనిల్, నాయకులు

నెల్లూరు(సెంట్రల్) :

సీఎం చంద్రబాబుకు విశ్వసనీయత లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన నెరవేర్చకపోవడమే ఇందుకు నిదర్శనమని నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో బాబుకు బుద్ధి చెబుదామని నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నెల్లూరులోని ఓ కల్యాణమండపంలో బుధవారం నిర్వహించిన నెల్లూరు సిటీ నియోజకవర్గ నవరత్నాల సభలో ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ కుటుంబం చేసేవే చెబుతుందన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అధికారంలోకి వచ్చే ముందు ఉచిత విద్యుత్, పెన్షన్ పెంపు పథకాలను చెప్పారన్నారు. అధికారంలోకి రాగానే తొలుతగా అవి రెండుచేసి చూపించారన్నారు. ఇప్పుడు కూడా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం చెప్పిన పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుచేస్తారన్నారు.

కష్టపడి పనిచేద్దాం

సిటీ ఎమ్మెల్యే పి.అనిల్‌కుయార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రతిఒక్కరం కష్టపడి పనిచేద్దామన్నారు. నంద్యాలలో రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రజలను ప్రలోభాలకు గురిచేసి గెలిచారన్నారు. దానిని ఎవరూ గెలుపుగా భావించడం లేదన్నారు. లోకేష్ కాబోయో ముఖ్యమంత్రి అని చెప్పే టీడీపీ నాయకులు ఎందుకు ఆయన్ను నంద్యాలలో ప్రచారానికి తీసుకునిపోలేదని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కొన్ని చానళ్లు పనిగట్టుకుని అబద్దాలు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇరవై ఏళ్లు శిక్ష పడ్డ డేరా బాబాకు గురువు చంద్రబాబు అని చెప్పారు. తనకు ఉన్నది నిజాయితీ అన్నారు. ఎవరి వద్ద రూపాయి ఆశించకుండా పనిస్తున్నట్లు తెలిపారు. తనపై కొన్ని పత్రికలు, కొందరు పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. నోటీసులు ఇచ్చో, పత్రికల్లో అబద్దపు కథనాలు రాసో తనను దెబ్బకొట్టలేవన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, వైఎస్సార్ సీపీ కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు హుస్సేన్, కార్పొరేటర్లు ఓబిలి రవి చం ద్ర, దామవరపు రాజశేఖర్, గోగుల నాగరాజు, ఎండీ ఖలీల్‌అహ్మద్, వేలూరు సుధారాణి, దేవరకొండ అశోక్, నాయకులు కర్తం ప్రతాప్‌రెడ్డి, మునీర్ సిద్దిక్, కొణిదల సుధీర్, దార్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చంద్రగిరి ప్రజలు తిరస్కరించిన నేత చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి, పక్కన ఎంపీ, జెడ్పీచైర్మన్

వెంకటగిరి :

సీఎం చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గ ప్రజల చేత తిరస్కరించబడిన నేత అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పద్మశాలీయుల కల్యాణ మండపంలో బుధవారం వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమవన్వయకర్త, జెడ్పీచైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నవరత్నాల సభ జరిగింది. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ దివంగత వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు వారి పుట్టినగడ్డ అయిన పులివెందులలో ఓటమి ఎరుగని నేతలన్నారు. వారిని విమర్శించే అర్హత సొంత నియోజకవర్గంలో ఓటమి పాలై, కళాకారులు ఎక్కువగా ఉన్న కుప్పంలో ఎన్టీఆర్ బొమ్మ పెట్టుకుని గెలుస్తున్న చంద్రబాబుకు లేదన్నారు. నంద్యాల్లో 12 వేల దొంగ ఓట్లు నమోదు చేయించుకుని, ఇంటింటికీ కుట్టుమిషన్‌లు కూపన్లు ఇవ్వడం, ప్రధానరోడ్లు తవ్వడం, రైతుల కాలువలు తవ్వించి తాము గెలిస్తేనే ఇవన్నీ జరుగుతాయని బెదిరించి గెలిచారని విమర్శించారు. నవరత్నాలు అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రవేశపెట్టినవని, వాటిని గడపగడపకూ తీసుకెళ్లేందుకు కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలన్నారు. జిల్లా టీడీపీ నేతలు వెంకటగిరి వేదికగా గురువారం జరిగే సభలో రుణమాఫీ పథకం అమలుతీరుపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

టీడీపీ వారికే పథకాలు..

తిరుపతి ఎంపీ వెలగపల్లి వరప్రసాద్ రావు మాట్లాడుతూ ప్రస్తుతం జన్మభూమి కమిటీల పేరుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను టీడీపీ వారికే కట్టుబెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు నీచపాలన సాగిస్తున్నారన్నారు. భవిష్యత్‌లో పేదలకు భూములను దూరం చేసేలా అధికారపార్టీ నాయకులు లక్షల ఎకరాల స్వాహా చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ పి.శిరీష, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సూళ్లూరుపేట పరిశీలకుడు గూడూరు భాస్కర్‌రెడ్డి, రాపూరు ఎంపీపీ శకుంతల, పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, వైఎస్సార్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డి, నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, బత్తిన పట్టాభిరామిరెడ్డి, కలువాయి, బాలాయపల్లి జెడ్పీటీసీలు బి.అనిల్‌కుమార్‌రెడ్డి, రాములమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, మహిళావిభాగం నేత ధనియాలరాధ, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

దేశంలోనే నంబర్‌వన్ అవినీతి చక్రవర్తి బాబు

- ఎంపి వెలగపల్లి, ఎమ్మెల్యే కిలివేటి



మాట్లాడుతున్న ఎంపీ వెలగపల్లి, పక్కన ఎమ్మెల్యే సంజీవయ్య

సూళ్లూరుపేట :

ముఖ్యమంత్రి చంద్రబాబు నవ్యాంధ్రను దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలుపుతానని చెబుతు ంటాడని, అయితే ఆయనే దేశంలో నంబర్‌వన్ అవినీతి చక్రవర్తిగా పేరు ప్రఖ్యాతులు గడించారని తిరుపతి ఎంపీ వెలగపల్లి వరప్రసాద్ అన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సం జీవయ్య ఆధ్వర్యంలో బుధవారం స్థానిక టీవీఆర్‌ఆర్ కల్యాణమండపంలో నవరత్నాల సభ నిర్వహించారు. తొలుత పెళ్లకూరు మండలం చిల్లకూరు సర్పంచ్ బసివిరెడ్డి వెంకట శేషారెడ్డి మృతికి మౌనం పాటించారు. సభా కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన ఎమ్మెల్యే కిలివేటి ముందుగా అధ్యక్షోపన్యాసం చేశారు. నిరుపేద ప్రజానీకాన్ని ఆదుకునేందుకు ప్రవేశపెట్టిన నవరత్నాలను బూత్ కమిటీ చైర్మన్లు, గ్రామ కమిటీ చైర్మన్లు ఒక ఉద్యమంలా ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాన్ని చేపట్టాలని చెప్పారు. నంద్యాల ఎన్నికల ఫలితం చూసి జడవాల్సిన పనిలేదన్నారు. సాక్షాత్తూ ఒక ముఖ్యమంత్రి, క్యాబినెట్‌లో పనిచేసే మంత్రులు వచ్చి అక్కడే కూర్చుని అధికార యంత్రాంగాన్ని, పోలీసులను వాడుకుని సుమారు రూ.200 కోట్లు ఖర్చు పెట్టి గెలిచారన్నారు. దీనిని గెలుపుగా ఎవరూ భావించాల్సిన అవసరం లేదన్నారు. అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు పీహెచ్‌డీ చేశారన్నారు. గడిచిన పదేళ్ల కాంగ్రెస్‌పాలనలో 51 సార్లు ఎన్నికలు జరిగితే అప్పటి ప్రతిపక్ష టీడీపీ ఒక్కసీటు గెలవలేదని గుర్తుచేశారు.

ముఖ్యఅతిథి ఎంపీ వెలగపల్లి మాట్లాడుతూ చంద్రబాబు ఎక్కడ అవినీతి సంపాదన ఉంటుందో అక్కడ వాలిపోతారన్నారు. ఆయన కేంద్ర ప్రభుత్వానికి ఒక్క లేఖ రాసుంటే దుగరాజపట్నం ఓడరేవు వచ్చి ఉండేదన్నారు. వైఎస్సార్ హయాంలో ఈ ప్రాంతంలో మేనకూరు, మాంబట్టు, శ్రీసిటీ సెజ్‌లు ఏర్పాటై సుమారు లక్షమందికి పైగా ఉపాధి లభించిందన్నారు. ఈ మూడున్నరేళ్లలో బాబు ఏం చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. ప్రజల్లో చైతన్యం తెచ్చి వైఎస్ జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. టీడీపీ నేతలు సంజీవయ్యను ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా లొంగకుండా వైఎస్సార్ సీపీలోనే ఉంటానని చెప్పారని పొగడ్తలతో ముంచెత్తారు. పార్టీ నియోజకవర్గం నేతలు దువ్వూరు బాలచంద్రారెడ్డి, కామిరెడి సత్యనారాయణరెడ్డి, కట్టా సుధాకర్‌రెడ్డి, కట్టా రమణారెడ్డి, నలుబోయిన రాజసులోచనమ్మ, కురుగొండ ధనలక్ష్మి, పాలూరు మహేంద్రరెడ్డి, దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, వేణుంబాక విజయశేఖర్ రెడ్డి, గునిశెట్టి వెంకటేశ్వర్లు, ఆరు మండలాల కన్వీనర్లు పాల్గొన్నారు.

వెంగమాంబ నగలు లెక్కింపు

దుత్తలూరు(ఉదయగిరి) : జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలు అమ్మవారికి భక్తులు సమర్పించిన నగలు, ఆభరణాలను బుధవారం గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల జూనియర్ వెరిఫికేషన్ అధికారిణి ఎస్.మాధవి ఆధ్వర్యంలో లెక్కించారు. 2011 నుంచి బుధవారం వరకు వచ్చిన నగలను లెక్కించగా 880 గ్రాముల బంగారం, 4 కిలోల వెండి ఆభరణాలున్నాయి. ఆభణాలను దుత్తలూరులోని బ్యాంకు లాకరులో భద్రపరిచినట్లు ఆమె తెలిపారు. సర్పంచ్ మేకపాటి మాలకొండ్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమ అభివృద్ధికి సహకారం

- కలెక్టర్ ముత్యాలరాజు



ఆశ్రమంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కలెక్టర్

ఇందుకూరుపేట(కోవూరు) : జాతిపిత మహాత్ముడు స్వహస్తాలతో ప్రారంభించిన పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు అన్నారు. మండలంలోని పల్లిపాడు గాంధీ ఆశ్రమాన్ని బుధవారం ఆయన సందర్శించి అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. కుట్టు శిక్షణ కేంద్రాన్ని చూసి పలు అంశాలను ఆరాతీశారు. గాంధీజీ ఫొటో ఎగ్జిబిషన్‌ను వీక్షించారు. ఆశ్రమంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై కమిటీ సభ్యులతో చర్చించారు. తొలుత గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సోషల్ వెల్ఫేర్ ఈఈ విజయ్‌కుమార్, ఆశ్రమ కమిటీ సభ్యులు నేదురుమల్లి సుబ్బారెడ్డి, లక్ష్మయ్య,రామయ్య, రమణయ్య, శివారెడ్డి ఉన్నారు.

అక్టోబర్ 2వ తేదీకి ఇళ్లు పూర్తిచేయాలి

నెల్లూరు (అర్బన్) : అక్టోబర్ 2వ తేదీ నాటికి జిల్లావ్యాప్తంగా నిర్మిస్తున్న పక్కా ఇళ్లకు సంబంధించి కనీసం 12 ఎస్సీ, ఎస్టీకాలనీల్లో నిర్మాణాలు పూర్తిచేయాలని కలెక్టర్ ముత్యాలరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం నెల్లూరులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ 12 కాలనీల్లో తాగునీరు, సీసీరోడ్లు, విద్యుదీకరణ, తదితర మౌలిక వసతులను 100 శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రజాసాధికారత సర్వేలో గృహాలు లేవని చెప్పిన వారి వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని కోరారు. ఇంజినీర్లకి ఏమైనా ఇబ్బందులుంటే హసింగ్ పీడీకి తెలపాలని కోరారు. భూములు లేని పేదలకు ప్రభుత్వ భూములుంటే వారికి ఉచితంగా స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. హౌసింగ్ పీడీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రూ.40 కోట్ల మొండి బకాయిలు

- డీఆర్‌డీఏ పీడీ లావణ్యవేణి



మాట్లాడుతున్న పీడీ లావణ్యవేణి

చిల్లకూరు(గూడూరు): జిల్లాలోని 46 మండలాల్లో ఉన్న పొదుపు గ్రూపుల సభ్యుల నుంచి బ్యాంకులకు రూ.40 కోట్లకు పైగా మొండి బకాయిలున్నట్లు డీఆర్‌డీఏ పీడీ లావణ్యవేణి తెలిపారు. మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవన్‌లో రెండురోజులుగా జరుగతున్న సంఘబంధం అధ్యక్ష, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమానికి బుధవారం ఆమె హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు నిలపకూడదని పలు బ్యాంకుల అధికారులు సహకారం అందిస్తున్నందున రుణాలు మంజూరు చేయగలుగుతున్నామని తెలిపారు. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే బకాయిదారులగా నిలిచిపోతారని దీంతో మరో సంఘానికి నిధులు మంజూరుచేయలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. కొత్త ఎంపికైన వారు సంఘబంధాలను పటిష్టం చేసుకునేందకు ప్రయత్నించాలన్నారు. ఈ ఏడాది జిల్లాలో 80 శాతం సంఘబంధాల్లో మార్పులు చేయడం పూర్తిచేశామన్నారు. ఆమె వెంట ఐబీ ఏపీఎం రమేష్, ఏసీ మధుసూదన్‌రావు, వెలుగు ఏపీఎం నిర్మల, సీసీలు శ్రీకాంత్, రాజేశ్వరమ్మ, దేవమ్మ ఉన్నారు.

మునిసి'పల్స్'

కనిపించిందా జాగా.. వేయ్ పాగా



ఆక్రమిత స్థలాల్లో ఏర్పాటు చేసిన గడ్డివాములు

ఆత్మకూరు రూరల్: ఐదేళ్ల క్రితం సీ గ్రేడ్ మున్సిపాల్టీగా అవతరించిన ఆత్మకూరులో ఒక్కసారిగా స్థలాలకు డిమాండ్ ఏర్పడింది. ఇదే అదునుగా మున్సిపాల్టీ పరిధిలోని ఖాళీ స్థలాలపై పలువురు కన్నేసి ఆక్రమించుకున్నారు. ఆయా స్థలాల్లో దర్జాగా ఇటుకల బట్టీలను ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహిస్తుండగా.. మరికొందరు ఏకంగా పక్కాభవనాలను కట్టి అద్దెలకు ఇచ్చేశారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మి మున్సిపల్ స్థలాల ఆక్రమణలను పరిశీలించి కొన్ని స్థలాలకు ప్రహరీలను నిర్మించి బోర్డులను ఏర్పాటు చేశారు. అనంతరం మున్సిపల్ తొలి పాలకవర్గం ఏర్పడినా మున్సిపల్ స్థలాల అన్యాక్రాంతంపై ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం. పట్టణ పరిధిలోని టెక్కె, బట్టేపాడు రహదారుల్లో పలు విలువైన స్థలాలు ఆక్రమణలకు గురైన అంశంపై పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు స్పందించిన కమిషనర్ అవి మున్సిపల్ స్థలాలంటూ బోర్డులను ఏర్పాటు చేశారు. తదనంతరం ఆక్రమణదారులు ఏకంగా బోర్డులను తొలగించి అధికారులను నమ్మించేందుకు రైతుల ఆధీనంలో ఉన్నట్లుగా గడ్డివాములను ఆ స్థలాల్లో ఏర్పాటు చేశారు. సుమారు పదెకరాలకు పైగా ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నాయి. ఆక్రమణదారులకు టీడీపీ నేతలు మద్దతుగా నిలుస్తున్నారు. మరోవైపు ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెం వద్ద పెన్నానదిపై భారీ స్థాయి వంతెనను నిర్మించడంతో చేజర్ల మండలానికి దగ్గర దారి ఏర్పడింది. వెంకటగిరి, తిరుపతి ప్రాంతాలకు ఆత్మకూరు నుంచి దూరం తగ్గడం, హైదరాబాద్ నుంచి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేస్తున్న జాతీయ రహదారికి ఈ మార్గం అందుబాటులో ఉండటంతో మున్సిపాల్టీ పరిధిలో మరో బస్టాండ్‌ను ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. బస్టాండ్ ఏర్పాటుకు బట్టేపాడు మార్గంలోని మున్సిపల్ స్థలాన్ని ప్రతిపాదిస్తున్నారు. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో 30 ప్రభుత్వ స్థలాలను గుర్తించామని, వీటిలో ఓ స్థలంలో పార్క్ ఏర్పాటుకు యత్నిస్తున్నామని కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

వివాదంలో భూములు

గూడూరు: మున్సిపాల్టీలో 30 ఏళ్ల క్రితం ఏర్పాటైన నాలుగు పార్కులూ అభివృద్ధికి నోచుకోలేదు. నాలుగు పార్కులతోపాటు, మున్సిపాల్టీకి చెందిన మరో రెండు స్థలాల విలువ సుమారు రూ.6.7 కోట్లు ఉంటుంది. రెండో పట్టణంలో ఉన్న 96 సెంట్ల స్థలం వివాదంలో ఉంది. ఈ స్థలం విలువ ప్రస్తుతం సుమారు రూ.10 కోట్ల వరకూ ఉంటుంది. వైఎన్నార్, పీఎస్సార్, ఎన్టీఆర్, సర్వేపల్లి రామారావు పార్కులు 1.17 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. వీటి విలువ రూ.5.4 కోట్లు. అలాగే రెండో పట్టణంలోని అన్నంగి బాబూరావు పార్కులో సగానికి పైగా రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు కేటాయించారు. మిగిలిన 50 అంకణాల స్థలం ఎలాంటి అభివృద్ధికి నోచుకోక వృథాగా ఉంది. అదే ప్రాంతంలోని స్వర్ణాంధ్రభారత్‌నగర్‌లో సుమారు 60 అంకణాల్లో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. పట్టణంలోని వినాయక స్వామి ఆలయం వెనుక భాగంలో మున్సిపాల్టీకి చెందిన 96 సెంట్ల స్థలం కొంత ఆక్రమణకు గురికాగా, మిగిలిన స్థలంలో ప్రాథమిక పాఠశాల ఉంది.



గూడూరు రెండో పట్టణంలో వివాదాస్పదంగా మారిన స్థలం



కన్నుపడితే..



నెల్లూరు పద్మావతినగర్‌లో కార్పొరేషన్ స్థలంలో నిర్మించిన షెడ్డు

కార్పొరేషన్లో ఆక్రమణల జోరు

నెల్లూరు(పొగతోట):

నెల్లూరు కార్పొరేషన్లో పేదలు ఆక్రమించిన స్థలాలను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు బడాబాబుల జోలికి మాత్రం వెళ్లడంలేదు. నగరంలో అధికార పార్టీ నేతలు అన్నీ తామై వ్యవహరిస్తూ కార్పొరేషన్ స్థలాలను ఇష్టానుసారంగా ఆక్రమించుకుంటున్నారు. మూలాపేటలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు కార్పొరేషన్ స్థలాన్ని ఆక్రమించి పాఠశాల ఆట స్థలంగా వినియోగిస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా గోడను నిర్మించడంతో పాటు ముందు దేవాలయం, మసీదును నిర్మించారు. చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలో 110 అంకణాల కార్పొరేషన్ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీని నిర్మించారు. పద్మావతినగర్ ప్రాంతంలో కార్పొరేషన్ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీని ఏర్పాటు చేసి రూమ్‌ను నిర్మించారు. కార్పొరేషన్ పరిధిలో సుమారు 140 ప్రాంతాల్లో 180 ఎకరాల భూములు ఉండగా, ఇందులో 50 ఎకరాల వరకు అన్యాక్రాంతమైనట్లు సమాచారం. మూలాపేట, చిల్డ్రన్స్‌పార్క్, బీవీనగర్, తదితర ప్రాంతాల్లో కార్పొరేషన్ స్థలాలను మార్పు చేసి పట్టా భూములుగా మార్చినట్లు సమాచారం. కొందరు నకిలీ పత్రాలను సృష్టించి కార్పొరేషన్ స్థలాలను ఆక్రమించగా, మరికొందరు బోగస్ పత్రాలతో స్థలాలు తమవంటూ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. కార్పొరేషన్లో భూముల మార్పు 15 ఏళ్ల నుంచే ప్రారంభమైంది. దీని వల్ల అన్యాక్రాంతమైన భూములను గుర్తించడం అధికారులకు తలనొప్పిగా పరిణమించింది. అధికారులు గుర్తించిన స్థలాలను ఆక్రమణకు గురికాకుండా కాపాడగలుగుతున్నారు. మూలాపేటలో అధికార పార్టీ నాయకుడు ఆక్రమించిన కార్పొరేషన్ స్థలంపై కమిషనర్ ఢిల్లీరావును సాక్షి సంప్రదించగా, కార్పొరేషన్ స్థలమని కొందరు.. మరికొందరు తమ స్థలమంటూ కోర్టును ఆశ్రయించారని, రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాకే నిర్ధారణకు వస్తామని బదులిచ్చారు.

ఆక్రమించడం...

వెంకటగిరి: వెంకటగిరి 2004
ధరలకు రెక్కలొచ్చాయి. ఆక్ర
షరా మామూలైంది. ఆస్తుల
డుగేస్తున్నారు. అధికారిక లెక్క
ర్, సుదర్శన్‌నగర్, ఎన్టీఆర్ కా
ముద్రం ప్రాంతాల్లో సుమారు
ముద్రం ప్రాంతంలోని పదెకర
ప్రాంతాల్లోని స్థలాలు ఆక్రమ
ఉన్నా, ఆ దిశగా చర్యలు తీసు
వీవర్స్ కాలనీలో సామాజిక
చేయడం, ఆపై తమకు మార్పె
కురుగొండ్ల రామకృష్ణ సతీమ
ఖాస్తు చేసుకున్నారు. దీనికి ప్ర
లకు పంపినా అడిగే నాథుడే
ముఖ్యమైన రోడ్ల వెంట స్థలా
నాలు, దుకాణాలను నిర్మిస్తున
వదిలిపెట్టడంలేదు. మున్సిపల్
డంలేదు.




నెల్లూరు మూలాపేటలో కార్పొరేషన్ స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన పాఠశాల క్రీడా మైదానం

హాంఫట్

- అధికార పార్టీ అండదండలతో దర్జాగా అనుభవం
- రూ.కోట్ల విలువజేసే భూములు అన్యాక్రాంతం

జిల్లాలో కార్పొరేషన్, మున్సిపాల్టీలకు సంబంధించిన రిజర్వ్‌డ్ స్థలాలు అన్యాక్రాంత మవుతున్నాయి. పట్టించు కోవాల్సిన మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తుండ టంతో ఇష్టానుసారంగా ఆక్ర మించి భవనాలను నిర్మిస్తు న్నారు. నెల్లూరు కార్పొరేషన్లో ఈ తంతు జోరుగా సాగు తోంది. కాలువ కట్టలు, తదితర ప్రాంతాల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్లపై ప్రతాపం చూపిస్తున్న అధికారులు బడా బాబుల జోలికెళ్లకపోవడం విమర్శలకు తావిస్తోంది.

. శాశ్వతంగా నిర్మించడం

ో మున్సిపాల్టీగా ఆవిర్భవించిన నాటి నుంచి స్థలాల మించడం, అనంతరం శాశ్వత నిర్మాణాలు చేపట్టడం క్షణ, అక్రమార్కులపై చర్యలకు అధికారులు వెనుక ల ప్రకారం పట్టణంలోని ఎన్జీఓ కాలనీ, ఈశ్వర్‌నగ లనీ, ధర్మాపురం, రామలింగేశ్వర ప్రాంతం, అక్కస 15.47 ఎకరాల స్థలం మున్సిపాల్టీకి ఉంది. అక్కస ాల్లో డంపింగ్‌యార్డును నిర్మించారు. మిగిలిన ణకు గురికాకుండా ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాల్సి కోవడం లేదు. ఉపాధ్యాయనగర్ సమీపంలోని అవసరాలకు కేటాయించిన స్థలాలను సైతం కబ్జా ్కట్ రేటుకు కేటాయించాలని అధికార పార్టీ ఎమ్మెల్యే జి కురుగొండ్ల సింధు పురపాలక సంఘానికి దర స్తుత పాలకవర్గం ఆమోదం తెలిపి ఉన్నతాధికారు కరువయ్యారు. ఇక మున్సిపాల్టీ పరిధిలోని లను తమ సొంత స్థలంలో కలిపేసుకొని పక్కా భవ ్నారు. రోడ్డు వెంట వరదనీరు పోయే డ్రెయిన్లనూ ్ స్థలాల్లో కనీసం బోర్డులను సైతం ఏర్పాటు చేయ

మున్సిపాల్టీ స్థలాల వివరాలు

ప్రదేశం	విస్తీర్ణం (ఎకరాల్లో)	ప్రభుత్వ విలువ (రూ)
ఎన్జీఓ కాలనీ	0.50	41,14,000
ఈశ్వర్ నగర్	0.07	8,00,000
సుదర్శన్‌నగర్ -1	0.03	3,00,000
సుదర్శన్‌నగర్ -2	0.45	37,00,000
ఎన్టీఆర్‌కాలనీ -1	0.22	23,00,000
ఎన్టీఆర్ కాలనీ -2	0.15	16,00,000
ధర్మాపురం	1.00	2,47,00,000
అక్కసముద్రం	10.00	5,81,00,000
రామలింగేశ్వర ప్రాంతం	1.05	12,00,000


వెంకటగిరిలోని కాలేజీ మిట్ట ప్రాంతం నుంచి కైవల్యా నదిలోకి వరదనీరు ప్రవహించే కాలువ ఆక్రమణ

స్థలాల కేటాయింపులో నిర్లక్ష్యం

నాయుడుపేట టౌన్: నాయుడుపేట నగర పంచాయతీలో రిజర్వ్‌డ్ స్థలాల కేటాయింపులో నిర్లక్ష్యం చూపుతున్నారు. ప్రభుత్వ అప్రూవల్ లేకుండా సుమారు 25కు పైగా లే అవుట్లు ఉండగా, కేవలం 1.82 ఎకరాల మేరే ప్రభుత్వ స్థలాన్ని రిజర్వ్ చేశారు. పిచ్చిరెడ్డితోపులోని బీఎమ్మార్ లేఅవుట్ ఒక్కటే ప్రభుత్వ అప్రూవల్ పొందింది. దీనికి సంబంధించిన 0.90 సెంట్లు, కొత్త బీడీ కాలనీలో 0.27 సెంట్లు, శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు వద్ద 0.55 సెంట్లు మాత్రమే అధికారులు నగర పంచాయ తీకి సంబంధించిన భూమిగా రిజర్వ్ చేశారు. ఇటీవల గోమతి సెంటర్ సమీపంలో టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఓ భారీ వెంచర్‌ను ఏర్పాటు చేసి అప్రూవల్ కోసం మున్సిపల్ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపారు. అయితే ముందుగా ప్రభుత్వం కేటాయించాల్సిన భూమిని రిజర్వ్ చేసుకొని స్థానిక మున్సిపల్ శాఖకు రిజిస్ట్రేషన్ సైతం చేసి ఇవ్వాల్సి ఉంది. అయితే ఈ దిశగా అధికారులు చర్యలు చేప ట్టడం లేదని సమాచారం. పట్టణంలో సుమారు 25కు పైగా అనధికార లేఅవుట్లు ఉన్నాయి. వీటి ద్వారా రిజర్వ్‌డ్ స్థలాలు చాలా వరకు వచ్చే అవకాశం ఉంది. అయితే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

రూ.300 కోట్ల విలువైన
భూములకు ఎసరు


సూళ్లూరుపేటలో ఆక్రమణలతో కుచించుకుపోయిన దశబృంద గుంత

సూళ్లూరుపేట: పట్టణంలో భూములకు ఉన్న డిమాండ్ దృష్ట్యా పలువురు ఇష్టానుసారంగా ఆక్రమిస్తున్నారు. పట్టణంలో రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసిన వాళ్లు చాలా మంది పట్టా పొలాన్ని కొనుగోలు చేసి బారెడు అసైన్‌మెంట్ భూములను కలుపుకొని ప్లాట్లు వేసి విక్ర యించిన ఉదంతాలూ ఉన్నాయి. మున్సిపాల్టీ పరిధిలో సుమారు రూ.300 కోట్ల విలువజేసే ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు రెవెన్యూ రికార్డులు చెప్తున్నాయి. మున్సిపాల్టీ పరిధిలోకి వచ్చే రెండు చెరువులు, మూడు గుంటలు కలిపి సుమారు 125 ఎకరాలు కబ్జా కోరల్లో ఉన్నాయి. ఇవి మేజర్ పంచాయతీగా ఉన్నప్పటి నుంచే కబ్జా చెరలో ఉన్నాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న ఎరబాళెం చెరువు 90 శాతానికి పైగా సుమారు 30 నుంచి 40 ఎక రాల వరకు కబ్జాకు గురైంది. మున్సిపాల్టీ పరిధిలోని 69.5 ఎకరాల పడమటికండ్రిగ చెరువు కూడా అన్యాక్రాంతమైపోయింది. దీనికి క్రయవిక్రయాలు కూడా జరిగిపోతు న్నాయి. పట్టణంలోని దశబృందం, స్వతంత్ర పురం, కోళ్లమిట్టలోని మరో గుంతతో పాటు పలు గుంతలు కబ్జా కోరల్లో చిక్కుకుపోయి ఉన్నాయి. పట్టణ పరిధిలో సుమారు 29 లే అవుట్లు వేయగా, దీనికి పది శాతం భూమి మున్సిపాల్టీకి వదలకపోగా ఆ వెంచర్‌లో ఉన్న ప్రభుత్వ భూమినే మింగేసిన ఘనులున్నారు. మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాల్టీగా రూపాంతరం చెందాక మున్సిపల్ భూముల వివరాలను రెవెన్యూ అధికారుల నుంచి మున్సిపల్ అధికారులు తీసుకోవాల్సి ఉండ గా, ఆ ప్రక్రియ నేటికీ జరగలేదు. పందల గుంట ప్రాంతంలో సుమారు 25 ఎకరాలకు పైగా అసైన్డ్ భూములు భూస్వాముల చేతు ల్లోనే ఉన్నాయి. మున్సిపాల్టీ లెక్కల ప్రకారం 17.74 ఎకరాల రిజర్వ్‌డ్ స్థలాలు మాత్రమే ఉన్నాయి. పరమేశ్వరినగర్ సమీపంలో మున్సిపాల్టీకి చెందిన 92 సెంట్ల భూమి ఆక్ర మణపై కోర్టులో కేసు జరుగుతోంది. పడమటి కండ్రిగ, ఎరబాళెం చెరువుల ఆక్రమణలపై ఎలాంటి చర్యలు లేకుండాపోయాయి. పడమ టికండ్రిగ చెరువును డంపింగ్ యార్డుగా ఎంపిక చేసేందుకు చైర్‌పర్సన్ నూలేటి విజయ లక్ష్మి యత్నించగా, అప్పటి కాంగ్రెస్ పార్టీ నాయకుల నుంచి ఒత్తిడి రావడంతో ఈ యత్నాన్ని విరమించుకున్నారు.

కబ్జా కోరల్లో రిజర్వ్‌డ్ స్థలాలు


కావలిలో ఆక్రమణకు గురైన స్థలం

కావలి: కావలి మున్సిపాల్టీలో రిజర్వ్‌డ్ స్థలాలు కబ్జా కోరల్లో ఉన్నాయి. కావలి పంచాయతీ నుంచి మున్సిపాల్టీగా అవతరించిన సమయం లో పట్టణంలోని వెంగళరావునగర్‌లో 70 ఎక రాల రిజర్వ్‌డ్ స్థలం ఉండేది. అయితే ఆక్రమ ణకు గురవడంతో ప్రస్తుతం రెండెకరాలు కూడా లేదు. పట్టణం మొత్తమ్మీద వందెకరాలకు గానూ ప్రస్తుతం 15 ఎకరాల రిజర్వ్‌డ్ స్థలం కూడా లేదు. మున్సిపాల్టీ లేఅవుట్ పెట్టి ప్లాట్లు అమ్మకాలు చేసిన బాపూజీ నగర్‌లో 56 సెంట్లు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం రిజర్వ్‌డ్ స్థలాన్ని వదిలిపెట్టారు. అయితే వాటిలో 20 ఏళ్ల నుంచి ఎలాంటి నిర్మాణం చేయకపోగా, కనీస జాగ్రత్త చర్యలు కూడా తీసుకోలేదు. రూ.కోట్ల విలువజేసే ఈ స్థలం ఆక్రమణకు గురైంది. ఇటీవల హౌసింగ్ శాఖ అక్కడ ఉన్న కబ్జాదారులకు ఇళ్లు నిర్మించుకోవడానికి పక్కా గృహాలను మంజూరు చేసింది. వారు నిర్మా ణాలు ప్రారంభించేసరికి, అప్పుడు కళ్లు తెరిచిన మున్సిపాల్టీ హౌసింగ్ శాఖతో సంప్రదించి మంజూరైన గృహాలను రద్దు చేసింది. పట్టణం లో ఎన్నో రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిశాయి. వీటిలో కచ్చితంగా రిజర్వ్‌డ్ స్థలాలు ఉండాలి. అయితే మున్సిపాల్టీ ఒక్క రిజర్వ్‌డ్ స్థలాన్ని కూడా స్వాధీనం చేసుకోలేదు. పట్టణ పరిధిలో స్థలాల రేట్లు రూ.లక్షలు పలుకుతుండటంతో ఆక్రమణదారులు వాటిని వశపర్చుకుంటు న్నారు.

రైతులకు రూ.180 కోట్ల రుణాలు

నెల్లూరు (వీఆర్సీ సెంటర్) : జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ద్వారా సహకార రైతు వికాస పథకం కింద 5 వేల మంది రైతులకు రూ.180 కోట్ల రుణాలుగా అందించినట్లు చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెప్టెంబర్ 8న బ్యాంకు 100 ఏళ్ల పండగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నష్టాలో ఉన్న బ్యాంక్ ఆదాయంలోకి తీసుకు వచ్చామని, అయితే కొన్ని సొసైటీలు నష్టాల్లో ఉన్న మాట వాస్తవమేనని, వాటిని కూడా 2018 కల్లా లాభాల బాటలో తీసుకువస్తామన్నారు. గతంలో ఈ బ్యాంక్ రూ.8 కోట్ల నష్టాల నుంచి కోటిన్నర లాభాల్లోకి చేరిందని, మద్దూరుపాడు సహకార సంఘం బ్యాంక్‌నకు రిసీడ్ చేసుకునేందుకు పాలకవర్గం ఆమోదం లభించడం, దువ్వూరు పీఏసీఎస్ కన్వరెన్స్‌హాల్ నిర్మాణానికి రూ.10.50 లక్షలు, మల్లాంకు 50 లక్షల క్యాష్ క్రెడిట్ కింద రుణం మంజూరు చేశామన్నారు.

7న ఏపీ రాష్ట్ర సహకార బ్యాంక్ బోర్డు సమావేశం

సెప్టెంబర్ 7న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ బోర్డు సమావేశం నెల్లూరు కేంద్ర సహకార బ్యాంక్ ఆవరణంలో జరుగుతుందని, ప్రతి ఏటా విజయవాడలో జరిగే ఈ సమావేశం నెల్లూరులో జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి 13 జిల్లాల సహకార బ్యాంక్ చైర్మన్లు, అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో బ్యాంక్ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, డైరెక్టర్ కోడూరు కమలాకర్‌రెడ్డి, బుర్రా వెంకటేశ్వర్లుగౌడ్, చిట్టమూరు వెంకటశేషారెడ్డి, శివరామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మెట్టుకూరు ధనుంజయరెడ్డి

సాక్షి క్లాసిఫైడ్స్



■**Flash.. Flash..** Andhra University. Degree One Sitting and 10th, Inter, PG, Diploma, B.Tech, M.Tech, ITI. Eligible for All Government Jobs. Further Details Contact: 70366 72144. [N-878012]

■**DRDA Govt.** పథకం ద్వారా ఉచితంగా Tally & టైలరింగ్ నందు శిక్షణ ఇచ్చి జాబ్ కల్పించబడును. ఉచిత హాస్టలు కలదు. Govt. Certificates ఇవ్వబడును. ఈ శిక్షణ లేడీస్‌కి మాత్రమే. సెల్: 8885687777, 9515189026. [N-878412]

COACHING

■**Lotus Medical Academy** NEET Long term New Batch Start from 1-9-2017, Netaji Nagar, Nellore. Cell: 89785 77627 [NA-7257]

DIRECT FINAL YEAR

■ఒకే సం॥ 10th, Inter & B.A, B.Com, B.Sc, MA, M.Com, M.Sc, MBA, Diploma, B.Tech, Eligible for Govt Jobs శ్రీభారతి స్టడీ సెంటర్, నెల్లూరు - గూడూరు. 94415 53070. [N-878262]

HOME TUTIONS

■**రిషిల్ కోచింగ్ సెంటర్, ఫత్తేఖాన్‌పేట, 1st to X,** Inter, Diploma, B.Tech మీ ఇంటివద్ద / మా వద్ద ట్యూషన్స్ చెప్పబడును. సెల్: 73311 20338. [N-878181]



■మైపాడు రోడ్డు, 3వ మైలు దగ్గర అంకణం 33 నుండి 65 వేలు, నవాబుపేట ఇళ్ళు 22 నుండి 65 లక్షలు, రేగడి చెలక దగ్గర 3 లక్షల 20వేలకే ప్లాట్లు అమ్మబడును. సెల్: 7569574143. [NA-6512]

FLAT FOR SALE

■శ్రీసాయిహర్ష హోమ్స్ నెల్లూరు పెదపడుగుపాడులో 2 BHK మిని అపార్ట్‌మెంట్ 1086Sqft & ఇండిపెండెంట్ హౌసెస్ కలవు.బ్యాంకులోను సౌకర్యం. సంప్ర : 94935 17497, 99481 35809. [N-847924]

■**మైపాడు రోడ్డు 4వ మైలు,** రాధా కృష్ణ ఎన్‌క్లేవ్ లేఅవుట్ నందు ఫుల్లీ ఫర్నిష్డ్ (POP సీలింగ్, వాల్ కెరి, సేఫ్టి గ్రిల్స్) 909 Sft ప్లాట్ కారు పార్కింగ్, బ్యాంక్ లోన్, రెడి టూ ఆక్యుపై అమ్మబడును. సెప్టెంబర్ 15 లోపు బుక్ చేసుకొన్న వారికి రిజిస్ట్రేషన్ ఫ్రీ. 9440609163 [N-878313]

PLOT FOR SALE

■**అపోలో హాస్పిటల్ దగ్గర హరనాథపురం దగ్గర** దక్షిణ, తూర్పు 40 - 60 అడుగుల రోడ్డు గల ప్లాట్లు అమ్మబడును. సంప్ర: 83091 59596. [N-878377]

■**ఆత్మకూరు బస్టాండ్ నుండి** 6 కి.మీలో 4 రోడ్ల జంక్షన్, నరుకూరు సెంటర్, గేటెడ్ కమ్యూనిటీ DT CP ప్లాట్స్ అనుకూలమైనధరలో, 80% బ్యాంక్ లోన్, స్పాట్ రిజిస్ట్రేషన్‌పై 10 గ్రాగోల్డ్‌ఫ్రీ. 8008615946 [NA-7264]

■**90 వేలకే ప్లాట్** ఇంటర్నేషనల్ స్టేడియం నగర వనం ఇండస్ట్రీయల్ పార్, అతి దగ్గరగా ప్లాట్స్ కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్ ఫ్రీ, ఇ.యం.ఐ. సౌకర్యం, ఈ నెల ఆఖర మాత్రమే. సెల్: 7661929417 [NA-7265]

TO-LET

■**2BHK Flat 1st Floor, Amrutha Estates** Appartments, Opp Veda Vyasa School, Magunta Layout for Rent. 90005 30307, 73967 55593, 94914 55343. [NA-7263]



ASTROLOGY

■జరిగింది, జరగబోయేది, జరగబోతుంది, ప్రేమ, కోర్టు, కుటుంబ ఏ సమస్యలు ఉన్న ముఖం చూసి జ్యోతిష్యం చెప్పబడును. సంప్ర : రాజు కోయదొర, సిరిమల్టీ ఫ్లెక్స్ ప్రక్కన, నెల్లూరు ✆ 99599 23006. [B-0047]

BUSINESS OFFER

■**GST Filing** మరియు ఇతర సేవలతో కూడిన CDSL Approved GST Suvidha కేంద్రాలు. నెల్లూరు జిల్లా ఏరియాలవారీగా Franchise ఇవ్వబడును. 9121927315 [N-878410]

■**పేపర్ & థర్మాకోల్ ప్లేట్స్,** తయారు చేయు హైడ్రాలిక్ & ఆటోమెటిక్ మిషన్లు ఆఫర్ రేట్లలో అమ్మకం. ముడిసరుకు ఇచ్చి తయారైనది కొంటాం. అగ్రిమెంట్ కలదు. శ్రీ సాయిలక్ష్మి - 79954 35872. [R-318]

■**మీ ఇంటి దగ్గరే ఉంటూ హ్యాండ్‌రైటింగ్** వర్క్ చేస్తూ అధిక ఆదాయం సంపాదించండి. వివరాలకు సంప్ర: 8465940151. [M-855900]

TAILORING

■ఉచిత టైలరింగ్ శిక్షణ: బేసిక్స్ నుండి మోడల్స్ వరకు కేవలం 45 రోజులలో నేర్పించి ఉపాధి కల్పించబడును. Govt సర్టిఫికేట్ ఇవ్వబడును నెల్లూరు. సెల్: 8801306394 [N-878193]

GOLD FINANCE

■**బ్యాంకులు / సంస్థల నుండి తాకట్టు** పెట్టిన మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. సంప్రదించండి : ✆ 95739 44799 [B-0064]

■**బ్యాంకులు / సంస్థల నుండి తాకట్టు** పెట్టిన మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. సంప్రదించండి : ✆ 81421 30517 [B-6189]

■**బ్యాంకులు / సంస్థల నుండి తాకట్టు** పెట్టిన మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. సంప్రదించండి : ✆ 79933 17340 [B-6188]

■**Gold Netic-** బంగారం బ్యాంకులో, ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి కొనబడును. మరియు మీపాత బంగారం కొనబడును. సంప్ర॥ ✆ 9642796420, 9642796421 [O-595421]

పుట్టగొడుగుల పెంపకం మష్రూమ్ డీలర్‌షిప్

■పుట్టగొడుగుల పెంపకం ద్వారా ఇంటిలో గంట పనిచేస్తూ అధిక ఆదాయం. శిక్షణ ఇచ్చి పుట్టగొడుగులు మేమే కొంటాం మష్రూమ్ విత్తనాలు(స్పాన్) లభించును. నోట్ : పంక్షన్లకు, మష్రూమ్ సప్లైయ్ చేయబడును.మష్రూమ్స్ అమ్మటకు డీలర్స్ కావలెను.సంప్ర: 9966158007 [C-617201]

WEIGHT LOSS

■**5 వారాలలో డైట్ లేకుండా 8-10 KG** ల బరువు, చేతులు, తొడలు, పొట్ట సైజు, మల బద్ధకం, గ్యాస్ట్రిక్ ప్రాబ్లం, మోకాళ్ళ నొప్పులు తగ్గుతాయి. ఫోన్: 7207923770. [HA-14278]

TOURS & TRAVELS

■**కావేరి పుష్కర యాత్ర:** గురువాయూర్, త్రివేండ్రం, తిరుచూర్, కన్యాకుమారి, కుర్తాళం, 10 కాశి, భవాని, రామేశ్వరం,శ్రీరంగం11.9.17టి॥రూ.5900/-, 21.9.17 3రో॥ టి:3200/-. బొబ్బల శేషయ్య: 98665 27640 [NA-466]



■**Wanted Teachers** to teach Maths for 8th, 9th, 10th Classess. Salary 10,000/- Contact: 9966776907 [NA-7269]

■**Short listed MBA, MCA, Freshers** and Retired Middle Mgnt. people consider for training. Cell: 99850 16999. [NA-6871]

■**Jobs @ Bank Product** (Personal Loans) Telecaller: Graduate & M.S.Office. Salary: 10,000/-. Nellore Town, Sales Exe.: 10+2, Sal: 10,000/-. 8340900666 [N-878320]

■**Airtel: Wanted Customer Relation Officer** (F) and Marketing Executives(M). Qlfy: Inter and above. Opp-Nippo, Vedayapalem, NLR. Cont: 90001 44918, 77020 27498. [NA-1220]

■**కలెక్షన్ ఏజెన్సీ** నందు పనిచేయుటకు అనుభవమున్న కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. సెల్: 9494451122. [NA-1219]

■**SR Ayur Pharma ISO & GMP సర్టిఫైడ్** కంపెని ప్రొడక్ట్స్‌ను మార్కెటింగ్ చేయుటకు అభ్యర్థులు కావలెను. Qul: ఇంటర్, డిగ్రీ. Cont: 88856 26363, 94931 26059 [G-550596]

■ ప్రముఖA.P(R)సంస్థలో **పర్మినెంట్‌గా** జాబ్స్ చేయుటకు 7,10,ఇంటర్,డిగ్రీ,డిప్లమా, చదివిన వ:17-24సం.లోపు యువకులు కావలెను.నో ఫీజు, రూంఫ్రీ. ✆ 9100647227. [T-863199]

■**క్యాటరింగ్ వర్క్** పనిచేయుటకు స్త్రీ పురుషులు కావలెను. డైలి పేమెంట్ రూ.900/-. టైమ్: ఉ॥ 8 నుంచి మ॥ 1.30. సా॥ 4 నుంచి రాత్రి 11.30 వరకు, F/P. 9052984264 [N-878395]

■ **ప్రముఖ రియల్ ఎస్టేట్ నందు** మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్ లీడర్స్, టెలీకాలర్స్ కావలెను. MGB మాల్ వెనుక, దర్గా మిట్ట. సెల్: 93949 81116. [NA-7266]

■**GST Suvidha Kendraలో** పనిచేయుటకు అకౌంట్స్ మరియు System Knowledge కలిగిన యువతీ యువకుడు కావలెను. వివరాలకు సంప్రదించండి: ఫోన్: 80964 32699. [N-878409]

■**ప్రముఖ MNC కంపెనీ నెల్లూరులో** పనిచేయుటకు Graduates Experience, Fresher Female. Interview Dt: 31.08.17, 01.09.17, 11.00 AM. 8886466631, 8498999926 [NA-5232]

■**ఇంట్లోనే ఉండి ఇంటి పని మరియు** వంట పనిచేయుటకు అనుభవం కల్గిన ఆడమనిషి కావలెను. జీతం : 6000/-. సంప్రదించండి: సెల్: 98498 72255. [NA-7271]

■**అశోక్ లైలాండ్ దోస్త్** నడుపుటకు డ్రైవర్లు కావలెను. లైసెన్స్, బ్యాడ్జ్ కలిగి యుండవలెను. వివరాలకు సంప్రదించండి : సెల్: 9642680470 [NA-3634]

■**నెల్లూరులో** ప్రముఖ సంస్థ యందు పనిచేయుటకు అర్జెంటుగా కావలెను. 12 గం॥ డ్యూటి, 7000/- జీతం. భోజన సౌకర్యం కలదు. 7989874626, 7337409826 [N-878328]

■**నెల్లూరులో** ప్రముఖ విద్యాసంస్థలో పని చేయుటకు క్లాస్ ఇన్ చార్జి/ మార్కెటింగ్ ఇన్ చార్జి/ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర: 9133345575, 9133345588 [NA-24]

■**శ్రీరామ్ గ్రూప్‌లో** పనిచేయుటకు Bed/ S.O/ టెలి కాలర్స్ కావలెను. Qlf: Inter/Any Degree. Salary: 10 వేలు+ ఇన్‌సెంటివ్స్ సంప్రదించండి: 90521 55545 [N-878194]

■**డా॥ పి.మధుసూదనశాస్త్రి హాస్పిటల్ నందు** పని చేయుటకు నర్సులు కావలెను. బయోడేటా సర్టిఫికేట్స్‌తో నేరుగా సంప్ర: కాంప్లెక్స్ రోడ్డు, పొగతోట, నెల్లూరు. [NA-7262]

■ప్రముఖMNCకంపెనీలోపనిచేయుటకుటెలీకాలర్స్ (F),ఎగ్జిక్యూటివ్స్(M/F)కావలెను.జీతం+కమీషన్, ఏజెంట్లు కావలెను. (M/F) కమీషన్ గృహిణిలకు అవకాశం. 86866 06466, 81063 36220. [N-878314]

■**ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ కంపెనీ కొరకు** R.O.వాటర్ ప్యూరిఫైయర్స్ & R.O. మినరల్ వాటర్ ప్లాంట్స్ టెక్నీషియన్స్ కావలెను. Freshers can also apply. 8500074575. [N-878183]

■**నెల్లూరు పొదలకూరు రోడ్ BM రెడ్డి** పెట్రోల్‌బంక్ నందు పనిచేయుటకు బాయ్స్, గర్ల్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర: 94402 78152. [NA-080]

■**నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో** ప్రముఖ షాప్ నందు పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్రదించండి: 9494752811. [NA-1221]

■**ముత్తుకూరు స్రవంతి హోటల్‌లో** పని చేయుటకు చైనీస్ మాస్టర్, చపాతీ మాస్టర్లు కావలెను. భోజనం, రూమ్ ఉచితం సంప్ర: 0861-2377267, 94903 19998. [NA-1250]

■ **HYD 5Star Hotelsలో ఫిలింయాక్టర్ & VIP పార్టి**కి క్యాటరింగ్ బాయ్స్, హె॥కా॥. వ॥ 18- 30 రూం +మీల్స్‌ఫ్రీ,జీ:12-14,500.సాత్విక(ఎ)ప్రైజెస్,రె॥మె॥ బజార్,సి॥బాద్ .8187842675/7702136573 [H-691553]

■ **HYDలో ఇంట్లో ఉంటూ ఇంటి పనికి/వంట పనికి & వృద్ధులను/పిల్లలను చూసుకోవడానికి** స్త్రీ /పురుషులు కావలెను వ॥ 20-40 సం॥ రూం +అకామిడేషన్. 9063230058/9063230059 [H-691567]

■**హెల్పర్స్ కావలెను:** నెల్లూరు టౌన్‌లోని ప్రముఖ వస్త్ర షోరూమ్ నందు 18 నుంచి 25 సం॥లలోపు వయస్సు గల హెల్పర్స్ కావలెను. సంప్రదించండి: 7013184394. [NA-087]

■ SSC/ Inter,డిగ్రీ P/F గల 30 మంది స్త్రీ/పులకు ఉద్యోగాలు, జీతం:9600+ DA 4200+ఫ్రీ రూం. 30 సం.లోపు వారు సంప్ర: సింధూ ప్రమోషన్స్,శాలివీధి,నెల్లూరు, 9052903093. [T-863284]

■**కాల్ చెయ్యండి! ఈ రోజే ఉద్యోగంలో చేరండి!** SSC, ITI,Diploma,డిగ్రీ వారికి బెంగళూరులో Flipcartలో Pickkers,Packers, BPOగా ఉద్యోగం, జీ:10,000+రూం+భోజనం ఫ్రీ. 7207645333. [T-2717]

■**మేము చిత్రీకరించే లఘు చిత్రాలకు** తెలుగు చక్కగా మాట్లాడగల్గిన వ్యాఖ్యాత (మహిళలకు ప్రాధాన్యత) మరియు మిమిక్రీ ఆర్టిస్టు కావలెను. సెల్: 90325 55347. [R-840244]

■ **నెల్లూరులో ప్రముఖ యాడ్ ఏజెన్సీలో** బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేయుటకు డిగ్రీ చదివి , టూ వీలర్ కలిగిన 25 సం॥లోపు యువకులు కావలెను. జీతం రూ.8000 + T.A +D.A సెల్ : 94914 74499. [P-2830]

■మా హోటల్ నందు పనిచేయుటకు అనుభవం గల ఎలక్ట్రీషియన్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. ఆసక్తికలవారు నేరుగా కలవండి. హోటల్ అభిరాం, ఆచారివీధి, నెల్లూరు [NA-474]

■**ఆసియా కస్టమ్స్** - సెల్ యాక్ససరీస్ షాప్ నందు పనిచేయుటకు కంప్యూటర్‌లో అనుభవం గల సేల్స్ గర్ల్స్ కావలెను. మంచి జీతం. సీకో టీ సెంటర్, ట్రంకు రోడ్డు, నెల్లూరు. 9347110899 [NA-060]

CONSULTANCY

■**మీ సంస్థలకు కావలసిన అన్ని రకాల మ్యాన్ పవర్** సెక్యూరిటీ గార్డ్స్ / మీ అర్హతలకు తగిన ఎటువంటి జాబ్స్ కావాలన్నా సంప్ర: విన్‌టెల్ జాబ్స్ కన్సల్టెన్సీ, విఆర్‌సి. 9492737681 [N-878319]

■**పర్మినెంట్ జాబ్స్:** 6వేల రూ॥ నుండి 10 వేల రూ॥ జీతం వరకు ఎటువంటి జాబ్స్ అయినా స్త్రీ/పు లేడి ఇన్‌చార్జ్‌లు: లేడి రిసెప్షనిస్టులు, టెలీకాలర్స్: ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్, సూ॥వైజర్స్, కం॥ ఆపరేటర్స్ కావలెను. B.Tech, MBA, MCA, ITI, Diploma వారికి MNC జాబ్స్ కలవు. సంప్ర: గరుడ సర్వీసెస్, నెల్లూరు. సెల్: 88855 91616 [N-878327]

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

ట్రాఫిక్ సౌత్ డీఎస్పీ రామారావు



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న టాఫిక్ డీఎస్పీ రామారావు, నార్త్ సీఐ వెంకటరావు

నెల్లూరు సిటీ : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సౌత్ డీఎస్పీ రామారావు హెచ్చరించారు. బుధవారం నగరంలోని వీఆర్సీ గ్రౌండ్స్‌లోకి ట్రాఫిక్ పోలీసులు 200 ఆటోలను పట్టుకుని తరలించారు. ఆటోడ్రైవర్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఎస్పీ అవగాహన కల్పించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలిగించే సౌండ్ సిస్టమ్‌లు ఏర్పాటు చేయకూడదన్నారు. డ్రైవర్‌కు ఇరువైపులా ప్రయాణికులు కూర్చోకుండా సీట్లు కట్ చేసుకోవాలన్నారు. డ్రైవర్‌కు కుడివైపున ఎవరూ దిగకుండా కమ్ములు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డ్రైవర్లు లైసెన్స్‌లు, వాహనాల పత్రాలను తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్‌కు వెనుకవైపున బల్లపై ప్రయాణికులు కూర్చోకుండా ట్రాఫిక్ పోలీసులు అక్కడిక్కడే కమ్ములు ఏర్పాటు చేయించారు. నిబంధనలు పాటించని 5 ఆటోలపై కేసులు నమోదు చేశారు. అలాగే 50ఆటోలకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో సౌత్ ట్రాఫిక్ సీఐ వెంకటరావు, ఆర్ఎస్ఐ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

సిటీ బస్సుల పత్రాల పరిశీలన

నగరంలోని సిటీ బస్సులను ట్రాఫిక్ సౌత్ డీఎస్పీ రామారావు బుధవారం రాత్రి పోలీసు గ్రౌండ్స్‌కు తరలించారు. బస్సులకు సంబంధించిన పత్రాలను ఆయన పరిశీలించారు. సిటీ బస్సుల డ్రైవర్లకు ట్రాఫిక్ సూచనలు చేశారు. ఇష్టారాజ్యంగా సిటీ బస్సులను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్సులను బస్‌స్టాప్‌లలో మాత్రమే నిలపాలన్నారు. రోడ్డుకు అడ్డంగా ప్రయాణికులకు ఇబ్బంది కలిగేలా నిలపకూడదన్నారు.

మహిళ మెడలోని గొలుసు చోరీ

నెల్లూరు సిటీ: కిరాణా షాపునకు వెళ్లి వస్తున్న సమయంలో గుర్తుతెలియని దుండగులు బైక్‌పై వచ్చి మహిళ మెడలోని గొలుసు లాక్కెళ్లిన ఘటన నగరంలోని బీవీనగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు..నగరంలోని వనంతోపు సెంటర్‌లో నివాసం ఉంటున్న కొడవలూరు భాగ్యలక్ష్మి బుధవారం ఇంటి సమీపంలోని కిరాణాషాపు వద్ద కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి తిరిగి వెళుతుంది. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు బైక్‌పై వచ్చి మెడలోని గొలుసు లాకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐదో నగర పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షూటింగ్ సందడి



పూజలు చేస్తున్న నటి

పెళ్లకూరు : కలవకూరులో బుధవారం తెలుగు సినిమా చిత్రీకరణ సందడి నెలకొంది. శ్రీశంఖు చక్ర ఫిలిమ్స్ బ్యానర్‌లో నిర్మాత కోటి తూముల నిర్మిస్తున్న చిత్రానికి సంబంధించి చెరువు వద్ద కళాదర్శకుడు వెంకటేష్‌వేసిన సూర్యభగవానుడి సెట్టింగ్‌లో దర్శకుడు ప్రేమ్ ఆర్యన్ క్షుద్రపూజలపై ఫైట్‌సీన్లు చిత్రీకరించారు. ప్రతికథా నాయకుడు దేవ్ గిల్ (మగధీరా ఫేమ్ రణదేవ్‌బిల్లా) నుంచి కథానాయిక వివ్యను కాపాడేందుకు కథానాయకుడు శేఖర్‌వర్మ చేసిన సాహసాలను కెమెరామెన్ చిట్టిబాబు చిత్రీకరించారు. సినిమా షూటింగ్ సమాచారం తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. జబర్దస్త్ ఫేమ్ కమిడియన్లు పాల్గొన్నారు.



ఫైట్ సీన్ చిత్రీకరిస్తున్న కెమెరామెన్

షార్‌లో భద్రత కట్టుదిట్టం

శ్రీహరికోట (సూళ్లూరుపేట) : సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి గురువారం పీఎస్ఎల్‌వీ సీ39 రాకెట్‌ను ప్రయోగించనుండడంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. షార్ భద్రతా సిబ్బంది మామూలు రోజుల కన్నా మరో మూడు గంటల పాటు అదనంగా విధులు నిర్వహిస్తున్నారు. తీరంలోని మెరైన్ పోలీస్‌స్టేషన్లను అప్రమత్తం చేశారు. షార్‌లోని కీలకమైన విభాగాల్లో ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేశారు. షార్‌కు దక్షిణాన ఉన్న పల్‌వేరికాడ్ వైపు, ఉత్తరాన ఉన్న రాయదొరువు వైపున ప్రత్యేక సాయుధ దళాలను ఏర్పాటు చేశారు. బకింగ్‌హాం కెనాల్, అటకానితిప్ప, షార్ పరిసర ప్రాంతాల్లోనూ గస్తీ ముమ్మరం చేశారు. పులికాట్ సరస్సు, బంగాళాఖాతంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని జాలర్లను కోరారు. షార్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించినట్లు సమాచారం. అటకానితిప్ప వద్ద ప్రత్యేక చెక్ పాయింట్ ఏర్పాటు చేసి షార్ కేంద్రానికి వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.



షార్‌రోడ్డులో అటకానితిప్ప వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది

వేనాడుకు వచ్చేవారిపై నిఘా

తడ మండలం వేనాడు దర్గాకు వచ్చేవారిపై నిఘా ఏర్పాటు చేశారు. భక్తుల రూపంలో ఉగ్రవాదులు వచ్చే అవకాశం ఉందన్న ఇంటిలిజెన్స్ వర్గాల హెచ్చరికలతో అటకానితిప్ప వద్ద ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. తీరప్రాంత గ్రామాలైన పేర్నాడు, వేనాడులోనూ తనిఖీలు నిర్వహించారు.

డీసీసీబీ వందేళ్ల ఉత్సవంపై చర్చ

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆవరణలో బుధవారం మహాజన సభ సమావేశం జరిగింది. తొలుత వందేళ్ల ఉత్సవాల నిర్వహణ, సొసైటీల పనితీరుపై చర్చించారు. అనంతరం బ్యాంక్ సీఈఓ సరిత మాట్లాడుతూ 1918లో సహకార చట్టం కింద ప్రారంభించిన బ్యాంక్ 43 మండలాలకు విస్తరించిందని తెలిపారు. 20 బ్యాంక్ శాఖలు, 79 వ్యవసాయ పరపతి సంఘాలు, 164 ఇతర సంఘాలు కలిగి రైతులకు రుణాలు అందిస్తుందన్నారు. పెట్టుబడులు రూ.129 కోట్లు, ఆస్తులు రూ.7కోట్లు, రూ.26.22 కోట్లు అప్పులు కలిగి ఉన్నట్లు తెలిపారు. కొత్తగా శతవర్షి డిపాజిట్ పథకం కింద అత్యధిక వడ్డీ అందిస్తున్నామని, నాబార్డు, ఆప్కాబ్ సహకారంతో సహకార రైతు వికాస పథకం ద్వారా రైతులకు రూ.10లక్షల వరకు రుణాలు అందిస్తున్నామని వివరించారు. రూ.8 ప్రీమియంతో రూ.లక్ష ప్రమాదబీమా కల్పిస్తున్నామని తెలిపారు. వందేళ్ల ఉత్సవాలకు రూ.30లక్షలు వెచ్చిస్తున్నట్లు వివరించారు.

అధికారులపై చైర్మన్ ఆగ్రహం

బ్యాంక్ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటా ఆడిట్ జరిపి బ్యాలెన్స్ షీట్‌ను రూపొందిస్తే బ్యాంకు ఆదాయం, నష్టాలు తెలుస్తాయన్నారు. అలాకాకుండా ఎన్నో ఏళ్ల క్రితం పొందించిన పద్దుతో ఆడిట్‌చేస్తే సరైన సమాచారం రాదని, వెంటనే సంవత్సరానికి పద్దులను తయారుచేసి ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఏపీ కో ఆపరేటివ్ బ్యాంక్‌కు కట్టాల్సిన అప్పు, వడ్డీలలో తేడా కనిపిస్తోందని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.



అధికారులను ప్రశ్నిస్తున్న నిడిగల్లు సొసైటీ అధ్యక్షుడు రంగనాథ్

అధికారులపై ప్రశ్నల వర్షం

నిడిగల్లు సొసైటీ అధ్యక్షుడు రంగనాథ్ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించాడు. బ్యాంకు అధికారులు చెబుతున్న లెక్కలు సరిగా లేవని, అసలు బ్యాంక్ ఆదాయంలో ఉందా.. నష్టాల్లో ఉందా వెల్లడించాలన్నారు. క్రాప్‌లోన్ కింద రైతులకు రూ.2లక్షలు, వ్యక్తిగత రుణాల కింద రూ.10 నుంచి రూ.20లక్షల వరకు అందించాలని కోరారు. అధికారులను ఏ విషయంపైన అయినా ప్రశ్నిస్తే ఆన్‌లైన్‌లో సమాచారం ఇచ్చామని చెబుతున్నారని, కంప్యూటర్ పరిజ్ఞానంలేని తనలాంటి వారికోసం బ్యాంకు కార్యాలయంలో ఓ విభాగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆప్కాబ్ జీఎం విజయభాస్కర్‌రెడ్డి, బ్యాంక్ వైస్‌చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, డీజీఎంలు ఉషారాణి, నాగేంద్రకుమారి, ఏజీఎం దయాకర్‌రెడ్డి, నాబార్డు ఏజీఎం డీ రమేష్‌బాబు, డైరెక్టర్లు సొసైటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఏజెంట్లపై పోలీసుల దాడులు

■ అదుపులో 8 మంది ఏజెంట్లు

నెల్లూరు (టౌన్) : రవాణా శాఖా కార్యాలయం సమీపంలో అనధికారికంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న పలువురు ఏజెంట్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 'సాక్షి'లో 'రవాణాలో టార్చర్' శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనంపై రవాణా అధికారులు స్పందించారు. ఏజెంట్లు నిర్వహిస్తున్న అక్రమ లావాదేవీలపై ఎస్పీ రామకృష్ణ, ఉపరవాణా కమిషనర్ శివరాంప్రసాద్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 5వ నగర పోలీసులు రవాణా కార్యాలయానికి వచ్చారు. కార్యాలయ సమీపంలో గదులు తెరచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న 8 మంది ఏజెంట్లను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

సాక్షి ఎఫెక్ట్..

నగదు అడిగితే ఫిర్యాదు చేయాలి

రవాణా శాఖ కార్యాలయంలో ప్రభుత్వ చలానాకు మించి ఎవరైన అదనంగా నగదు అడిగితే నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని, లేకుంటే తన నంబర్‌కు ఫోన్ చేయాలని ఉప రవాణా కమిషనర్ ఎన్ శివరాంప్రసాద్ సూచించారు. వాహనదారులు ఏజెంట్లను ఆశ్రయించకుండా నేరుగా కార్యాలయానికి రావాలన్నారు. ఏజెంట్లు అనధికార కార్యకలపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎంఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్ ప్రభంజనం

నెల్లూరు (టౌన్) : సీఎంఏ ఫలితాల్లో మాస్టర్ మైండ్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. స్థానిక మాస్టర్‌మైండ్ కళాశాలలో ప్రతిభ కనబరిని విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రవీణ్ 34వ ర్యాంక్, జగన్‌మోహన్ 35వ ర్యాంక్, సాయినాథ్‌రెడ్డి 49వ ర్యాంక్ సాధించినట్లు చెప్పారు.

రైతుల ఆధీనంలోనే భూములను ఉంచండి

■ ఏపీఐఐసీ భూములపై మరో కేసులో హైకోర్టు స్టే



ఏపీఐఐసీ సేకరించిన భూములు

కొడవలూరు : మండలంలోని బొడ్డువారిపాళెం రెవెన్యూ పరిధిలోని చంద్రశేఖరపురంలో ఏపీఐఐసీ సేకరించిన భూములను రైతుల ఆధీనంలోనే ఉంచాలని మరో కేసులో హైకోర్టు బుధవారం స్టే ఇచ్చింది. రైతుల ఆధీనంలోని 197 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములను ఇండస్ట్రీయల్ పార్క్ కోసం ఏపీఐఐసీ సేకరించింది. ఎకరాకు రూ.10లక్షల వంతున రైతులకు పరిహారం చెల్లించింది. అయితే రైతులు తాము జీవనాధారం కోల్పోయినందున పరిహారాన్ని మార్కెట్ విలువ ప్రకారం చెల్లించాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుపై ఈ నెల 18న రైతుల భూములు స్వాధీనం చేసుకోవద్దని హైకోర్టు స్టే ఇవ్వడం తెలిసిందే. కాగా చంద్రశేఖరపురానికి చెందిన చింతా బత్తిన నరసింహారావుతో పాటు మరో 8 మంది రైతులు తమకు 1992లో ప్రభుత్వం ఎకరా వంతున పంపిణీ చేసి పట్టాలు అందజేసిన భూములకు ఎలాంటి పరిహారం చెల్లించలేదని హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుపై బుధవారం విచారణ చేపట్టిన హైకోర్టు ఏపీఐఐసీ వారు రైతుల భూములను స్వాధీనం చేసుకోరాదని, రైతుల ఆధీనంలోనే భూములను ఉంచాలని స్టే ఇచ్చింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తూ ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వం, కలెక్టర్, నెల్లూరు ఆర్డీఓ, కొడవలూరు తహసీల్దార్, ఏపీఐఐసీ చైర్మన్, జోనల్ మేనేజర్లకు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది.

పోలేరమ్మ జాతరకు తొలి చాటింపు

వెంకటగిరి: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర సెప్టెంబరు 13, 14 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు జాతర తొలి చాటింపును బుధవారం అర్ధరాత్రి వేశారు. దేవస్థానం ఈఓ వై రామచంద్రరావు ఆధ్వర్యంలో చాటింపు కార్యక్రమం సంప్రదాయ బద్ధంగా జరిగింది. తొలుత పోలేరమ్మ దేవస్థానం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

జాతర నిర్వహణకు రాజాల అనుమతి

వెంకటగిరి పోలేరమ్మ జాతర నిర్వాహణకు ఈఓ వై రామచంద్రరావు వెంకటగిరి రాజాల అనుమతి కోరారు. రాజా కుటుంబీకుడు సర్వజ్ఞకుమార యాచేంద్ర జాతరలో క్రియాశీలకమైన పనిబాపల్లోళ్లకు తాంబూలాలను అందించి వేడుక నిర్వాహణకు అనుమతి ఇచ్చారు. ఈ సందర్భంగా సర్వజ్ఞకుమారయాచేంద్ర మాట్లాడుతూ అమ్మవారిని తయారుచేసే కుమ్మరులు, రజకులు, వెట్టివారికి ప్రథమ తాంబూలాలు ఇచ్చి జాతర నిర్వహించాలని కోరడం ఆనవాయితీగా వస్తుందన్నారు. జాతరను విజయవంతం చేసేందుకు అధికారులు పక్కా ఏర్పాట్లు చేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకుంటామన్నారు. లాలాపేట సింగిల్ విండో అధ్యక్షుడు గొల్లగుంట వెంకటముని, మాజీ ఆలయ కమిటీ అధ్యక్షుడు పులి కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బీరం రాజేశ్వరరావు, దొంతు బాలకృష్ణ, తాండవ చంద్రారెడ్డి, కోటీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణమ్మకు రూ.10 వేల ఆర్థిక సాయం


వెంకటరమణమ్మకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

నెల్లూరు రూరల్ : చిన్నతనంలోనే గుండెకు రంధ్రం పడటంతో బాధపడుతున్న వెంకటాచలం మండలానికి చెందిన చిన్నారి వెంకటరమణమ్మకు హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్ ధనలక్ష్మీపురంలోని తన సొసైటీ కార్యాలయంలో అల్లూరు మస్తానయ్య జ్ఞాపకార్థం రూ.10 వేల నగదును బాధితురాలికి అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ సభ్యులు పవన్, రామకృష్ణారెడ్డి, అశోక్, వెంకటేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కళాశాల విద్యార్థుల పరిస్థితి అధ్వానం

నెల్లూరు (టౌన్) : హంగు ఆర్భాటాలతో ప్రారంభించిన మున్సిపల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి అధ్వానంగా ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నందకిరణ్, రమణ ఒక ప్రకటనలో విమర్శించారు. కళాశాలను ప్రారంభించి 4 నెలలు కావస్తున్నా.. ఇప్పటికి ప్రభుత్వ గుర్తింపు రాకపోవడం దారుణమన్నారు. మరో నాలుగు రోజుల్లో ఇంటర్ బోర్డు ఎన్‌రోల్‌మెంట్ పూర్తికాబోతున్న నేపథ్యంలో మున్సిపల్ కళాశాల విద్యార్థులకు ఏ కళాశాలలో ఎన్‌రోల్‌మెంట్ చేస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. మున్సిపల్ కళాశాలలో పనిచేస్తున్న ఫ్యాకల్టీ నారాయణ విద్యాసంస్థకు చెందిన ఫ్యాకల్టీ కావడం, పాఠ్యపుస్తకాలు కూడా నారాయణ కళాశాల నుంచి రావడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మున్సిపల్ కళాశాలకు వెంటనే గుర్తింపు ఇచ్చి విద్యార్థులకు న్యాయం చేయాలని తెలిపారు.

బ్లాక్ టికెట్ల విక్రయాలను అరికట్టండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు

నెల్లూరు (వేదాయపాళెం) : సినీనటుడు బాలకృష్ణ నటించిన పైసావసూల్ చిత్రం వచ్చే నెల 1న విడుదలవుతున్న నేపథ్యంలో బ్లాక్ టికెట్లను పూర్తిస్థాయిలో అరికట్టాలని బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు వై.రవి నెల్లూరు తహసీల్దార్ ఎం.నరసింహులుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అభిమానులకు సీరియల నంబర్లతో కూడిన టికెట్లు కేటాయించాలని కోరారు. చిత్రం ప్రదర్శించే థియేటర్ యాజమాన్యం నిబంధనలు పాటించే విధంగా చూడాలన్నారు. పలువురు బాలకృష్ణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న కార్పొరేటర్ లేబూరు పరమేశ్వర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : మండలంలోని నారాయణరెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఎనిమిది మంది ఉపాధ్యాయులను శాలువాలతో బుధవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లేబూరు పరమేశ్వర్‌రెడ్డి, టీడీపీ నేత చిరంజీవి, స్కూల్ హెచ్ఎం అంకయ్య, ఉపాధ్యాయులు వీరాంజనేయరెడ్డి, శ్రీనివాసులు, సుభాషిణి, సురేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

వివక్ష వీడి మంచి పౌరులుగా ఎదగండి



ఎంపవర్ ఇండియాను ప్రారంభిస్తున్న నగర మేయర్ అజీజ్

నెల్లూరు (పొగతోట) : విద్యార్థులు కుల, మత వివక్షను బాల్యదశ నుంచే వీడనాడి మంచి పౌరులుగా ఎదగాలని నగర మేయర్ అబ్దుల్‌అజీజ్ అన్నారు. బుధవారం తన నివాసంలో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఎంపవర్ ఇండియా కార్యక్రమాన్ని మేయర్ ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతు సామాజిక బాధ్యతలపై చిన్నారులకు విద్యార్థి దశ నుంచి అవగాహన కల్పిస్తే వారు ఉజ్వల భారతదేశాన్ని తీర్చిదిద్దుతారన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు మొక్కలు నాటలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత నన్నేసాహెబ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్ణాల చెరువు ఘాటు వెడల్పు పనులు ప్రారంభం

భక్తుల సౌకర్యార్థం స్వర్ణాల చెరువులో ఘాటు వెడల్పు చేసే పనులను మేయర్ అబ్దుల్‌అజీజ్ బుధవారం పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగకు ప్రతి సంవత్సరం భక్తుల సంఖ్య పెరుగుతుందన్నారు. భక్తుల రద్దీని తట్టుకునేందుకు ఘాట్‌లను వెడల్పు చేస్తున్నామన్నారు. రూ.96 లక్షల ఖర్చుతో చెరువులో 60 అడుగలు వెడల్పులో 4 అడుగుల ఎత్తులో నీరు నిలిచేలా కాంక్రీట్ వేయిస్తామన్నారు. ఘాట్ నిర్మాణం చుట్టు రక్షణ గోడ ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. రాత్రి సమయాల్లో దర్గాను సందర్శించే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. చిన్నపిల్లల కోసం చెరువులో రూ.3 కోట్లతో అత్యాధుని వాటర్ గేమ్స్ పార్కును నిర్మించే ఆలోచనలో ఉన్నామని తెలిపారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి


దీపకను శాలువాతో సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

నెల్లూరు (బారకాసు) : ప్రభుత్వ వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తమ అసోసియేషన్ కృషి చేయనుందని హెల్త్ అండ్ మెడిక్ సర్వీసెస్ అసోసియేషన్ (హెచ్ఏఎంఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె.యోగేశ్వరరెడ్డి అన్నారు. ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న వివిధ క్యాడర్ల ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైద్యారోగ్యశాఖలోని మరికొన్ని పథకాల్లో పనిచేస్తున్న వారి వేతనాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆగస్టు 15న కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న జూనియర్ అసిస్టెంట్ దీపికను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శాలువా కప్పి సత్కరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు సుధాకర్, శ్రీకాంత్, ప్రతాప్‌బాబు, లక్ష్మీకుమారి, ఆచార్యులు, చంద్రశేఖర్, సతీష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో కృష్ణచైతన్య టాప్


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నెల్లూరు (టౌన్) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఎమ్మెస్సీ కెమిస్ట్రీ రెండో సెమిస్టర్ ఫలితాల్లో కృష్ణచైతన్య విద్యార్థులు యూనివర్సిటీ టాపర్‌గా నిలిచారని కళాశాల డైరెక్టర్లు చంద్రశేఖరరెడ్డి, కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక కృష్ణచైతన్య పీజీ కళాశాలలో బుధవారం రెండో సెమిస్టర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వి.రాజేశ్వరి 665 మార్కులు, తేజశ్విని, సాయిపల్లవి 556 మార్కులతో యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని చెప్పారు. వీరితో పాటు 80 శాతానికి పైగా 10 మంది, 70 శాతంకు పైగా 19 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ 4వ సెమిస్టర్‌లో 85 శాతం మార్కులతో ఎండీ నజీమా వర్సిటీ టాపర్‌గా నిలిచారన్నారు. కెమిస్ట్రీకి సంబంధించి అకడమిక్ షెడ్యూల్, సెమినార్స్, వారాంతపు పరీక్షలతో ఇంతటి విజయం సాధించడానికి తోడ్పడ్డాయన్నారు. ప్రాంగణ ఎంపికలు నిర్వహించి కోర్సు పూర్తిచేసిన వెంటనే కెమిస్ట్రీ విద్యార్థులు ఉద్యోగం పొందే విధంగా ఏర్పాటు చేసిందన్నారు. కళాశాల డీన్ శ్రీకర్‌రెడ్డి, ప్రిన్సిపల్స్ మల్లికార్జునయ్య, జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కర్ణాటక నదీ జలాలను అడ్డుకోవడం తగదు


అధికారులకు వినతిపత్రం ఇస్తున్న మిడతల రమేష్

నెల్లూరు రూరల్ : కర్ణాటక రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసినప్పటికి కృష్ణా, పెన్నానది జలాలను ఆంధ్ర రాష్ట్రానికి విడుదల చేయకుండా అక్రమంగా నిర్బందించి పెన్నా ఉపనదులపై ఏడు అక్రమ ప్రాజెక్టలను నిర్మిస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిడతల రమేష్ విమర్శించారు. నదీ జలాలను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక దర్గామిట్టలోని సోమశిల ప్రాజెక్ట్ ఉప పర్యవేక్షక ఇంజినీర్ మురళీకృష్ణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాలకు నీరు విడుదల చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఓజిలి సుధాకర్, బూడిద శేఖర్, బాబులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి హోమం

నెల్లూరు (దర్గామిట్ట) : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని ఆచారివీధిలోని ప్రధాన తపాలా కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహంవద్ద బుధవారం గణపతి హోమాన్ని నిర్వహించారు. ప్రధాన అర్చకులు సాయికుమార్ శర్మ ఆధ్వర్యంలో హోమం కార్యక్రమాన్ని జరిపారు. కార్యక్రమంలో ఉభయకర్తలు ప్రసాద్, హేమ, పెద్ద పోస్టాఫీస్ మిత్రమండలి కార్యకర్తలు శ్యాంప్రసాద్ రెడ్డి, మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం


వరికుంటపాడు మండలం తూర్పు రొంపిదొడ్లలో నూతన సబ్‌స్టేషన్‌కు చార్జింగ్ చేస్తున్న దృశ్యం

నెల్లూరు (వీఆర్సీ సెంటర్) : జిల్లాలోని వరికుంటపాడు మండలం తూర్పురొంపిదొడ్లలో బుధవారం నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ కె.విజయకుమార్‌రెడ్డి ప్రారంభించారు. రూ.1.50 కోట్లతో నిర్మించిన 5 ఎంవీఏ సబ్‌స్టేషన్‌ను టెక్నికల్ చార్జింగ్ చేశారు. ఆయన మాట్లాడుతూ వరికుంటపాడు ప్రజలకు విద్యుత్‌లో ఓల్టేజీ సమస్య తీరుతుందన్నారు. జిల్లాలో ఓల్టేజీ సమస్యలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈలు వెంకటేశ్వరరావు, ఎస్కే ఇస్మాయిల్, శ్రీనివాసులు, ఏడీలు సురేంద్రబాబు, శ్రీనివాసులురెడ్డి, సునిల్, ఏఈలు ప్రభాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గృహాలపై ప్రజలకు నమ్మకం కలిగించాలి

నెల్లూరు (బారకాసు) : కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్మిస్తున్న గృహాలపై ప్రజలకు అపోహాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేసి వారికి నమ్మకం కలిగించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని బీజేపీ సీనియర్ నేత కరణం భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో ప్రభుత్వం నిర్మించిన గృహాలు నాసిరకంగా ఉన్నాయనే విమర్శలు ఉన్నాయన్నారు. నూతనంగా నిర్మించనున్న గృహాలను మోడల్‌గా ఒకటి రెండు నిర్మించి వాటిని ప్రజలకు చూపించాలన్నారు. వేలాది మంది నిరుపేదలు గృహాల కోసం దరఖాస్తు చేసుకుంటే వారిలో అతి తక్కువ మంది మాత్రమే డీడీలు కట్టేందుకు ముందుకు రావడం బట్టి చూస్తే అర్థమవుతుందన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వహణ మెరుగునకు చర్యలు

నెల్లూరు (వేదాయపాళెం) : నెల్లూరురూరల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణ మెరుగుకు చర్యలు చేపడుతున్నట్లు ఎంఈఓ జగదీశ్వర్ అన్నారు. నగరంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వహణకు సంబంధించి ఇప్పటి వరకు కట్టెల పొయ్యలపై వంట చేసే వారని, ఇక మీదట అన్ని పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లు ఇస్తామన్నారు. మెనూలో విద్యార్థులకు వారానికి మూడు కోడి గుడ్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. విద్యాబోధన మెరుగుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించేలా చూడాలన్నారు.

'మార్తాండ సూర్యాలయం' నిర్మాత ఎవరు?



ఎం. వెంకటరమణరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల.



జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ
ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. 'కవిరాజ మార్గం'ను అమోఘవర్షుడు ఏ భాషలో రాశాడు?
1) బెంగాలీ 2) సంస్కృతం
3) కన్నడం 4) మరాఠి

2. 'దిల్వారా జైనాలయం' ఎక్కడ ఉంది?
1) రాజస్థాన్ 2) గుజరాత్
3) బెంగాల్ 4) కర్ణాటక

3. కాలచూరుల (హైహయులు) రాజధాని?
1) కనోజ్ 2) త్రిపురి
3) మౌంట్ అబూ 4) ఢిల్లీ

4. గహద్వాల చంద్రదేవుడు విధించిన ప్రత్యేక పన్ను ఏది?
1) పురిటి సుంకం 2) గణాచారి సుంకం
3) పొయ్యి సుంకం
4) తురుష్క దండన సుంకం

5. కింది వాటిలో చాంద్‌బర్దాయ్ హిందీలో రాసిన గ్రంథం?
1) పృథ్వీరాజ్ రాశో 2) రాజస్థాన్ కథావళి
3) నైషధ చరిత్ర 4) శిశుపాల వధ

6. మధ్యప్రదేశ్‌లోని ఖజురహో దేవాలయాన్ని ఎవరు నిర్మించారు?
1) సోలంకీలు 2) చౌహాన్‌లు
3) చందేలులు 4) గహద్వాలులు

7. కింది వాటిలో సరైన జత ఏది?
1) విక్రమశిల విశ్వవిద్యాలయం – ధర్మపాలుడు
2) సోమనాథ దేవాలయం – ప్రభాస్ పఠాన్
3) మిహిర భోజుడు – ప్రతీహార వంశం
4) పైవన్నీ సరైనవే

8. మిహిరభోజుని ఆస్థానాన్ని సందర్శించిన అరబ్బు యాత్రికుడు ఎవరు?
1) సులేమాన్ 2) అబ్దుల్ రజాక్
3) ఫిరదౌసి 4) లేన్‌పూల్

9. జతపరచండి.

రాజవంశం	రాజధాని
i) చౌహాన్‌లు	a) అన్హిల్‌వాడ్
ii) పరమారులు	b) ఖజురహో
iii) సోలంకీలు	c) గౌర్
iv) చందేలులు	d) ధారానగరం
v) సేన	e) అజ్మీర్

1) i-a, ii-b, iii-c, iv-d, v-e
2) i-e, ii-d, iii-a, iv-b, v-c
3) i-a, ii-d, iii-c, iv-b, v-e
4) i-e, ii-d, iii-a, iv-b, v-c

10. పృథ్వీరాజ్ చౌహాన్ వివాహమాడిన గహద్వాల జయచంద్రుడి కుమార్తె ఎవరు?
1) శీలమహాదేవి 2) సంయుక్త
3) మాచల్దేవి 4) పద్మిని

11. మొదటి తరైన్ యుద్ధం ఏ సంవత్సరంలో జరిగింది?
1) క్రీ.శ. 1191 2) క్రీ.శ. 1192
3) క్రీ.శ. 1193 4) క్రీ.శ. 1194

12. కింది వాటిలో సరికాని జత ఏది?
1) కల్నల్ టాడ్ – రాజస్థాన్ కథావళి
2) షానామా – ఫిరదౌసి
3) జగన్నాథాలయం – భువనేశ్వర్
4) హిందూ జాతీయ వీరుడు – పృథ్వీరాజ్ చౌహాన్

13. చందేవార్ యుద్ధ విజేత ఎవరు?
1) గజనీ మహమ్మద్
2) మహమ్మద్ ఘోరీ
3) పృథ్వీరాజ్ చౌహాన్ 4) జయచంద్రుడు

14. 'ముంజేశ్వర' చెరువు ఎక్కడ నిర్మించారు?
1) ధారానగరం 2) ఢిల్లీ
3) అజ్మీర్ 4) జోధ్‌పూర్

15. తమ శీల సంరక్షణకు రాజపుత్ర స్త్రీలు ఆత్మహత్య చేసుకోవడాన్ని ఏమంటారు?
1) జనానా 2) జిజియా
3) జౌహార్ 4) సల్లేఖన

16. 'సమరాంగణ సూత్రధార' గ్రంథాన్ని పరమార భోజుడు ఏ అంశాలపై రాశాడు?
1) వాస్తు అంశాలు 2) రాజనీతి అంశాలు
3) యోగా అంశాలు
4) అలంకారశాస్త్ర అంశాలు

17. 'పంచరత్నాలు' అనే కవులను పోషించిన వారెవరు?
1) మొదటి భీమరాజు 2) లక్ష్మణసేనుడు
3) విజయసేనుడు 4) జయసింహుడు

18. కింది వాటిలో గాంగయ నరసింహదేవుడు నిర్మించిన నిర్మాణం ఏది?
1) సూర్యాలయం (మొంఢేరా)
2) సూర్యాలయం (అల్మోరా)
3) సూర్యాలయం (కోణార్క్)
4) కైలాసనాథాలయం (ఎల్లోరా)

19. టిబెట్‌లో అతిశదీపాంకరుడు ప్రచారం చేసిన బౌద్ధమత శాఖ ఏది?
1) మహాయానం 2) హీనయానం
3) తాంత్రికయానం 4) వజ్రయానం

20. 'జ్ఞానమే మోక్షానికి మార్గం' అని ప్రబోధించిందెవరు?
1) ఆదిశంకరాచార్యులు
2) రామానుజాచార్యులు
3) మధ్వాచార్యులు 4) వల్లభాచార్యులు

21. 'ప్రతీహారులు' అంటే..?
1) శిల్పులు 2) వ్యాపారులు
3) నావికులు 4) ద్వార పాలకులు

22. త్రైపాక్షిక పోరాటం రాష్ట్రకూట, పాల, ప్రతిహార రాజ్యాల మధ్య ఏ భూభాగం కోసం జరిగింది?
1) రాయచూర్ 2) కనోజ్
3) ఢిల్లీ 4) నవద్వీపం

23. కింది వాటిలో సరికాని జత ఏది?
1) కందరీయ మహాదేవాలయం – ఖజురహో
2) గిరిజాదేవి శక్తి పీఠం – కటక్
3) ఉడిపి – కర్ణాటక
4) విఠలాలయం – హంపీ

24. 'రాజతరంగిణి' గ్రంథం ఎవరికి సంబంధించింది?
1) కశ్మీర్ రాజులు 2) సేన రాజులు
3) సోలంకీలు 4) పరమారులు

25. 'భారత చరిత్ర పితామహుడు' ఎవరు?
1) చాంద్‌బర్దాయ్ 2) జె.ఎన్. సర్కార్
3) కల్హణుడు
4) మామిడిపూడి వెంకటరంగయ్య

26. పృథ్వీరాజ్ చౌహాన్ (మూడో పృథ్వీరాజ్) రాణి సంయుక్తను ఏ విధమైన వివాహం చేసుకున్నాడు?
1) స్వయంవర వివాహం
2) రాక్షస వివాహం 3) బ్రహ్మ వివాహం
4) ప్రజాపత్య వివాహం

27. మహమ్మద్ బిన్ ఖాసిం సైన్యాలను ఎదుర్కొన్న దాహిర్ రాజు భార్య పేరు?
1) రాణీబాయి 2) పరిమళదేవి
3) సూరజ్‌దేవి 4) రాణి పద్మిని

28. అరబ్బులు హిందువులు, బౌద్ధులు ఇతర పాలితులను ఏమని వ్యవహరించారు?
1) జిమ్మీలు 2) తైవైఫ్‌లు
3) కాఫిర్‌లు 4) మ్లేచ్ఛులు

29. గజనీ మహమ్మద్ ధ్వంసం చేసిన శ్రీ చక్రస్వామి ఆలయం ఎక్కడ ఉంది?
1) కనోజ్ 2) మధుర
3) ముల్తాన్ 4) స్థానేశ్వరం

30. సోమనాథ్ దేవాలయాన్ని గజనీ మహమ్మద్ ఎప్పుడు ధ్వంసం చేసాడు?
1) క్రీ.శ. 1020 2) క్రీ.శ. 1022
3) క్రీ.శ. 1023 4) క్రీ.శ. 1025

31. కింది వాటిలో సరైంది ఏది?
1) కితాబ్–ఉల్–యామ్ని గ్రంథం – ఉత్బి
2) కితాబ్–ఉల్–హింద్ గ్రంథం – అల్‌బెరూనీ
3) బహ్మన్‌నామా గ్రంథం – అజారీ
4) పైవన్నీ సరైనవే

32. గజనీ మహమ్మద్ దండయాత్రను తొలిసారి ఎదుర్కొన్న హిందూషాహీ రాజు ఎవరు?
1) జయపాలుడు 2) ఆనందపాలుడు
3) త్రిలోచనపాలుడు 4) భీమపాలుడు

33. ఖజురహోలోని దేవాలయాలను ఏ శైలిలో నిర్మించారు?
1) ఇండో–గ్రీక్ 2) ఇండో–ఆర్యన్
3) ద్రావిడ 4) గోథిక్

34. జతపరచండి.

i) జయనకుడు	a) కుమారపాల చరిత్ర
ii) రాజశేఖరుడు	b) మాలతీ మాధవం
iii) హేమచంద్రుడు	c) ప్రబోధ చంద్రోదయం
iv) భవభూతి	d) పృథ్వీరాజ విజయం
v) ఆనందవర్ధనుడు	e) కర్పూర మంజరి

1) i-e, ii-a, iii-d, iv-c, v-b
2) i-c, ii-e, iii-b, iv-a, v-d
3) i-d, ii-e, iii-a, iv-b ,v-c
4) i-b, ii-c, iii-a, iv-e, v-d

35. కశ్మీర్‌లోని 'మార్తాండ సూర్యాలయం' నిర్మాత ఎవరు?
1) హరిసింగ్
2) లలితాదిత్య ముక్తాపీడుడు
3) బాలాదిత్య 4) జయపాలుడు

36. 'శిలా నిర్మిత సుందరనగరం' అని దేన్ని పిలిచేవారు?
1) ఉదయ్‌పూర్ 2) భగత్‌పూర్
3) జైపూర్ 4) జోధ్‌పూర్

37. 'ఖండన ఖండఖాద్యం' గ్రంథకర్త ఎవరు?
1) శ్రీహర్షుడు 2) దండి
3) పద్మగుప్తుడు 4) కల్హణుడు

38. ప్రతీహారులు తాము ఎవరి సంతతికి చెందిన వాళ్లమని చెప్పుకొన్నారు?
1) ఇంద్రుడు 2) లక్ష్మణుడు
3) వరుణుడు 4) బ్రహ్మ

39. విద్యాధరుడు అనే రాజు ఏ వంశానికి చెందినవాడు?
1) ఛందేల 2) సోలంకీ
3) పాల 4) పరమార

40. 'అరబ్బుల సింధూపై దండయాత్ర ఫలితం లేని విజయం' అని అన్నదెవరు?
1) జె.ఎన్. సర్కార్
2) రాధాకుముద్ ముఖర్జీ
3) లేన్‌పూల్ 4) వి.ఎ. స్మిత్

41. హర్షుడి పాలనాకాలం ఏది?
1) క్రీ.శ. 606 - 647
2) క్రీ.శ. 606 - 656
3) క్రీ.శ. 606 - 666
4) క్రీ.శ. 600 - 647

42. 'సూర్య శతకం' రాసిందెవరు?
1) బాణుడు 2) మతంగ దివాకరుడు
3) భర్తృహరి 4) మయూరుడు

43. కింది వాటిలో సరికాని జత?
1) యాత్రికుల్లో యువరాజు – హుయాన్‌త్సాంగ్
2) మహామోక్ష పరిషత్ – స్థానేశ్వరం
3) నలంద విశ్వవిద్యాలయం – రాజ్‌గిర్
4) కాదంబరి గ్రంథం – బాణుడు

44. హర్షుడి తొలి రాజధాని ఏది?
1) కనోజ్ 2) ఉజ్జయిని
3) శ్రీనగర్ 4) స్థానేశ్వరం

45. కింది వాటిలో హుయాన్‌త్సాంగ్ రచన ఏది?
1) నేచురల్ హిస్టరీ 2) ది ట్రావెల్స్
3) సి–యూ–కి 4) ఫో–కో–కి

46. 'సకలోత్తరాపథేశ్వరుడు' అనేది ఎవరి బిరుదు?
1) భాస్కర వర్మ 2) రెండో పులకేశి
3) రెండో ధ్రువసేనుడు 4) హర్షుడు

47. హర్షుడి వంశం ఏది?
1) పుష్యభూతి 2) పశ్చిమ చాళుక్య
3) ప్రతీహార 4) గహద్వాల

48. కింది వాటిలో హర్షుడి రచన కానిది ఏది?
1) నాగానందం 2) చండీ శతకం
3) రత్నావళి 4) ప్రియదర్శిక

49. రెండో పులకేశి, హర్షుడి రాజ్యాల సరిహద్దుగా ఉన్న నది ఏది?
1) యమున 2) గోమతి
3) నర్మద 4) కావేరి

50. 'రాజశ్రీ' ఎవరు?
1) హర్షుడి తల్లి 2) హర్షుడి కుమార్తె
3) హర్షుడి సోదరి 4) హర్షుడి పినతల్లి

51. కింది వాటిలో సరైన జత ఏది?
1) మహామోక్ష పరిషత్ – ఐదేళ్లకోసారి
2) ప్రభాకర వర్ధనుడు – హూణ హరిణ కేసరి
3) గృహవర్మ – మౌఖరి వంశం
4) పైవన్నీ సరైనవే

52. జతపరచండి.

పదజాలం	అర్థం
i) రాజస్థానీయ	a) కోశాధికారి
ii) మహాబలాధీకృత	b) అమ్మకం పన్ను
iii) భాండాగారాధీకృత	c) పన్ను వసూలు చేసే అధికారి
iv) తుల్యమేయ	d) సేనాపతి
v) ధ్రువాధికరణ	e) విదేశీ వ్యవహారాలు

1) i-e, ii-d, iii-c, iv-b, v-a
2) i-e, ii-b, iii-c, iv-d, v-a
3) i-c, ii-d, iii-a, iv-b, v-e
4) i-e, ii-d, iii-a, iv-b, v-c

53. సి–యూకి గ్రంథం ప్రకారం, క్రీ.శ. 7వ శతాబ్దంలో భారతీయులు ఏం తినరని పేర్కొన్నారు?
1) ఉల్లి, వెల్లుల్లి
2) మిరపకాయ, కందిపప్పు
3) అల్లం, మెంతులు
4) పెసరపప్పు, మినప పప్పు

54. కనోజ్‌లో జరిగిన సర్వమత మహాసభ అధ్యక్షుడెవరు?
1) భాస్కర వర్మ 2) హుయాన్‌త్సాంగ్
3) తాయిసుంగ్ 4) గౌడశశాంకుడు

55. 'దానధర్మ క్షేత్రం' అని ఏ ప్రాంతాన్ని పిలుస్తారు?
1) కనోజ్ 2) అజ్మీర్
3) ప్రయాగ 4) శ్రీనగర్

56. హర్షుడి తండ్రి ఎవరు?
1) ఆదిత్య వర్ధనుడు 2) రాజ్య వర్ధనుడు
3) ప్రభాకర వర్ధనుడు
4) భాస్కర వర్మ

57. కింది వాటిలో సరైన జత ఏది?
1) యశోమతీదేవి – హర్షుడి తల్లి
2) కామరూప – అస్సాం
3) సోమోద్భవ – నర్మదా నది
4) పైవన్నీ సరైనవే

సమాధానాలు

1) 3	2) 1	3) 2	4) 4	5) 1
6) 3	7) 4	8) 1	9) 2	10) 2
11) 1	12) 3	13) 2	14) 1	15) 3
16) 1	17) 2	18) 3	19) 4	20) 2
21) 4	22) 2	23) 2	24) 1	25) 3
26) 2	27) 1	28) 1	29) 4	30) 4
31) 4	32) 1	33) 2	34) 3	35) 2
36) 4	37) 1	38) 2	39) 1	40) 3
41) 1	42) 4	43) 2	44) 4	45) 3
46) 4	47) 1	48) 2	49) 3	50) 3
51) 4	52) 4	53) 1	54) 2	55) 3
56) 3	57) 4			

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు | [illegible]ారం | ఆగస్టు | 31 | 2017 సాక్షి

టెన్త్ బయాలజీ సీసీఈ విధానంలో..



పి. నీలకంఠయ్య
జెడ్‌పీహెచ్‌ఎస్,
కమ్మకండ్రిగ,
చిత్తూరు జిల్లా.



పిల్లల సంపూర్ణ వికాసానికి విద్య తోడ్పడాలనే లక్ష్యంతో రాష్ట్రంలో నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ)ని అమలు చేస్తున్నారు. విద్య ద్వారా పిల్లల్లో మానసిక పరిపక్వతతోపాటు స్నేహం, సహకారం, సహనశీలత, ఓర్పు వంటి వైఖరులు అలవడాలి. వారిలో తార్కిక వివేచన, సృజనాత్మక ఆలోచనలు పెంపొందాలి. సమస్యలకు కుంగిపోకుండా ఎదురునిలిచి వాటిని పరిష్కరించే నేర్పు రావాలి. వీటన్నింటి కోసం సీసీఈని ప్రవేశపెట్టారు. ఈ విధానంలో కేవలం పిల్లలకు పరీక్షలు పెట్టడం మాత్రమే కాకుండా వారి జ్ఞానాత్మక, మానసిక చలనాత్మక, భావావేశ నైపుణ్యాలను పెంపొందించడం ఉంటుంది. ఈ మూల్యాంకనం రెండు రకాలు. అవి..

1) నిర్మాణాత్మక మూల్యాంకనం - ఫార్మేటివ్ అసెస్‌మెంట్
2) సంగ్రహణాత్మక మూల్యాంకనం - సమ్మేటివ్ అసెస్‌మెంట్

నిర్మాణాత్మక మూల్యాంకనం: ఇది అంతర్గత మూల్యాంకనం. విద్యార్థి సామర్థ్యాలను, సాధన స్థితిగతులను అంచనా వేసేందుకు, అభ్యసనాన్ని మెరుగుపర్చడానికి ఈ మూల్యాంకనం సహాయపడుతుంది. తరగతి గదిలో జరిగే చర్చలు, పిల్లల ప్రతిస్పందనలు, పిల్లలు రాసిన నోటు పుస్తకాలు, తరగతి పని, ఇంటిపని, ప్రాజెక్ట్ పనులు, ప్రయోగశాల కృత్యాలు వంటి అంశాల ఆధారంగా ఈ అధ్యయనాన్ని నిర్వహిస్తారు. ఇందులో నాలుగు రకాల సాధనాలను ఉపయోగిస్తారు.

జీవ, భౌతిక, రసాయన శాస్త్రాలు

1) రాత అంశాలు – 10 మార్కులు
2) ప్రాజెక్ట్ పనులు–10 మార్కులు
3) ప్రయోగశాల పనులు – 10 మార్కులు
4) లఘు పరీక్ష–20 మార్కులు. పై సాధనాల ద్వారా సాధించిన గ్రేడ్‌లను నమోదు చేయాలి.

జీవశాస్త్రంలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్ నిర్వహణ:

విద్యార్థులు రెండు లాంగ్‌సైజ్ నోట్‌బుక్‌లు తీసుకోవాలి. ఒకదానిలో తరగతి గది రాత పని, మరొకదానిలో ప్రాజెక్ట్ పని, ప్రయోగశాల నివేదిక, లఘు పరీక్షను రాయాలి.

1. రాత పనులు - నోటు పుస్తకాలు: పిల్లలు తాము అవగాహన చేసుకున్న అంశాన్ని సొంత మాటలతో వ్యక్తీకరించడానికి, భావాన్ని లిఖిత రూపంలో తెలియజేయడానికి లేఖనా నైపుణ్యం అవసరమని మనకు తెలుసు. ఇందు కోసం నోటు పుస్తకాలు ఉపయోగపడతాయి. వీటిలో పిల్లలు ప్రశ్నలకు జవాబులను సొంత మాటల్లో రాయాలి. దీనివల్ల పిల్లల్లో భావనల పట్ల స్పష్టత వస్తుంది. రాత పనికి పది మార్కులుంటాయి. ఉపాధ్యాయుడు కింది అంశాల ఆధారంగా మార్కులు కేటాయించాలి.

1) సొంతంగా రాసినదై ఉండటం
2) బొమ్మలు గీసి ఉండటం
3) భాషాదోషాలు లేకుండా ఉండటం.

2. ప్రాజెక్ట్ పని: పాఠ్య పుస్తకంలో ప్రతి పాఠం మధ్యలో కొన్ని ప్రాజెక్టులు ఇచ్చారు. వీటితోపాటు స్థానిక వనరులు, అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయుడు సొంతంగా కొన్ని ప్రాజెక్ట్‌లు తీసుకోవచ్చు.

ప్రతి ఫార్మేటివ్ కాలంలో ఒక ప్రాజెక్ట్‌ను తప్పనిసరిగా చేయాలి. పాఠంలో ఇచ్చిన కృత్యాలు ప్రాజెక్ట్‌లు కావు. ప్రాజెక్ట్‌లో ఒక సమస్య పరిష్కారం కోసం వేర్వేరు సాధనలు ఉపయోగించి సమాచారాన్ని సేకరించి విశ్లేషించాలి. చివరకు నిర్ధారణకు రావాలి. ప్రాజెక్ట్‌ని వ్యక్తిగత, జట్టు ప్రాజెక్ట్ పనిగా ఇవ్వాలి. ఇంటర్వ్యూ చేయడం, సమాచార సేకరణ, పరిశోధన గ్రంథాలు, రిఫరెన్స్ పుస్తకాలు చదవడం ద్వారా ప్రయోగాలు చేయడం, వస్తువును, నమూనాను తయారు చేయడం కూడా ప్రాజెక్ట్‌లో భాగమే. ప్రాజెక్ట్‌లో రెండు ప్రధానాంశాలుంటాయి. అవి...

1) ప్రాజెక్ట్‌కు సిద్ధం కావడం, నిర్వహించడం.
2) ప్రాజెక్ట్ నివేదిక రాయడం.

కింది అంశాలు ప్రాజెక్ట్ నివేదికలో ఉండాలి.

1) ప్రాజెక్ట్ పేరు/సమస్య/ప్రశ్న
2) లక్ష్యాలు
3) ఎంచుకునే సాధనాలు/అధ్యయనం చేయడం
4) అధ్యయన పద్ధతి
5) విషయ విశ్లేషణ – పట్టికలు
6) ముగింపు 7) ఉపయోగించిన వనరులు
8) కృతజ్ఞతలు

విద్యార్థులు ఉపయోగించిన సాధనాలు, ప్రాజెక్ట్ నిర్వహణ తీరును బట్టి మార్కులు కేటాయిస్తారు. జట్టుగా ప్రాజెక్ట్‌ను నిర్వహించినా వ్యక్తిగతంగా ప్రతి విద్యార్థి మొత్తం నివేదికను ఫార్మేటివ్ నోట్స్‌లో రాయాలి.

3. విద్యార్థి ప్రతిస్పందనలు, ప్రయోగశాల పనులు/రికార్డ్ నిర్వహణ

విజ్ఞాన శాస్త్రాన్ని నేర్చుకోవడంలో ప్రయోగాల నిర్వహణ ముఖ్యమైంది. విద్యార్థులు ప్రయోగశాలలో చేసిన ప్రయోగ విధానాన్ని, సాధించిన ప్రక్రియ నైపుణ్యాలను మదింపు చేయాలి. ఇందుకోసం పరికరాల అమరికలో వారు ప్రదర్శించే నైపుణ్యం, పరిశీలనల నమోదు, ఫలితాల విశ్లేషణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అదే విధంగా ప్రయోగాలు చేసిన తర్వాత నివేదిక రూపంలో దాన్ని ఫార్మాట్ మూల్యాంకనం నోట్స్‌లో రాయాలి.

ల్యాబ్ రికార్డ్‌లో ఉండాల్సిన అంశాలు..

ఉద్దేశం, కావాల్సిన పరికరాలు, ప్రయోగ విధానం, పరిశీలనలు/ నమోదు, ఫలితాల విశ్లేషణ, సాధారణీకరణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రయోగం చేసిన పద్ధతికి 4 మార్కులు, ప్రయోగశాల రికార్డుకు 6 మార్కులు మొత్తంగా పది మార్కులు కేటాయిస్తారు.

4. లఘు పరీక్ష (స్లిప్ టెస్ట్): పాఠాన్ని బోధించిన తర్వాత విషయావగాహన ఏ మేరకు జరిగిందో ఎప్పటికప్పుడు అంచనా వేసుకోవడం కోసం పరీక్షను నిర్వహించాలి. నిర్దేశించిన సమయంలో కాకుండా పరీక్ష అనే భావన కలగకుండా ఏ సమయంలోనైనా పరీక్షను నిర్వహిస్తారు. ఇది సాధారణ యూనిట్ పరీక్ష వంటిది కాదు. ఇది 20 మార్కులకు జరుగుతుంది. దీన్ని కూడా ఫార్మేటివ్ నోట్స్‌లోనే రాయాలి. విద్యా సంవత్సరంలో నాలుగుసార్లు ఈ పరీక్ష నిర్వహిస్తారు.

సంగ్రహణాత్మక మూల్యాంకనం: బోధనాభ్యసన ప్రక్రియల ద్వారా విద్యార్థి నేర్చుకున్న అంశాలను మొత్తంగా మూల్యాంకనం చేయడమే సంగ్రహణాత్మక మూల్యాంకనం. ఏడాదిలో మూడుసార్లు అంటే SA-I, SA-II, SA-III (పబ్లిక్) పరీక్షలు నిర్వహిస్తారు. నిర్దేశిత విద్యా ప్రమాణాల ఆధారంగా వెయిటేజ్‌ను నిర్ణయించి పరీక్షను నిర్వహిస్తారు.

పై ప్రమాణాల ఆధారంగా దీర్ఘ సమాధాన ప్రశ్నలు, లఘు రూప, స్వల్ప సమాధాన, బహుళైచ్ఛిక రూపంలో ప్రశ్నలు వస్తాయి. భాషేతర అంశాలైన గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘిక శాస్త్రంలో ప్రశ్నల స్వరూపం, సంఖ్య ఇదే విధంగా ఉంటుంది. కేవలం 4 మార్కుల ప్రశ్నలకు అంతర్గత చాయిస్ ఉంటుంది. మిగిలిన ప్రశ్నలన్నింటినీ విద్యార్థి తప్పకుండా రాయాలి. చాయిస్ ఉండదు.

సైన్స్‌లో విద్యా ప్రమాణాల వారీగా వెయిటేజ్

విద్యా ప్రమాణాలు	వెయిటేజీ	మార్కులు
విషయావగాహన	40%	16
ప్రశ్నించడం, పరికల్పనలు చేయడం	10%	4
ప్రయోగాలు, క్షేత్ర పరిశీలనలు	15%	6
సమాచార నైపుణ్యాలు	15%	6
బొమ్మలు గీయడం ద్వారా భావ ప్రసారం	10%	4
నిజ జీవిత వినియోగం, ప్రశంస	10%	4

ప్రశ్న రకం	ప్ర. సం.	మార్కులు	మొత్తం
స్వల్ప సమాధానం	4	4	4×4=16
లఘురూపం	5	2	5×2=10
దీర్ఘ సమాధాన ప్రశ్నలు	4	1	4×1=4
బహుళైచ్ఛికం	20	1/2	20×1/2=10

The validity of the GST registration?



K.V. Gnana Kumar
Director,
DBS, Hyderabad



Model Questions

1. The Banking Ombudsman may reject a complaint at any stage if it appears to him that a complaint made to him ____:
   a) If the Compensation sought from the Banking Ombudsman is beyond Rs. 20 lakh
   b) If it requires consideration of elaborate documentary and oral evidence
   c) If the proceedings before the Banking Ombudsman are not appropriate for adjudication of such complaint
   d) If the complaint is without any sufficient cause
   e) All the above
2. Who among the following set up the Credit Guarantee Fund Trust for Micro and Small Enterprises (CGTMSE)?
   a) GOI
   b) Ministry of MSME
   c) SIDBI d) a & c
   e) Reserve Bank of India
3. Who among the following can issue Commercial Paper(CP)?
   a) Corporates
   b) Primary Dealers
   c) All India Financial Institutions
   d) a, b, & c e) a & b only
4. As per the latest audited balance sheet, If the tangible net worth of the company is not less than ______ crore, then the corporate would be eligible to issue CP.
   a) 4 b) 3 c) 2
   d) 5 e) None of these
5. Compensation amount not exceeding Rs. _____ lakh to the complainant for mental agony and harassment may be awarded by Banking Ombudsman.
   a) 1 b) 2 c) 3
   d) 5 e) None of these
6. As per the existing Priority Sector guidelines Which of the following categories are there?
   a) Export Credit b) Agriculture
   c) Social Infrastructure
   d) Renewable Energy
   e) All of these
7. Currency note of Rs. 500 will have ' five bleed lines on left and right in raised print'. Similarly how many bleed lines are there on the left and right in Rs. 2000 currency note?
   a) 3 b) 4 c) 6 d) 7 e) 8
8. Which of the following forms are used for Acknowledgement of registration for GST?
   a) Form GSTR -1
   b) Form GSTR -2
   c) Form GST REG-02
   d) Form GST REG
   e) None of these
9. If the fourth letter in PAN CARD is 'P' then it denotes _____:
   a) Company b) Firm
   c) Person d) Trust
   e) HUF
10. The validity of the GST registration certificate is:
    a) One year b) Two years
    c) Five years
    d) Valid till it is canceled
    e) None of these
11. The Headquarters of TransUnion CIBIL is located in _________ :
    a) Chennai b) Kolkatta
    c) Mumbai d) Bengaluru
    e) None of these
12. Net Owned Funds of a Non-Banking Finance Company should be Rs.______ to get the NBFC license from RBI.
    a) 100 Lakh b) 150 Lakh
    c) 200 Lakh d) 250 Lakh
    e) None of these
13. In NRE account "R" stands for:
    a) Residential b) Recoverable
    c) Resident d) Residual
    e) None of these
14. Bharat Nirman is a four-year business plan embarked by the Government of India for providing rural infrastructure in the areas of:
    a) Irrigation & water supply
    b) Electrification c) Housing
    d) Telecommunication & connectivity
    e) All the above
15. NIXI stands for:
    a) National & International Exchange of India
    b) National Internet Exchange of India
    c) National Inter Exchange Interest
    d) None of the above
    e) National Industrial Exchange of India

KEY

1) e	2) d	3) d	4) a
5) a	6) e	7) d	8) c
9) c	10) d	11) c	12) c
13) c	14) e	15) b	16) c

గుర్తించండి

raft
hike
kiwi
branch
sweater
teacher
lolipop
log



b	p	b	i	h	t	h	b	b
r	g	r	k	w	n	i	w	r
e	l	a	z	m	f	k	j	a
h	o	n	a	v	o	e	o	f
c	g	c	p	b	n	u	p	t
a	v	h	j	g	q	z	t	u
e	c	n	z	t	i	w	i	k
t	r	e	t	a	e	w	s	t
i	l	o	l	i	p	o	p	j

పైన ఇచ్చిన బొమ్మల పేర్లు పజిల్‌లో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి

దారి కనుక్కోండి

తన స్నేహితులతో కలిసి వచ్చిన వంకాయ తప్పిపోయింది. తన స్నేహితుల వెళ్లడానికి దారి చూపిస్తారా?



నాన్నా చెప్పవా?

పెంగ్విన్లు సముద్రంలో ఎలా ఉండగలుగుతాయి?




మన భూగోళం మీద, మంచుతో నిండిన అంటార్కిటికా ప్రాంతంలో నివసించే పెంగ్విన్లు అద్భుతమైన డైవర్లనీ, గజఈతగాళ్ళనీ వర్ణించ వచ్చు. ఇవి సముద్రంలో 500 మీటర్ల లోతు దాకా వెళ్లడమే కాకుండా, పైకి రాకుండా సుమారు 15 నిమిషాల దాకా నీటిలోపల ఉండ గల్గుతాయి. ఇందుకు ఒక ముఖ్య కారణమే ఉంది లెండి.

పెంగ్విన్ల శరీర ఉష్ణోగ్రత సాధారణంగా 38 డిగ్రీల సెల్సియస్ వుంటుంది. అయితే ఇవి సముద్రం లోపలికి దిగాక వాటి ఉష్ణోగ్రత 11 డిగ్రీలకు పడిపోతుంది. దాంతో వాటి శరీరం లోపలి కణజాలాలన్నీ తమ తమ జీవన చర్యల వేగాన్ని తగ్గిస్తాయి. అంటే వాటికి అవసరమైన ఆమ్లజని వేగాన్ని తగ్గిస్తాయి. అంటే వాటికి ఆవసరమైన ఆక్సిజన్ కూడా గణనీయంగా తగ్గిపోతుందన్నమాట. ఈ కారణంగా అవి అంతకు ముందు పీల్చుకున్న గాలిలోని ఆక్సిజన్ సాయంతో సుమారు 15 నిమిషాల దాకా నీటి లోపల ఉండగల్గుతాయి.


ఒకవేళ సముద్రం లోపలికి వెళ్ళాక వాటి శరీర ఉష్ణోగ్రత పడిపోయి తద్వారా జీవన చర్యలు మందగించకుండా ఉన్నట్లయితే పెంగ్విన్లు అంతసేపు నీటిలో ఉండటం అసాధ్యమవు తుంది. ఎందుకంటే వాటి శరీరానికి.... పావుగంట సేపు బతికేందుకు కావలసిన ఆక్సిజన్‌ని తమలో నిలుపుకోగలిగే సామర్థ్యం వుండదు.

కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 8 తేడాలను గుర్తించండి



నీడను గుర్తించండి

పక్కన ఇచ్చిన 5 నీడల్లో ఈ జంతువు అసలు నీడ ఏదో గుర్తించండి



కనుక్కోండి



తెలుసా!


డచ్ దేశస్తులు ఏడాదికి సగటున వెయ్యి కిలోమీటర్లు ప్రయాణిస్తారు




ప్రపంచ దేశాలతో పోల్చినపుడు చైనాలో ఉరిశిక్షలు 4 రెట్లు అధికం



కింద ఇచ్చిన బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి



రంగులు వేయండి



'సాక్షి' సెల్ఫీ విత్ గణేశ విజేతలు వీరే

సెప్టెంబర్ 1న బహుమతుల అందజేత

సాక్షి ఆదిశంకర విద్యాసంస్థలు గూడూరు, నెల్లూరు

వినాయక చవితి సందర్భంగా 'సాక్షి' దినపత్రిక, ఆదిశంకర విద్యాసంస్థల పిలుపునందుకుని పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అనేకమంది ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉన్నారు. మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేశారు. కొందరు ఆ ప్రతిమలతో ఫొటోలు తీసుకుని 'సెల్ఫీ విత్ గణేశ' కాంటెస్ట్‌కు పంపించారు. వారిలో 15 మందిని లక్కీ డిప్ ద్వారా 'సాక్షి' ఎంపిక చేసింది. వారికి సెప్టెంబర్ 1న సాయంత్రం 5 గంటలకు నెల్లూరు నగరం కొండాయపాళెంలో జాతీయ రహదారిని ఆనుకుని 'సాక్షి' దినపత్రిక యూనిట్ కార్యాలయంలో ప్రోత్సాహక బహుమతులను అందజేస్తారు. వివరాలకు 98494 19085 నంబర్‌లో సంప్రదించగలరు.

విజేతల వివరాలివీ

సాయిశిరీష (మొలగనూరు, వాకాడు మండలం), పవన్ (మూలాపేట, నెల్లూరు), ఎన్.జయవర్ధన్ (రంగనాయకులపేట, నెల్లూరు), టి.శశి (సూళ్లూరుపేట), ఎస్.వెంకటసుబ్బయ్య (జీఎస్ఆర్ మున్సిపల్ స్కూల్, నెల్లూరు), దీపిక (వడ్లపూడి, మనుబోలు మండలం), కుమార్, కల్యాణి (గూడూరు), లవ్‌నిక్ (రవీంద్ర నగర్, నెల్లూరు), ఆరాధ్య (రాంజీనగర్, నెల్లూరు), కారుణ్యరెడ్డి (నెల్లూరు), విజయలక్ష్మి (నవలాకుల తోట, నెల్లూరు), కావ్యాంజలి (ముత్తుకూరు), అచ్యుత్, అనిరుధ్, వెంకటేష్ (చిన్నపడుగుపాడు), మస్తాన్ (నరుకూరు), భారతి (రెడ్డిపాళెం ఎంపీపీ స్కూల్, వాకాడు మండలం)

బీసీ ఫెడరేషన్ రుణాలకు నిబంధనలు సడలింపు

- వ్యక్తిగత రుణాలు తీసుకునే వెసులు బాటు
- బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటస్వామి


బీసీ ఫెడరేషన్ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటస్వామి

నెల్లూరు రూరల్ : బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ ఫెడరేషన్ (వృత్తి సంఘాలకు)కు మంజూరు చేసే రుణాలకు నిబంధనలను సడలించినట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటస్వామి తెలిపారు. స్థానిక అంబేడ్కర్ సంక్షేమ భవన్‌లోని బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం బీసీ ఫెడరేషన్ల నేతలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈడీ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో రజక, నాయీబ్రాహ్మణ, వడ్డెర, కుమ్మరి, మేదర, వాల్మీకి, సగర, కృష్ణబలిజ, బట్రాజు, విశ్వబ్రాహ్మణ, గౌడ ఫెడరేషన్‌ల్లోని సొసైటీ సభ్యులకు గ్రూపు రుణాలను మం జూరు చేశామన్నారు. ఫెడరేషన్‌ల్లోని 15 మంది సభ్యులు కలిసి యూనిట్‌గా లేదా ఐదు మంది సభ్యులు కలిసి యూనిట్‌గా, వ్యక్తిగతంగా రుణాలు తీసుకునేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నం.18 విడుదల చేసిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం లోనే సవరించిన నిబంధనల ప్రకారం రుణాల సబ్సిడీ మంజూరు చేస్తామని చెప్పారు. అయితే రుణాలు మంజూరుకు సంఘం తీర్మా నం కచ్చితంగా జత చేయాలన్నారు. యూనిట్‌లను మార్చుకునేందుకు సెప్టెంబర్ నెలాఖరు వరకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. లబ్ధిదారులు ఆ యా ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో యూనిట్లను మార్చుకోవా లని సూచించారు. సబ్సిడీ రుణాలకు బ్యాంక్‌లకు ఎలాంటి షూరిటీలు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఎవరైనా అడిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో 11 కులాల ఫెడరేషన్ నాయకులు బెల్లంకొండ శీనయ్య, వెంకటశేషయ్య, శివనారాయణ, నాగరాజు, జనార్ధన్, సీతారామరాజు, వెంకటేశ్వర్లు, పద్మజ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

1, 2 తేదీల్లో డే బోర్డర్ సెంటర్‌కు క్రీడాకారుల ఎంపిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : రాష్ట్ర ప్రభుత్వ నూతన క్రీడావిధానంలో భాగంగా ఏర్పాటు చేసిన డే బోర్డర్ సెంటర్లలో శిక్షణ కోసం క్రీడాకారుల ఎంపికలను సెప్టెంబర్ 1, 2 తేదీల్లో చేయనున్నట్లు డీఎస్‌డీఓ పీవీ రమణయ్య తెలిపారు. 13– 25 ఏళ్ల లోపు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలు తమ క్రీడా నైపుణ్యాన్ని మెరుగు పరచుకునేందుకు డేబోర్డర్ సెంటర్లు ఉపయోగపడతాయన్నారు. ఇందుకు సంబంధించి అథ్లెటిక్స్, ఖోఖో, బాస్కెట్‌బాల్, పుట్‌బాల్ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొన్న ప్రతిభగల క్రీడాకారులను ఎంపికలు చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 1న అథ్లెటిక్స్, ఖోఖో, బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు, 2న పుట్‌బాల్ క్రీడాకారులకు స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉదయం 9 గంటల నుంచి ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఎంపిక చేసి ఆమోదం నిమిత్తం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ అనుమతికి పంపనున్నట్లు తెలిపారు. ఆమోదం తర్వాత ప్రభుత్వం ద్వారా తర్ఫీదు ఉంటుందన్నారు.

డే బోర్డర్ సెంటర్ల ఏర్పాటు


ఆయా ప్రాంతాల్లో 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌తో పాటు అథ్లెటిక్ ఈవెంట్లు, టీమ్ పోటీలు నిర్వహించగల క్రీడా మైదానాలు ఉన్న జూనియర్, డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు సైతం డేబోర్డర్ ఏర్పాటుకు క్రీడా ప్రాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి డే బోర్డర్ సెంటర్‌కు ప్రత్యేక సదుపాయాలు ఉంటాయన్నారు. సమాచారం కోసం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయం పనిచేసే దినాల్లో సంప్రదించవచ్చన్నారు. ఇతర వివరాలకు 9866317322 నంబరులో సంప్రదించాలని కోరారు.

వచ్చే నెల 11 నుంచి సమ్మెటివ్–1 పరీక్షలు

నెల్లూరు (టౌన్) : జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలల్లోని విద్యార్థులకు సెప్టెంబరు 11వ తేదీ నుంచి సమ్మెటివ్–1 పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాలలకు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు వచ్చే నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరుగుతాయి. పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు నిర్వహించనున్నారు.

తేదీ	10 నుంచి 12.45 వరకు	2 నుంచి 4.45 వరకు
6 నుంచి	10వ తరగతి వరకు	7 నుంచి 10వ తరగతి వరకు
11	ఓరియెంటల్ లాంగ్వేజీ	సంస్కృతం
12	తెలుగు	తెలుగు–2
13	హిందీ	హిందీ
14	ఇంగ్లిష్	ఇంగ్లిష్ –2
15	మ్యాథ్స్	మ్యాథ్స్–2
16	ఫిజికల్ సైన్స్	బయోలజికల్ సైన్స్
18	సోషల్	సోషల్–2

పీఎస్ఎల్వీ సీ-39 సూక్ష్మ నమూనా



పీఎస్ఎల్వీ సీ-39 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ నగరంలోని భక్తవత్సలనగర్‌కు చెందిన కార్పెంటర్ శ్రీనివాసులు తన వృత్తి నైపుణ్యంతో గుడ్డ ముక్కలు, సన్నని చీలలతో రాకెట్ నమూనాలను తీర్చిదిద్దారు.
– నెల్లూరు (బృందావనం)



పనికి రాని పెన్నులతో..

ఇస్రో పీఎస్ఎల్‌వీ సీ-39 ప్రయోగం నేపథ్యంలో గూడూరు మండలంలోని నెర్నూరు ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు పండిట్ కొండూరు వెంకటేశ్వరరాజు ఫెవిస్టిక్ బార్‌లు, ఖాళీ పెన్నులతో రాకెట్ నమూనా చిత్రాన్ని రూపొందించారు. – గూడూరు రూరల్

యువజన సంఘాల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (వేదాయపాళెం) : క్రీడల మంత్రిత్వశాఖ, యువజన వ్యవహారాలు, నెహ్రూ యువకేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో 2016–17 ఏడాదికి జిల్లా స్థాయిలో ఉత్తమ యువజన సంఘాల అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన సమన్వయకర్త ఎస్.భరత్ తెలిపారు. గుర్తింపు కలిగిన యువజన సంఘాలు మహిళా సంఘాలు 1–4–2016 నుంచి 31–3–2017 తేదీ వరకు విద్య, వైద్యం, ఆరోగ్యం, క్రీడలు, పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రమదానం, స్వచ్ఛభారత్, వృత్తి శిక్షణ కార్యక్రమాల్లో సేవలందించి ఉండాలన్నారు. యువజనాభివృద్ధికి తోడ్పడిన కార్యక్రమాలకు సంబంధించి ఫొటోలు, పత్రికా ప్రచురణలను నిర్ణీత దరఖాస్తుతో పాటు జత చేయాలన్నారు. ఎంపికైన సంఘానికి రూ.25 వేల నగదు, ప్రశంసా పత్రం అందజేస్తారని తెలిపారు. అర్హత కలిగిన యువజన సంఘాలు, మహిళా సంఘాలు వచ్చే నెల 20వ తేదీ లోపు నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలోని నెహ్రూ యువ కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. వివరాలకు 0861–2328680 నంబరులో సంప్రదించాలన్నారు.

సెప్టెంబర్ 15 వరకు ప్రతిభా పురస్కారాలకు గడువు

నెల్లూరు (దర్గామిట్ట) : నెల్లూ రు జిల్లాని పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కోసం మార్కుల జాబితాను సెప్టెంబర్ 15వ తేదీ లోపు అందజేయాలని జిల్లా పద్మశాలి సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, కోశాధికారి బుధవారపు బాలాజీ, రామనాథం రాజశేఖర్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదివి 7 నుంచి 8.5 గ్రేడ్స్ దాటిన విద్యార్థులు అర్హులన్నారు. 77021 13558లో సంప్రదించాలన్నారు.

మునిసి'పల్స్'

కన్నుపడితే.. హాంఫట్


నెల్లూరు మూలాపేటలో కార్పొరేషన్ స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన పాఠశాల క్రీడా మైదానం

❖ అధికార పార్టీ అండదండలతో దర్జాగా అనుభవం
❖ రూ.కోట్ల విలువజేసే భూములు అన్యాక్రాంతం

జిల్లాలో కార్పొరేషన్, మున్సిపాల్టీలకు సంబంధించిన రిజర్వ్‌డ్ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. పట్టించుకోవాల్సిన మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తుండటంతో ఇష్టానుసారంగా ఆక్రమించి భవనాలను నిర్మిస్తున్నారు. నెల్లూరు కార్పొరేషన్‌లో ఈ తంతు జోరుగా సాగుతోంది. కాలువ కట్టలు, తదితర ప్రాంతాల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్లపై ప్రతాపం చూపిస్తున్న అధికారులు బడాబాబుల జోలికెళ్లకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కనిపించిందా జాగా.. వేయ్ పాగా


ఆక్రమిత స్థలాల్లో ఏర్పాటు చేసిన గడ్డివాములు

ఆత్మకూరు రూరల్: ఐదేళ్ల క్రితం సీ గ్రేడ్ మున్సిపాల్టీగా అవతరించిన ఆత్మకూరులో ఒక్కసారిగా స్థలాలకు డిమాండ్ ఏర్పడింది. ఇదే అదునుగా మున్సిపాల్టీ పరిధిలోని ఖాళీ స్థలాలపై పలువురు కన్నేసి ఆక్రమించుకున్నారు. ఆయా స్థలాల్లో దర్జాగా ఇటుకల బట్టీలను ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహిస్తుండగా.. మరికొందరు ఏకంగా పక్కాభవనాలను కట్టి అద్దెలకు ఇచ్చేశారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మి మున్సిపల్ స్థలాల ఆక్రమణలను పరిశీలించి కొన్ని స్థలాలకు ప్రహరీలను నిర్మించి బోర్డులను ఏర్పాటు చేశారు. అనంతరం మున్సిపల్ తొలి పాలకవర్గం ఏర్పడినా మున్సిపల్ స్థలాల అన్యాక్రాంతంపై ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం. పట్టణ పరిధిలోని టెక్కె, బట్టేపాడు రహదారుల్లో పలు విలువైన స్థలాలు ఆక్రమణలకు గురైన అంశంపై పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు స్పందించిన కమిషనర్ అవి మున్సిపల్ స్థలాలంటూ బోర్డులను ఏర్పాటు చేశారు. తదనంతరం ఆక్రమణదారులు ఏకంగా బోర్డులను తొలగించి అధికారులను నమ్మించేందుకు రైతుల ఆధీనంలో ఉన్నట్లుగా గడ్డివాములను ఆ స్థలాల్లో ఏర్పాటు చేశారు. సుమారు పదెకరాలకు పైగా ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నాయి. ఆక్రమణదారులకు టీడీపీ నేతలు మద్దతుగా నిలుస్తున్నారు. మరోవైపు ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెం వద్ద పెన్నానదిపై భారీ స్థాయి వంతెనను నిర్మించడంతో చేజర్ల మండలానికి దగ్గర దారి ఏర్పడింది. వెంకటగిరి, తిరుపతి ప్రాంతాలకు ఆత్మకూరు నుంచి దూరం తగ్గడం, హైదరాబాద్ నుంచి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేస్తున్న జాతీయ రహదారికి ఈ మార్గం అందుబాటులో ఉండటంతో మున్సిపాల్టీ పరిధిలో మరో బస్టాండ్‌ను ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. బస్టాండ్ ఏర్పాటుకు బట్టేపాడు మార్గంలోని మున్సిపల్ స్థలాన్ని ప్రతిపాదిస్తున్నారు. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో 30 ప్రభుత్వ స్థలాలను గుర్తించామని, వీటిలో ఓ స్థలంలో పార్క్ ఏర్పాటుకు యత్నిస్తున్నామని కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

వివాదంలో భూములు

గూడూరు: మున్సిపాల్టీలో 30 ఏళ్ల క్రితం ఏర్పాటైన నాలుగు పార్కులూ అభివృద్ధికి నోచుకోలేదు. నాలుగు పార్కులతోపాటు, మున్సిపాల్టీకి చెందిన మరో రెండు స్థలాల విలువ సుమారు రూ.6.7 కోట్లు ఉంటుంది. రెండో పట్టణంలో ఉన్న 96 సెంట్ల స్థలం వివాదంలో ఉంది. ఈ స్థలం విలువ ప్రస్తుతం సుమారు రూ.10 కోట్ల వరకూ ఉంటుంది. వైఎస్సార్, పీఎస్సార్, ఎన్టీఆర్, సర్వేపల్లి రామారావు పార్కులు 1.17 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. వీటి విలువ రూ.5.4 కోట్లు. అలాగే రెండో పట్టణంలోని అన్నంగి బాబూరావు పార్కులో సగానికి పైగా రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు కేటాయించారు. మిగిలిన 50 అంకణాల స్థలం ఎలాంటి అభివృద్ధికి నోచుకోక వృథాగా ఉంది. అదే ప్రాంతంలోని స్వర్ణాంధ్రభారత్‌నగర్‌లో సుమారు 60 అంకణాల్లో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. పట్టణంలోని వినాయక స్వామి ఆలయం వెనుక భాగంలో మున్సిపాల్టీకి చెందిన 96 సెంట్ల స్థలం కొంత ఆక్రమణకు గురికాగా, మిగిలిన స్థలంలో ప్రాథమిక పాఠశాల ఉంది.


గూడూరు రెండో పట్టణంలో వివాదాస్పదంగా మారిన స్థలం


నెల్లూరు పద్మావతినగర్‌లో కార్పొరేషన్ స్థలంలో నిర్మించిన షెడ్డు

కార్పొరేషన్‌లో ఆక్రమణల జోరు

నెల్లూరు(పొగతోట):

నెల్లూరు కార్పొరేషన్‌లో పేదలు ఆక్రమించిన స్థలాలను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు బడాబాబుల జోలికి మాత్రం వెళ్లడంలేదు. నగరంలో అధికార పార్టీ నేతలు అన్నీ తామై వ్యవహరిస్తూ కార్పొరేషన్ స్థలాలను ఇష్టానుసారంగా ఆక్రమించుకుంటున్నారు. మూలాపేటలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు కార్పొరేషన్ స్థలాన్ని ఆక్రమించి పాఠశాల ఆట స్థలంగా వినియోగిస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా గోడను నిర్మించడంతో పాటు ముందు దేవాలయం, మసీదును నిర్మించారు. చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలో 110 అంకణాల కార్పొరేషన్ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీని నిర్మించారు. పద్మావతినగర్ ప్రాంతంలో కార్పొరేషన్ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీని ఏర్పాటు చేసి రూమ్‌ను నిర్మించారు. కార్పొరేషన్ పరిధిలో సుమారు 140 ప్రాంతాల్లో 180 ఎకరాల భూములు ఉండగా, ఇందులో 50 ఎకరాల వరకు అన్యాక్రాంతమైనట్లు సమాచారం. మూలాపేట, చిల్డ్రన్స్‌పార్క్, బీవీనగర్, తదితర ప్రాంతాల్లో కార్పొరేషన్ స్థలాలను మార్పు చేసి పట్టా భూములుగా మార్చినట్లు సమాచారం. కొందరు నకిలీ పత్రాలను సృష్టించి కార్పొరేషన్ స్థలాలను ఆక్రమించగా, మరికొందరు బోగస్ పత్రాలతో స్థలాలు తమవంటూ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. కార్పొరేషన్‌లో భూముల మార్పు 15 ఏళ్ల నుంచే ప్రారంభమైంది. దీని వల్ల అన్యాక్రాంతమైన భూములను గుర్తించడం అధికారులకు తలనొప్పిగా పరిణమించింది. అధికారులు గుర్తించిన స్థలాలను ఆక్రమణకు గురికాకుండా కాపాడగలుగుతున్నారు. మూలాపేటలో అధికార పార్టీ నాయకుడు ఆక్రమించిన కార్పొరేషన్ స్థలంపై కమిషనర్ ఢిల్లీరావును సాక్షి సంప్రదించగా, కార్పొరేషన్ స్థలమని కొందరు.. మరికొందరు తమ స్థలమంటూ కోర్టును ఆశ్రయించారని, రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాకే నిర్ధారణకు వస్తామని బదులిచ్చారు.

ఆక్రమించడం.. శాశ్వతంగా నిర్మించడం

వెంకటగిరి: వెంకటగిరి 2004లో మున్సిపాల్టీగా ఆవిర్భవించిన నాటి నుంచి స్థలాల ధరలకు రెక్కలొచ్చాయి. ఆక్రమించడం, అనంతరం శాశ్వత నిర్మాణాలు చేపట్టడం షరా మామూలైంది. ఆస్తుల రక్షణ, అక్రమార్కులపై చర్యలకు అధికారులు వెనుకడుగేస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం పట్టణంలోని ఎన్జీఓ కాలనీ, ఈశ్వర్‌నగర్, సుదర్శన్‌నగర్, ఎన్టీఆర్ కాలనీ, ధర్మాపురం, రామలింగేశ్వర ప్రాంతం, అక్కసముద్రం ప్రాంతాల్లో సుమారు 15.47 ఎకరాల స్థలం మున్సిపాల్టీకి ఉంది. అక్కసముద్రం ప్రాంతంలోని పదెకరాల్లో డంపింగ్‌యార్డును నిర్మించారు. మిగిలిన ప్రాంతాల్లోని స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉన్నా, ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఉపాధ్యాయనగర్ సమీపంలోని వీవర్స్ కాలనీలో సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలాలను సైతం కబ్జా చేయడం, ఆపై తమకు మార్కెట్ రేటుకు కేటాయించాలని అధికార పార్టీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సతీమణి కురుగొండ్ల సింధు పురపాలక సంఘానికి దరఖాస్తు చేసుకున్నారు. దీనికి ప్రస్తుత పాలకవర్గం ఆమోదం తెలిపి ఉన్నతాధికారులకు పంపినా అడిగే నాథుడే కరువయ్యారు. ఇక మున్సిపాల్టీ పరిధిలోని ముఖ్యమైన రోడ్ల వెంట స్థలాలను తమ సొంత స్థలంలో కలిపేసుకొని పక్కా భవనాలు, దుకాణాలను నిర్మిస్తున్నారు. రోడ్డు వెంట వరదనీరు పోయే డ్రెయిన్లనూ వదిలిపెట్టడంలేదు. మున్సిపల్ స్థలాల్లో కనీసం బోర్డులను సైతం ఏర్పాటు చేయడంలేదు.


వెంకటగిరిలోని కాలేజీ మిట్ట ప్రాంతం నుంచి కైవల్యా నదిలోకి వరదనీరు ప్రవహించే కాలువ ఆక్రమణ

మున్సిపాల్టీ స్థలాల వివరాలు

ప్రదేశం	విస్తీర్ణం (ఎకరాల్లో)	ప్రభుత్వ విలువ (రూ)
ఎన్జీఓ కాలనీ	0.50	41,14,000
ఈశ్వర్ నగర్	0.07	8,00,000
సుదర్శన్‌నగర్ -1	0.03	3,00,000
సుదర్శన్‌నగర్ -2	0.45	37,00,000
ఎన్టీఆర్‌కాలనీ -1	0.22	23,00,000
ఎన్టీఆర్ కాలనీ -2	0.15	16,00,000
ధర్మాపురం	1.00	2,47,00,000
అక్కసముద్రం	10.00	5,81,00,000
రామలింగేశ్వర ప్రాంతం	1.05	12,00,000

స్థలాల కేటాయింపులో నిర్లక్ష్యం

నాయుడుపేట టౌన్: నాయుడుపేట నగర పంచాయతీలో రిజర్వ్‌డ్ స్థలాల కేటాయింపులో నిర్లక్ష్యం చూపుతున్నారు. ప్రభుత్వ అప్రూవల్ లేకుండా సుమారు 25కు పైగా లే అవుట్లు ఉండగా, కేవలం 1.82 ఎకరాల మేరే ప్రభుత్వ స్థలాన్ని రిజర్వ్ చేశారు. పిచ్చిరెడ్డితోపులోని బీఎమ్మార్ లేఅవుట్ ఒక్కటే ప్రభుత్వ అప్రూవల్ పొందింది. దీనికి సంబంధించిన 0.90 సెంట్లు, కొత్త బీడీ కాలనీలో 0.27 సెంట్లు, శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు వద్ద 0.55 సెంట్లు మాత్రమే అధికారులు నగర పంచాయతీకి సంబంధించిన భూమిగా రిజర్వ్ చేశారు. ఇటీవల గోమతి సెంటర్ సమీపంలో టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఓ భారీ వెంచర్‌ను ఏర్పాటు చేసి అప్రూవల్ కోసం మున్సిపల్ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపారు. అయితే ముందుగా ప్రభుత్వం కేటాయించాల్సిన భూమిని రిజర్వ్ చేసుకొని స్థానిక మున్సిపల్ శాఖకు రిజిస్ట్రేషన్ సైతం చేసి ఇవ్వాల్సి ఉంది. అయితే ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదని సమాచారం. పట్టణంలో సుమారు 25కు పైగా అనధికార లేఅవుట్లు ఉన్నాయి. వీటి ద్వారా రిజర్వ్‌డ్ స్థలాలు చాలా వరకు వచ్చే అవకాశం ఉంది. అయితే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

రూ.300 కోట్ల విలువైన భూములకు ఎసరు


సూళ్లూరుపేటలో ఆక్రమణలతో కుచించుకుపోయిన దశబ్బంద గుంత

సూళ్లూరుపేట: పట్టణంలో భూములకు ఉన్న డిమాండ్ దృష్ట్యా పలువురు ఇష్టానుసారంగా ఆక్రమిస్తున్నారు. పట్టణంలో రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసిన వాళ్లు చాలా మంది పట్టా పొలాన్ని కొనుగోలు చేసి బారెడు అసైన్‌మెంట్ భూములను కలుపుకొని ప్లాట్లు వేసి విక్రయించిన ఉదంతాలూ ఉన్నాయి. మున్సిపాల్టీ పరిధిలో సుమారు రూ.300 కోట్ల విలువజేసే ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు రెవెన్యూ రికార్డులు చెప్తున్నాయి. మున్సిపాల్టీ పరిధిలోకి వచ్చే రెండు చెరువులు, మూడు గుంటలు కలిపి సుమారు 125 ఎకరాలు కబ్జా కోరల్లో ఉన్నాయి. ఇవి మేజర్ పంచాయతీగా ఉన్నప్పటి నుంచే కబ్జా చెరలో ఉన్నాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న ఎరబాళెం చెరువు 90 శాతానికి పైగా సుమారు 30 నుంచి 40 ఎకరాల వరకు కబ్జాకు గురైంది. మున్సిపాల్టీ పరిధిలోని 69.5 ఎకరాల పడమటికండ్రిగ చెరువు కూడా అన్యాక్రాంతమైపోయింది. దీనికి క్రయవిక్రయాలు కూడా జరిగిపోతున్నాయి. పట్టణంలోని దశబ్బందం, స్వతంత్రపురం, కోళ్లమిట్టలోని మరో గుంతతో పాటు పలు గుంతలు కబ్జా కోరల్లో చిక్కుకుపోయి ఉన్నాయి. పట్టణ పరిధిలో సుమారు 29 లేఅవుట్లు వేయగా, దీనికి పది శాతం భూమి మున్సిపాల్టీకి వదలకపోగా ఆ వెంచర్‌లో ఉన్న ప్రభుత్వ భూమినే మింగేసిన ఘనులున్నారు. మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాల్టీగా రూపాంతరం చెందాక మున్సిపల్ భూముల వివరాలను రెవెన్యూ అధికారుల నుంచి మున్సిపల్ అధికారులు తీసుకోవాల్సి ఉండగా, ఆ ప్రక్రియ నేటికీ జరగలేదు. పందలగుంట ప్రాంతంలో సుమారు 25 ఎకరాలకు పైగా అసైన్డ్ భూములు భూస్వాముల చేతుల్లోనే ఉన్నాయి. మున్సిపాల్టీ లెక్కల ప్రకారం 17.74 ఎకరాల రిజర్వ్‌డ్ స్థలాలు మాత్రమే ఉన్నాయి. పరమేశ్వరినగర్ సమీపంలో మున్సిపాల్టీకి చెందిన 92 సెంట్ల భూమి ఆక్రమణపై కోర్టులో కేసు జరుగుతోంది. పడమటికండ్రిగ, ఎరబాళెం చెరువుల ఆక్రమణలపై ఎలాంటి చర్యలు లేకుండాపోయాయి. పడమటికండ్రిగ చెరువును డంపింగ్ యార్డుగా ఎంపిక చేసేందుకు చైర్‌పర్సన్ నూలేటి విజయలక్ష్మి యత్నించగా, అప్పటి కాంగ్రెస్ పార్టీ నాయకుల నుంచి ఒత్తిడి రావడంతో ఈ యత్నాన్ని విరమించుకున్నారు.

కబ్జా కోరల్లో రిజర్వ్‌డ్ స్థలాలు


కావలిలో ఆక్రమణకు గురైన స్థలం

కావలి: కావలి మున్సిపాల్టీలో రిజర్వ్‌డ్ స్థలాలు కబ్జా కోరల్లో ఉన్నాయి. కావలి పంచాయతీ నుంచి మున్సిపాల్టీగా అవతరించిన సమయంలో పట్టణంలోని వెంగళరావునగర్‌లో 70 ఎకరాల రిజర్వ్‌డ్ స్థలం ఉండేది. అయితే ఆక్రమణకు గురవడంతో ప్రస్తుతం రెండెకరాలు కూడా లేదు. పట్టణం మొత్తమ్మీద వందెకరాలకు గానూ ప్రస్తుతం 15 ఎకరాల రిజర్వ్‌డ్ స్థలం కూడా లేదు. మున్సిపాల్టీ లేఅవుట్ పెట్టి ప్లాట్లు అమ్మకాలు చేసిన బాపూజీ నగర్‌లో 56 సెంట్లు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం రిజర్వ్‌డ్ స్థలాన్ని వదిలిపెట్టారు. అయితే వాటిలో 20 ఏళ్ల నుంచి ఎలాంటి నిర్మాణం చేయకపోగా, కనీస జాగ్రత్త చర్యలు కూడా తీసుకోలేదు. రూ.కోట్ల విలువజేసే ఈ స్థలం ఆక్రమణకు గురైంది. ఇటీవల హౌసింగ్ శాఖ అక్కడ ఉన్న కబ్జాదారులకు ఇళ్లు నిర్మించుకోవడానికి పక్కా గృహాలను మంజూరు చేసింది. వారు నిర్మాణాలు ప్రారంభించేసరికి, అప్పుడు కళ్లు తెరిచిన మున్సిపాల్టీ హౌసింగ్ శాఖతో సంప్రదించి మంజూరైన గృహాలను రద్దు చేసింది. పట్టణంలో ఎన్నో రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిశాయి. వీటిలో కచ్చితంగా రిజర్వ్‌డ్ స్థలాలు ఉండాలి. అయితే మున్సిపాల్టీ ఒక్క రిజర్వ్‌డ్ స్థలాన్ని కూడా స్వాధీనం చేసుకోలేదు. పట్టణ పరిధిలో స్థలాల రేట్లు రూ.లక్షలు పలుకుతుండటంతో ఆక్రమణదారలు వాటిని వశపర్చుకుంటున్నారు.